# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

డిసెంబర్
2024

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 17 సంచిక: 12


సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు


ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| మంగళప్రదం, మహిమోపేతం, మోక్షప్రదాయిని – భగవద్గీత | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 21 |
| గోదాదేవి వైభవమ్ | 28 |
| శ్రీకృష్ణ తత్త్వం | 31 |
| రాముడు – లోకాభిరాముడు | 36 |
| రామాయణ రత్నాకరం | 38 |
| హనుమద్వ్రతం | 42 |
| ముకుందమాల | 43 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 48 |
| సులభ ప్రసన్నుడు – సుబ్రహ్మణ్యుడు | 52 |
| విష్ణుచిత్తుల వారి విశిష్ట విష్ణు భక్తి | 55 |
| మీ ప్రశ్న మా సమాధానం | 59 |
| తిరుమల సర్వస్వం | 60 |
| అష్టలక్ష్మి స్వరూపాలు | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# భక్తుని ఆభూషణం

భగవంతుడు మనిషికి బుద్ధిని ప్రసాదించాడు. విచక్షణా జ్ఞానంతో మంచి చెడ్డలను తెలుసుకొని ఆ రీతిగా నడుచుకొమ్మన్నాడు. భక్తుడు భగవంతుని చేరుటకు, ఆయన కృపను పొందుటకు నానా విధాలుగా ప్రయత్నిస్తుంటాడు. నవవిధ భక్తులలో తనకు తోచిన విధానాన్ని అవలంబించి సాధన చేస్తుంటాడు. మరికొందరు భగవంతుణ్ణి తృప్తి పరచుటకు యజ్ఞ యాగాదులను, దాన ధర్మాలను చేయగా, ఇంకొందరు స్వామివారికి కానుకలు సమర్పించి తమ భక్తిని చాటుకుంటారు. మరికొందరు భగవంతునికి శరణాగతి చేసి మీరే దిక్కని సమర్పించబడుదురు. ఇవి భగవంతుని కృపను పొందుటకు భక్తులు ఆచరించే విధానాలు. ఇక భగవంతుడు ఏ భక్తుణ్ణి అనుగ్రహిస్తాడు? ఆయనకు ఎవరంటే ఇష్టం? అన్నదానికి సమాధానం చెప్పడం కష్టమే. ఆయనకు భక్తులందరూ సమానమే అయినప్పటికీ మానవ విలువలతో జీవనం సాగించే వారిని, సమాజ హితం కోసం భగవంతుణ్ణి ఆశ్రయించేవారిని, ఇతరుల కష్టాలను తీర్చుటకు ప్రయత్నించేవారిని, చేతనైన సహాయం చేయువారిని, ముఖ్యంగా ఈ విశ్వంలో అంతటా భగవంతుడిని దర్శించేవారంటే స్వామివారికి ప్రియం. తనను తాను సంస్కరించుకున్న భక్తుడంటే భగవంతునికి ఎంతో ప్రియం. భగవంతుడు ఏనాడూ భక్తుడి నుండి ధన కనక వస్తు వాహనాలను ఆశించడు. పత్రం పుష్పం ఫలం తోయం సమర్పించి నిష్కామ భక్తితో భగవంతుని కోరే భక్తుడంటే ఆయనకు ఎంతో ఇష్టం. కాని ఆ భక్తుడు తనను తాను సంస్కరించుకోవాలి. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే అరిషడ్వర్గాలనే వికారాల నుండి సంస్కరించబడాలి. సత్వగుణం అలవరచుకుని ఉండాలి. చిత్తం భగవన్మయం కావాలి. ఇలాంటి భక్తుడంటే భగవంతునికి ఎంతో ఇష్టం. కాని ఈ స్థితికి సాధకులు తప్ప సాధారణ భక్తులు రాలేకపోవచ్చును. అలాంటివారు వారికి చేతనైనంత తమను తాము సంస్కరించుకోవాలి. ఏ పని ఇతరులు చేస్తే మనము నొచ్చుకుంటామో ఆ పని మనము ఇతరుల పట్ల చేయరాదు. చేతనైన సహాయము చేయాలి. ముఖ్యంగా మన మనస్సులో ఎలాంటి అధర్మ, చెడు ఆలోచనలు రాకూడదు. ఒక సాధారణ మనిషి మనలోని వ్యత్యాసాన్ని సులభంగా గుర్తించగలిగే స్థితిలో ఉండాలి. నిజానికి మనని మనము సంస్కరించుకొనుటకు వీలుగా ఈ జీవితము లభించింది. దీనిని సద్వినియోగము చేసుకుని భగవంతుని కృపను పొందుట మన కర్తవ్యం. మంచి చెడు విచక్షణా జ్ఞానం వారి వారి హృదయాలలో ముందుగానే ఏర్పరచి పెడతాడు. దాని అనుసారంగా జీవిస్తే సరిపోతుంది. తనను తాను సంస్కరించుకొనుట భక్తుని ఆభూషణం. ఈ లోకంలోని ప్రతీదీ నశ్వరమే, కాబట్టి భగవంతునిపై తప్ప మరోదానిపై సాధ్యమైనంతవరకు మోహాన్ని తగ్గించుకోవాలి. ఎంత వైరాగ్యంగా జీవిస్తే అంత భగవంతుని కృపకు పాత్రులమౌతాము. భగవంతునికై ఎంత తపిస్తామో దానికి అనుగుణంగా స్వామి కృప లభిస్తుంది. భగవంతుడు ఎప్పుడూ భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా ఎదురు చూస్తుంటాడు. నిజ జీవితంలో మన సమస్యలు భక్తిని పెంపొందించుకొనుటకు, మనని మనము సంస్కరించుకొనుటకు లభించిన సాధనాలు. మనకు ఎదురగు ప్రతి సమస్య భగవంతుని చేరుటకు సాధనముగా మలచుకొని సాధన చేయుట ఉత్తమము. ప్రతి సమస్యలో కొంత కొంత వికారాలను తొలగించుకొని భగవంతుడు మెచ్చే రీతిగా జీవిద్దాం. శ్రీ వేంకటేశ్వరుని కృపను పొందుదాం.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు

(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593

(Ifsc Code: PUNB0110010)

Punjab National Bank,

Habsiguda, Hyderabadలో

చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ______________________

______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

చందా వివరాలు: ______________________

మా చిరునామా:

శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,

హబ్సిగూడ, హైదరాబాద్-500 007.

ఫోన్: 040-27175050


సెల్: 9348212354

Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు**

**స్వామివారి పవిత్ర పాదాలు**

**(10"x8") ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో॥ కమలాకుచ చూచుక కుంకుమతో**
**నియతారుణి తాతుల నీలతనో**
**కమలాయత లోచన లోకపతే**
**విజయీభవ వేంకట శైలపతే**

తాత్పర్యం – లక్ష్మీదేవి స్తనాగ్రములందలి కుంకుమ వర్ణముచే ఎఱ్రనైన నీలవర్ణ శరీరము కలవాడా! తామర పుష్పదళముల వలె విశాలముగ నున్న కన్నులు గలవాడా! లోకనాథుడా! వేంకటాచలపతే! నీవు విజయుడవు కమ్ము!

**శ్లో॥ సచతుర్ముఖ షణ్ముఖ పంచముఖ**
**ప్రముఖాఖిల దైవత మౌళిమణే!**
**శరణాగత వత్సల! సారనిధే**
**పరిపాలయమాం వృషశైలపతే**

తాత్పర్యం – బ్రహ్మతో కూడిన కుమారస్వామి, శివుడు మొదలైన ముఖ్యులైన దేవతలందరికీ నాయకుడవైన, శరణు పొందిన భక్తుల యందు వాత్సల్యము కలిగి, సారములగు పదార్థములన్నింటికి నిధివైన వృషాచలపతీ! నన్ను రక్షింపుము.

# ముక్తిమార్గము



భావానువాదం:

**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

**సామాన్యమా పూర్వ – సంగ్రహంబగు ఫలము**
**నేమమునఁ బెనగొనియె – నీఁడు నీవనక ||పల్లవి||**

1. **జగతిఁ బ్రాణులకెల్ల – సంసార బంధంబు**
   **తగుల బంధించు దురి – తంపుఁ గర్మమున**
   **మగుడ మారుకు మారు – మగువ నీయురముపై**
   **తెగి కట్టిరెవ్వరో – దేవుండ వనక ||సామా||**
2. **పనిలేక జీవులను – భవసాగరంబులో**
   **మునుఁగ లేవఁగఁజేయు – మోహదోషమున,**
   **పనిపూని జలధిలోఁ – బండఁబెట్టిరి నిన్ను**
   **వెనకెవ్వరో మొదలి – వేలుపనక ||సామా||**
3. **ఉండనీయక జీవ – నోపాయమున మమ్ము**
   **కొండలను గొబల తతి – గొని త్రిప్ప ఫలము**
   **కొండలను నెలకొన్న – కోనేటి పతి వనఁగ**
   **నుండవలసెను నీకు – నోపలేననక ||సామా||**





భావము – దేవా! తొల్లి తాను చేసిన కర్మమునకు కలుగు ఫలము సామాన్యమైనది కాదు సుమా! దానిని తప్పించుకొనుట కెవ్వరికిని శక్యము కాదు. అది నియమము తప్పక దేవాధి దేవుడవైన నిన్నుగూడ లెక్కగొనక పట్టి పీడించుచున్నది.

నీవు లోకములోని ప్రాణులకందరికీ సంసారము అను బంధమును తగుల గట్టితివి. ఆ పాపకర్మము నిన్ను వదలలేదు. దానికి ఫలముగా నీవు దేవుడవన్న భావముతోనైన నిన్ను వదిలిపెట్టక ఎవ్వరో సాహసించి నీ యెదపై సంసార కారణమైన ఒక కాంతను తగుల గట్టిరి.

నీవు మరొక ప్రయోజనవంతమైన పని యేమియు లేక భవ సముద్రములో ఊరక జీవులను ముంచుట, తేల్చుటయే పనిగా పెట్టుకొన్నావు. ఆ మోహ దోషము నిన్ను వీడిపోలేదు. దానికి ఫలముగా పూర్వమెవరో అందుకని పూని ఆదిదేవుడని యైన తలంపక నిన్ను సముద్రములో పండబెట్టినారు.

మరియు నీవు మమ్మొకచోట కుదురుగా ఉండనీయక జీవనోపాయమునకై కొండలలో, గుహలలో అదేపనిగా తిరుగులాడునట్లు చేసితివి. దాని ఫలము నిన్ను వెన్నంటినది. అందువలననే నా చేత గాదని తప్పించుకొని పారిపోవుటకు వీలులేనట్లుగా కోనేటిపతి వన్న పేరుతో కొండలలోనే (తిరుమలలోనే) నీవు నెలకొని యుండక తప్పలేదు.



# మంగళప్రదం, మహిమోపేతం, మోక్షప్రదాయిని

# భగవద్గీత

-చింతలపాటి శివ శంకర శాస్త్రి

శ్లో ॥ "భూపాదౌ యస్య నాభిః విజయ దసుర నిలః చంద్ర సూర్యాచ నేత్రే
కర్ణా వాసాశ్మిరోద్వేః ముఖమపి దహనో యస్స వాస్తేయ మబ్ధిః
అన్తస్థం యస్య విశ్వం సుర నర ఖగ గో భోగి గనర్ధర్వ దైత్యేః
చిత్రం రం రమ్యతే తం త్రిభువన వపుషం విష్ణుమీశం నమామి"

'మృగశిర' నక్షత్రంతో కూడిన పూర్ణిమ కల మాసమును మార్గశిర మాసం అంటారు. మార్గము అనగా దారి. శిరము అనగా తల. మానవ శరీరమునకు శిరము ఏవిధంగా దిశా నిర్దేశం చేస్తుందో, అదేవిధంగా ఈ మాసం ఆధ్యాత్మికత వైపు దారి చూపుతుంది. భగవదారాధనకు విశేషమైన కాలం, సౌరమానం ప్రకారం 'ధనుర్మాసం' అని అంటారు. ధనుర్మాసంలో నారాయణుని ఆరాధన విశేష ఫలాన్నిస్తుంది. "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" సకల దేవతలకు చేసిన నమస్కారం కేశవునికి చెందుతుంది. "మాసానాం మార్గ శీర్షోహం ఋతూనాం కుసుమాకరః" భగవద్గీతలో మార్గశిర మాసం సాక్షాత్తు తన స్వరూపమని శ్రీకృష్ణుడు చెప్పాడు.

అనంతుడు, అచ్యుతుడు, అప్రమేయుడు, జ్యేష్ఠుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తజన వత్సలుడు, స్థితికారకుడు శ్రీమహావిష్ణువు. ''విష్'' అను ధాతువు నుండి విష్ణు పదం పుట్టింది. 'విష్' యనగా సర్వత్రా వ్యాపించి ఉండటం. అంతటా ఆవరించి ఉండటం. ''యద్ విషితో భవం తద్ విష్ణుర్భవితి' అని శంకరాచార్యులవారి వ్యాఖ్యానం. విష్ణువు అన్నిచోట్ల ఉండేవాడు. ''భూత, భవ్య, భవత్ ప్రభుః' అనగా గడిచిన కాలానికి, జరుగుతున్న కాలానికి, రాబోయే కాలానికి కూడా ప్రభువు.

''భూతకృత్, భూతభృత్ భావం – భూతాత్మా భూత భావనః'' అనగా అన్ని భూతాలను సృష్టించి, భరించేవాడు, అన్ని

జీవుల లోనూ ఉండేవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే విష్ణువు కాలానికి, స్థలానికి, పదార్థానికి అతీతుడు.

**"యచ్చకించిత్ జగత్ సర్వం దృశ్యతే శ్రూయతే పివా**

**అన్తర్బహిశ్చ తత్సర్వం – వ్యాప్య నారాయణ స్థితః"**

కనిపించే,వినిపించేవిశ్వమంతటావ్యాపించినవాడువిష్ణువని అర్థం. నీరు నెలవుగా కలిగి ఉన్నందున నారాయణుడయ్యాడు. మార్గశీర్ష శుక్ల ఏకాదశి భగవద్గీత లోకానికి అందిన రోజును గీతా జయంతిగా లోకమంతా భగవంతుడి ప్రబోధాన్ని మననం చేసుకునే పరమ పవిత్రమైన రోజు.

సర్వ మంగళప్రదమై, సర్వ సందేహాలను తీరుస్తూ భగవద్గీత మనిషికి తోడూ – నీడగా నిలిచింది. జీవన పోరాటంలో విజయాలను పొందడానికి అత్యున్నతమైన ఆయుధంగా సర్వులకూ మోక్షప్రదాయినిగా భగవద్గీత అజరామరంగా నిలిచిపోయింది. భారతీయ ఆధ్యాత్మిక ఆకాశంలో ధృవతార భగవద్గీత. సకల దార్శనిక సిద్ధాంతాలకు ఆలంబనమది. పరాత్పరుని చేరే మార్గాన్ని స్వయంగా భగవానుడే చెప్పిన ప్రబోధమది. జీవాత్మ పరమాత్మల యోగాన్ని ప్రవచించే అపూర్వ, అనంత జ్ఞాన కోశమది. సాక్షాత్తు పరమాత్మ ఆచార్యునిగా నరునికి అందించిన దివ్య ప్రబోధం భగవద్గీత. యుద్ధరంగంలో అర్జునునికి చేసిన ఉపదేశం మహాభారతంలో అంతర్భాగమైనా, విడిగా భగవద్గీతగా, పరమ ప్రామాణికమైన మనస్తత్వ శాస్త్రంగా, ఆరాధనీయ ధార్మిక గ్రంథరాజంగా, న్యాయస్థానాలు ఆమోదించిన ప్రమాణ గ్రంథంగా అవతరించింది. ఇది సాక్షాత్తు భగవంతుని దివ్యవాణి. ఇది సకల వేదసారం. దీనిని భక్తి శ్రద్ధలతో, ఏకాగ్రచిత్తంతో చదివిన వారికి దీనిలో దాగి ఉన్న రహస్యాలు, పారమార్థికాలు అవగతం అవుతాయన్నది సత్య నిర్దిష్టం. భగవద్గీతను పూర్తిగా అవగతం చేసుకున్న వారికి, జీర్ణించుకున్న వారికి వేరే శాస్త్రాలతో పని లేదు. ఎందువలననగా సర్వశాస్త్ర సారం ఇందులో నిబిడీకృతమై ఉన్నది కనుకనే శ్రీ వ్యాసమహర్షి –

**"గీతా సుగీతా కర్తవ్యా కమన్యైః శాస్త్ర విస్తరైః**

**యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాత్ వినిః సృతా"**

అనగా ఇది సాక్షాత్తు పద్మనాభుని ముఖపద్మం నుండి వినిపించబడినది కనుక ఇతర శాస్త్రాలతో పని లేనేలేదు. ఇది ఒక ఉపనిషత్తు. ఇది బ్రహ్మవిద్య. ఇది యోగశాస్త్రం. ఇందులో భగవానుడు మానవునికి కావల్సిన అన్ని విషయాలను స్పృశించి అర్జునునికి చెబుతున్నట్లుగా సర్వజనావళికి బోధ చేస్తాడు. వర్ణాశ్రమ ధర్మాల గురించి చాతుర్వర్ణాల గురించి, వాని ధర్మాల గూర్చి, త్రిగుణాల గూర్చి ఏ గుణాలు ఉన్నవారు ఎలా ప్రవర్తిస్తారో వారి వారి అలవాట్లు, ఆహార వ్యవహారాలు, వారి వారి గుణాలను బట్టి మరుజన్మలో ఏయే జన్మలెత్తుతారో వివరిస్తారు. వివిధములైన యోగాలను గూర్చి ప్రబోధిస్తూ మోక్ష మార్గాన్ని చూపిస్తాడు. దేనిని గూర్చి విచారించాలో, ఎందుకు విచారించకూడదో పరమాత్మను చేరేందుకు గల మార్గాలను గురించి ఎలాంటివారు భగవంతునికి ప్రీతిపాత్రులో వివరిస్తాడు. 'యోగం' అంటే కలయిక. జీవాత్మ పరమాత్మల సంయోగానికి ఈ యోగం మార్గాన్ని సిద్ధపరుస్తుంది. భగవద్గీత మానవ సంస్కార ఔన్నత్యానికి ఉపయుక్తమయ్యే అనేక విషయాలను ప్రబోధించింది. కర్మయోగం, జ్ఞానయోగం, రాజయోగం, భక్తియోగం అనే నాలుగు రకాల యోగాలను గురించి వివరించింది.

యోగం అంటే ఉపాయం. జీవుడు – దేవుడు ఒకటిగా ఐక్యం చెందే ఉపాయం. అదే భగవానుని నుండి జాలువారిన గీతామృతం. అందుకే అది పరమ పవిత్రమైంది. పరమ రహస్యమైంది. భగవద్గీతలో 18 యోగాలున్నాయి. యోగం అంటే భగవంతుని పొందటానికి ఆ స్వామియే సాధనమని ఒక అర్థం. శరణాగతి నిష్ఠులకు ఆ భగవానుడే సాధనమని మరొక అర్థం. "పశ్యమే యోగమైశ్వరం యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్ మహా యోగేశ్వరో హరిః" ఇలా అనేకచోట్ల యోగశబ్దం స్వామికి ప్రయోగింపబడింది.

కురుక్షేత్ర సంగ్రామంలో తనకెదురైన బంధువులు, సోదరులు, గురువులు, వృద్ధులైన వారందరినీ చూసి కర్తవ్య విమూఢుడైన అర్జునునికి ఆత్మ తత్త్వాన్ని గురించి వివరిస్తూ–

**"వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి**

**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ**

**నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః**

**న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః"**

మానవుడు చిరిగిన వస్త్రం వదిలి, నూతన వస్త్రం ధరించిన రీతిగా ఆత్మ కూడా మరణించిన వాని శరీరం వదిలి నూతన శరీరాన్ని ధరిస్తుంది. ఆత్మ ఆయుధములతో చీల్చబడదని, నిప్పుచే దహింపబడదని, నీటిచే తడపబడదని, గాలిచే ఆర్పివేయబడదని, ఆత్మకు నాశనము లేదని దేహము గురించి నీవు వగచుచున్నచో దానికై కాలమును వ్యర్థము చేసుకొన పని లేదని శ్రీకృష్ణుడు స్పష్టంగా చెప్పాడు. అంతేకాక ఆత్మతత్వాన్ని బోధిస్తూనే...

**"జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ**

**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి**

పుట్టిన వానికి మరణం తప్పదని, మరణించిన వానికి పిదప జన్మము తప్పదని అందుచే పరిహరించుటకు వీలులేని ఈ జనన మరణ చక్రాన్ని గురించి విచారించ తగదంటూ ఉపదేశిస్తాడు. ధర్మము కొరకై యుద్ధము చేయుట క్షత్రియుల విద్యుక్త ధర్మమని, నీ విద్యుక్త ధర్మ నిర్వహణను నిర్వహించమని, దేనిని గూర్చి విచారించాలో, దేనిని గూర్చి విచారించకూడదో, ఎందుకు విచారించాలో, ఎందుకు విచారించకూడదో వివరిస్తూ

ఈ జగత్తంతా ఈశ్వరుని మాయాశక్తి రూపమేనని, అందులో ఉన్న నరుడు నిమిత్తమాత్రుడు కనుక ''సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'' – సర్వ ధర్మములను పరిత్యజించి ఈశ్వరునే శరణు జొచ్చితే ఆ పరమాత్ముడే అతనిని అన్ని పాపముల నుండి విముక్తుడిని చేస్తాడని పలికాడు. పోయిన వారిని పదే పదే తల్చుకుని కుమిలిపోతూ ఉండటం వృథా ప్రయాస అని పలికాడు.

జరిగిపోయిన, జరుగుచున్న విషయములను గురించి పదే పదే ఆలోచించడం వలన ప్రయోజనం ఉండదని –

**"ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే**
**సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే"**

విషయాసక్తము చేత కామము, దానివలన క్రోధము, క్రోధము వలన మోహము కలుగునని, అధికమైన మోహము వలన స్మృతి భ్రాంతికి గురియగునని, క్రోధము అనేది మనిషిని ఏ స్థితికి తీసుకుపోతుందో తెలియజేస్తూ స్థితప్రజ్ఞత అవశ్యమని తెలియజేశాడు.

భగవానుని కర్తవ్య ప్రబోధంతో దేహాత్మ భ్రాంతి అర్జునునిలో పోయింది. ఆత్మ పరమాత్మ తత్వం తెలుసుకున్నాడు. నేను కర్తను కాను, భోక్తను కాను, పరతంత్రుడను, సర్వస్వతంత్రుడు పరమాత్మ అన్న యథార్థ జ్ఞానం, తన క్షాత్రధర్మం గుర్తుకువచ్చి తాను నిమిత్త మాత్రుడననే విషయంలో జ్ఞానోదయమై భగవానుడు చెప్పినట్లు చేయడమే కర్తవ్యమని భావించి –

**"నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత**
**స్థితోఽస్మి గతః సందేహః కరిష్యే వచనం తవ"**

అచ్యుతా! నీ కృప వల్ల మోహం నశించింది. స్మృతి (జ్ఞానం) కలిగింది. సంశయాలు తొలగిపోయాయి. నీవు చెప్పినట్లు (యుద్ధం) చేస్తానని పలికాడు.

**"పశ్యామి దేవాం తవ దేవదేవ"**

భగవానుని విశ్వరూపం దర్శించాక, భ్రమలన్నీ తొలగిపోయాక తన సఖుడు, హితుడు సర్వశ్రేష్ఠుడని, సకల చరాచరాలన్నింటిని శాసించే, నిర్వహించే సర్వ జగద్రక్షకుడని గుర్తించి, సర్వమూ వాసుదేవమయమని నమ్మి శరణు వేడినాడు.

**"యత్ర యోగీశ్వర కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ"**

కృష్ణ – అంటే అపరిమితమైన ఆనందాన్ని ఇచ్చేవాడని, మరియు అపరిమితంగా ఆకర్షించేవాడని అర్థం. యుద్ధరంగంలో బంధువులను, సోదరులను, గురువులను చూచి వారందరిని చంపి రాజ్యాన్ని స్వీకరించడంలో ఆనందం లేదని, నావారు అనే అజ్ఞానపు చీకట్ల నుండి జ్ఞాన జ్యోతుల వైపు నడిపించి తన క్షాత్ర ధర్మాన్ని, కర్తవ్యాన్ని బోధించి పార్థుని యుద్ధ కార్యోన్ముఖుని చేసి దుష్టశిక్షణని, శిష్టరక్షణని తన పరంగా కిరీటితో చేయిస్తాడు.



యుద్ధము చేయనని గాండీవాన్ని జారవిడిచిన అర్జునునిచే ''కరిష్యే వచనం తవ'' నీవు చెప్పినట్లు చేస్తానని మళ్ళీ గాండీవం పట్టుకునేటట్లు చేశాడు శ్రీకృష్ణుడు.

భగవంతుని ముఖతః వెలువడిన భగవద్గీత మనకు ఒక వరం. గీతనే గీతామకరందం అని కూడా అంటుంటారు. మకరందమనగా తేనె. భగవద్గీత తేనెవలె సుమధురమై, ఆహ్లాదకరమై, తాపహారకమై ఒప్పుటచే 'మకరందం' అనే పేరు దానికి చేర్చబడింది. తేనెకు రోగ నివారక శక్తి ఎక్కువ. కనుకనే ఔషధాలలో దానిని ఎక్కువగా వాడుతారు. అదేవిధంగా 'గీత' అనే మకరందాన్ని సేవించినవారికి కూడా భవరోగం (సంసార బాధ) సంపూర్ణంగా తొలగిపోతుంది. మధుపం (తేనెటీగ) అనేక పుష్పాల నుండి సేకరించిన తేనెను సమకూర్చుకునే తీరున శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఉపనిషత్తులు అనే వివిధ కుసుమ రాసుల నుండి గీతామకరందాన్ని వెలికి తీసి లోకానికి ప్రసాదించాడు. ఇది 'ధర్మ్యామృతం' అని భగవానుడే గీతయందు సెలవిచ్చాడు.


కాబట్టి అమృత తుల్యమై, జనన మరణ రూప భవతాపాలను నిర్మూలించి వేసే ఈ భగవన్ముఖారవింద సంజనితమైన గీతామకరందాన్ని గ్రోలి పరమాత్మ గానం చేసి ఆ గీతా గానంలో తన్మయులమై ఓలలాడి మన జీవితాలను, జన్మను సార్థకం చేసుకుందాం. పునీతులమవుదాము, కైవల్యప్రాప్తిని పొందుదాము.

**"సర్వేజనా సుఖినో భవంతు"**

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



21వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం


## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

**దిశా నిర్దేశం :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 21 వ భాగపు లీలల ప్రచురణ. (ఫిబ్రవరి 2008 నుండి మే 2008).



తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఆశించిన యోగ్యతను సాధించుటకు వీలుగ, భాగవత ఆశీర్వాదములను పొందుటకని ఈ స్వామివారి లీలలను ప్రచురిస్తున్నాము. ఇది 21వ భాగము. ఇంతవరకు ఎంతమంది భాగవతులు, స్వామి భక్తులు నన్ను ఆశీర్వదించారో తెలియదు కాని నేను మాత్రం ఈ లీలల ప్రచురణలో ఎంతో జ్ఞానాన్ని పొందాను. సం॥ 2000 నుండి స్వామివారు ప్రసాదించిన ప్రతి లీల వ్రాసుకున్నప్పటికీ ఆ లీలను వారం రోజుల తరువాత మరిచిపోయేవాడిని. మామూలు మనిషిలాగా ప్రవర్తించేవాడిని. నీ మొత్తం అనుభూతులను చదువమని సం॥ 2020 లో స్వామివారు చెప్పినప్పుడు మాత్రమే పూర్తి లీలలను చదివి నా తప్పులను తెలుసుకున్నాను. అప్పుడు కూడ పూర్తి అనుభూతులను అర్థం చేసుకునే స్తోమత లేకపోయింది. కాని ఈ అనుభూతుల ప్రచురణ సమయంలో ప్రతి అనుభూతి చక్కగా అర్థం అవుతోంది. నేను మళ్ళీ వీటిని ఒకసారి అనుభవించి పరవశించి పోవుచున్నాను. స్వామివారు నిర్దేశించిన కర్తవ్యం దృఢపడుతోంది. స్వామివారు కొన్ని లీలలను నిగూఢంగా ప్రసాదించారు. ఆ సమయంలో వీటి అర్థం ఏమాత్రం తెలుసుకోలేదు. స్వామివారు ఒక విషయాన్ని కేవలం ఒకేసారి చెప్పుతారు. దానిని గుర్తుపెట్టుకుని జీవితాంతం ఆచరించుట నా కర్తవ్యం. కాని 'నా' అన్నది నశించని కారణంగా 'యోగ్యత' సిద్ధించని కారణంగా ఆ సమయంలో స్వామి మాటను ఆచరించలేదు.

### కోర్టు సమన్లు పంపుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఏదో సాధించుటకు నన్ను ఎన్నుకుని తన సేవాభాగ్యమును ప్రసాదించారనితెలుసు.నాజీవితాన్నిస్వామివారికి

అంకితం చేసి, వారు ప్రసాదించిన ప్రతి సేవను సమర్థవంతంగా చేస్తున్నాను. నిజానికి నాకు ఇదే చాలనుకున్నాను. స్వామి వారి ఋణం తీర్చుకొనుటే లక్ష్యంగ సేవ చేస్తున్నాను తప్ప మరోటి ఆశించలేదు, మరియు స్వామివారి సాక్షాత్కారం పొందాలన్న కోరిక నాలో ఎప్పుడు లేదు. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం ఆది నుండి నేను ఈ దిశలోనే పయనించునట్లు విధి విధానాలను విధించాడు. సం॥ 2002 లో సేవలను ప్రసాదించే ముందు, సదా స్వామివారిని స్మరిస్తూ, కేవలం కుటుంబ పోషణార్థం, కొన్ని రోజులు మాత్రమే వ్యాపారానికి అనుమతించారు. ఎక్కువ చేస్తే అడ్డుకుంటానన్నారు. కాని ఆ తరువాత కాలంలో దీనిని పూర్తిగా మరచి వ్యాపారాన్ని పెంచుకొనుటకు ప్రయత్నించాను. స్వామివారు నా ప్రతి ప్రయత్నాన్ని విఫలం చేసి నన్ను ఆర్థికంగా క్రింది స్థాయిలోనే ఉంచారు. స్వామివారి అసలు లక్ష్యం తెలియక, మీ సేవలో లోపం లేకుండా చేస్తున్నా కూడా నన్నెందుకు క్రింది స్థాయిలో ఉంచారనే కోపం నాలో ఎన్నోసార్లు కలిగింది. ప్రతిసారి నా మానసిక పరిస్థితిని గ్రహించి దానికనుగుణంగా రకరకాలుగా అనుగ్రహించేవారు. ఐనప్పటికీ ఆర్థికంగా క్రింది స్థాయిలోనే పెట్టినారు. నాకున్న ఆస్తులలో ఏదేని కాలక్రమంగా విలువైనదిగా మారినప్పుడు దానిలో లిటిగేషన్ సృష్టించి నా నుండి దూరం చేసేవారు. దీనిని నేను జీర్ణించుకోలేకపోయాను. పైగా ఆస్తి కోల్పోయాను కాబట్టి కష్టించి మరింత వ్యాపారం చేయాలనిపించేది. ఈవిధంగా సం॥ 2008 వరకు నా పరిస్థితి కొనసాగింది. ఇప్పటి నుండి స్వామివారు నా దిశను మార్చే ప్రయత్నం చేశారు. తాను చెప్పినట్లు నడుచుకొమ్మని చెప్పసాగారు. నీవు పయనించు మార్గం సరైంది కాదు అంటూ హెచ్చరించారు. పూర్వం నేను స్వామివారు చెప్పినట్లు వింటానని, వారిని సంతృప్తి పరచుటే నా లక్ష్యంగ ప్రమాణం చేశాను. కేవలం కుటుంబ పోషణార్థం మాత్రమే వ్యాపారం చేస్తానని కూడా ప్రమాణం చేశాను. వీటన్నింటిని మరచి నా ఇష్టప్రకారం ప్రవర్తిస్తున్నందుకు స్వామివారికి నాపై కోపం వచ్చి నీవు మాట ప్రకారం నడుచుకుంట లేవంటూ కోర్టు సమన్లు పంపారు. అదే సమయంలో బుజ్జగిస్తూ ఈవిధంగా నడుచుకొమ్మని ఈ క్రింది లీల ద్వారా సూచించారు.

**తేది 23-02-2008 కల:** ఈ రాత్రి ఒక చిత్రమైన కల కన్నాను. నాకు ఏమాత్రం సంబంధం లేని ఒక వ్యక్తి ఉన్నారు. ఆయనకు నాపై లోలోన విపరీతమైన కోపముంది. బహుశా నేను ఆ వ్యక్తి చెప్పినట్లు నడుచుకోక అన్యాయం చేశాను. ఆ వ్యక్తి నాకు కోర్టు సమన్లు పంపాడు. ఆ వ్యక్తి నాపై కోపముతో మా ఇంటిముందు నిలబడి అరుస్తున్నాడు. తాను సరైన సమాధానం ఇచ్చెదనని, నేను కోర్టుకు రావలసి యుండునని కోపంతో అన్నాడు. నేను ఏ తప్పు చేయలేదని అనుకుంటున్నప్పటికీ, అంతలో నేను సారీ పొరపాటైంది, మీరు ఈ విషయంలో సంబంధం లేనివారు, మనము కాంప్రమైజ్ అవుదాము అని అన్నాను. ఇది ఈ కలలో మొదటి సన్నివేశం. ఇక రెండవ సన్నివేశం ఇలా ఉంది.

నేను మరియు నా ఇద్దరు మిత్రులతో కలిసి మా కాలనీ నుండి వేరే ఇతర ప్రదేశమునకు ఒక ఫంక్షన్ నిమిత్తం బయలుదేరి పోవుచున్నాము. మార్గంలో మా కాలనీలోని అమ్మవారి ఆలయం వద్ద ఆగి ఆమెకు ప్రణమిల్లి పోవాలని ఎవరో చెప్పగా మేము అక్కడికి వెళ్ళాము. ఆ గుడి 2' X 2' సైజుతో మూడడుగుల ఎత్తుతో వ్యవసాయ పొలాల్లో ఉండేవిధంగా ఉన్న చిన్నగుడి. అందులో నల్లని ఆకారంతో అమ్మవారు ఉన్నారట. ఆ గుడిముందు విరివిగా పూసిన ఒక మల్లెచెట్టు ఉంది. విరివిగా పూసింది కాబట్టి ఆ పూల బరువుకు, అమ్మవారికి పూలను సమర్పిస్తున్నట్లు ఈ చెట్టు అమ్మవారి ముందు వంగి ఉంది. నేను ఈ తెల్లని సుగంధ పూలను కొన్నింటిని తెంపి అమ్మవారికి సమర్పించి పోయాను. కల చెదిరింది.

దీని అర్థం – నేను చెప్పినట్లు నడుచుకో, నన్ను నొప్పించకు, లేకుంటే ఇబ్బంది పడుదువు అనేది మొదటి సన్నివేశం అర్థం. ఇక రెండవదాని అర్థం – నీకు భక్తిని, సేవను ప్రసాదించాను. ప్రకృతిని అనుకూలంగా మలచాను, చక్కగా భగవంతుని అర్చిస్తూ గడుపుము తప్ప అన్య విషయాలపై దృష్టి పెట్టకుమన్నాడు. కాని ఆ సమయాన దీని అర్థమును గ్రహించలేకపోయాను. ఇలా స్వామివారు నాలో మార్పుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు.

## బహుమానం ఇస్తాననుట

నేను స్వామివారు ప్రసాదించిన సేవలను ఉపయోగించి, అన్య విషయ వాసనలను త్యజించి, తగిన యోగ్యతను సిద్ధింప చేసుకోవాలన్నదే స్వామివారి అసలు లక్ష్యం. కాని మీకు సేవ చేస్తే చాలు యోగ్యత నాకెందుకన్నట్లు నా ప్రవర్తన ఉండేది. ఇలా కఠిన సాధన చేసి యోగ్యత సాధించమంటు ఎన్నోసార్లు చెప్పారు. కాని నేను మాత్రం దీనిపై దృష్టిపెట్టక, ఏదో లభిస్తుందనే ఉద్దేశ్యముతో వ్యాపారము చేసేవాడిని. కాని స్వామివారు ఆయా సమయాలలోని నా అంతరంగానికనుగుణంగా సామ దాన భేద దండోపాయాలను ఉపయోగించి నన్ను తన దారిలోనికి తెచ్చుకునేవారు. ఇప్పుడు ఒక దానోపాయాన్ని ఉపయోగించారు. ఒక రోజు శ్రీవేంకటేశ్వరుడు నాతో ఇలా అన్నారు. ''నీవు 'నా' అన్నది నశింపచేసుకుంటే నీకు ఒక మంచి బహుమానం ఇస్తా''నన్నారు. ఇలా స్వయంగా స్వామివారు బహుమానం ఇస్తాననే సరికి ఆ బహుమానమును పొందాలనే ఆశ నాలో కలిగింది. స్వామివారి బహుమానం ఏం ఉంటుంది? ఏవిధంగా ఉంటుంది? దీనిని తప్పక సాధించి తీరాలనే పట్టుదల నాలో దృఢపడింది. ఒక పది పదిహేను రోజులు ''నా'' అన్నది

నశింపచేసుకొనుట కు సాధన చేసి 'నా' అన్నది పోయింది బహుమానం అని అడిగాను. కాని స్వామివారు ''ఇంకా పోలేద''ని చెప్పారు. దీనితో మరింత పట్టుదలతో ఒక నెల రోజులు 'నా' అన్నది నశింపచేసుకొనుటకు తీవ్రంగా కృషి చేశాను. నా ఆస్తిపాస్తుల విషయాలను పట్టించుకోక పోవుట, ఎవరైనా డబ్బులు ఇవ్వాల్సి వస్తే వారిని అడుగకపోవుట మొత్తం వ్యవహారాలకు సాధ్యమైనంత దూరం ఉండుటను ప్రాక్టీసు చేశాను. ఇలా ఒక నెల రోజులు సాధన చేసి శ్రీవేంకటేశ్వరుని ముందు చేయి చాపి ఇలా అడిగాను. ''ప్రభూ శ్రీవేంకటేశ్వరా నేను ఇప్పుడు 'నా' అన్నది నశింపచేసుకున్నాను. మీరు ఇస్తానన్న బహుమానం ఇవ్వు''మన్నాను. దీనికి స్వామివారు చక్కగా స్పందించారు. ''నాయనా నీవు 'నా' అన్నది ఇంకా వదలలేదు యోగ్యత సిద్ధించలేదని'' ఒక చక్కటి ఈ క్రింది లీల ద్వారా చెప్పారు. నేను స్వామి ప్రసాదించిన సేవలను ఉపయోగించి యోగ్యత సాధించవలసి ఉన్నదని చెప్పారు. ఉదా : ఒక వ్యక్తి ఐ.ఎ.ఎస్ పట్టా పొందాలంటే మూడు రకాల పరీక్షలు పాస్ కావలసి ఉంటుంది. ముందు ఒక డిగ్రీని చదవాలి, దానిని ఉపయోగించి ప్రిలిమినరీ, 'మెయిన్'లో పాస్ కావలసి ఉంటుంది. ఆ తరువాత యోగ్యతను ఉపయోగించి ఇంటర్వ్యూలో కూడా పాస్ కావాలి. డిగ్రీని చక్కగా చదివితే ప్రిలిమినరీ మరియు మెయిన్ లో పాస్ కాగలము కాని యోగ్యతకు మాత్రం విద్యార్థి తెలివితేటలను ఉపయోగించాలి. ఇక్కడ స్వామి ప్రసాదించిన సేవలు డిగ్రీ అనుకుంటే ఈ సేవలను ఉపయోగించి యోగ్యతను సాధించి ఇంటర్వ్యూలో పాస్ కావలసి ఉంటుంది. ఈ 'యోగ్యత' అను దానిని నేనే నా విజ్ఞతను ఉపయోగించి సాధించాలి. ఈ యోగ్యతను సాధించుటే స్వామివారి లక్ష్యంగా ఈ లీల ద్వారా తెలుస్తోంది.

**తేది 24-02-2008 కల :** ఈ కలలో రెండు వేర్వేరు సన్నివేశాలలో వేర్వేరు సంఘటనలను చూపెట్టాడు. పైకి వేర్వేరుగా కనబడ్డా అంతరంగాన ఒకదానికొకటి లింకు ఉంది.

**మొదటి సన్నివేశం :** నేను శ్రీవేంకటేశం మాసపత్రికకు ప్రచారం చేస్తున్నాను. కొందరు తెలిసిన వ్యక్తుల వద్దకు వెళ్ళి శ్రీవేంకటేశం పత్రికను ఇచ్చి వారిని చందాదారులుగా చేరమన్నాను. ఒకరు ఆశ్చర్యకరంగా చూసేసరికి పూర్వపు 'నమో వేంకటేశాయ' నేడు 'శ్రీవేంకటేశం'గా మారిందని చెప్పాను. దీంతో ఆయన ప్రసన్నుడైనాడు. ఇది మొదటి సన్నివేశం. ఇందులో స్వామివారు ప్రసాదించిన సేవలను ఏ తప్పు లేకుండా చక్కగా నిర్వహిస్తున్నానని స్వామివారు సూచించారు.

**రెండవ సన్నివేశం :** ఒక ప్రాచీనమైన, ఎంతో మహిమాన్వితమైన, ఎన్నో మహాత్మ్యాలతో నిండిన ఒక శ్రీవేంకటేశ్వరుని ఆలయానికి నేను మరియు నా భార్య సురేఖ దర్శనార్థమై వెళ్ళాము. ఇది తమిళనాడు లోని ఆలయం లాగా ఒక భవంతి తరువాత మరో భవంతితో, ఎక్కుడు దిగుడుగ ఉన్నటువంటి చాలా పెద్ద ఆలయం. మేము అక్కడ ఒక వెయిటింగ్ గదిలో వేచి ఉన్నాము. ఆ గది అతి సుందరంగా పూలతో అలంకరించి ఉన్నది. ఆ గదిలో అర్చక స్వాములు ధోవతులు కట్టుకుని తిరునామం ధరించి ఉన్నారు. వారు తిరుమల గుడిలోని అర్చకస్వాములే, అందులో ఒకరు తెలిసిన శ్రీమాన్ శేషాద్రి గారు ఉన్నారు. ఇంతలో వారు దేవునికి సేవ (పూజ) చేయుటకు లోనికి వెళ్ళుచు మమ్ములను ఇక్కడనే వేచి యుండమని చెప్పారు. కొంతసేపటికి ఒక పూజారి వచ్చి, పూజ (సేవ) అయిపోయింది అని మమ్ములను లోపలి మరో గదిలోనికి తీసుకుపోయారు. అక్కడ ఉన్న మరొక పూజారి మీరు ఇక్కడనే వేచి ఉండండి, మొదట అర్చకులు స్వామి దర్శనం చేసుకున్న పిదప మీకు దర్శనము జరుగునని చెప్పి తలుపులు మూసివేశాడు. ఆ తలుపులు వెనుకటి ఇంటి తలుపులు లాగా లావుగా ఉండి జాజుచే అలంకరించబడి ఉన్నవి. ఇంతలో ఒక అర్చకుడు వచ్చి తలుపులు తీసి మీరు దర్శనానికి రండని లోనికి పంపించాడు. మేము లోనికి వెళ్ళాము. గడప దాటగానే ఒక 9' X 9' సైజుతో వరండా లాంటి స్థలము ఉన్నది. ఇది దీని ముందటి భూమి లెవల్ కంటె దాదాపు ఆరడుగుల ఎత్తులో ఉన్నది. మేము ఇక్కడి నుండి ఆరడుగుల క్రిందికి దిగి ఒక ఇరవై అడుగులు నడిచిన పిదప మళ్ళీ కొన్ని మెట్లు ఎక్కితే స్వామివారి ఆలయం ఉన్నది. అయితే ఈ 9' X 9' సైజు ఉన్న వరండాకు క్రిందికి దిగుటకు ఇరువైపులా మెట్లు ఉన్నవి. అవి ఆరేడు మెట్లున్నట్లు కనబడ్డవి. కాని అవి చాలా మందంగ, నిటారుగా (వర్టికల్ గ) దిగుటకు ఇబ్బందిగా ఉన్నవి. ఆ మెట్లు దిగిన పిదప స్వామివారి గర్భగుడికి వెళ్ళగలము. నేను పైనుండి చూచినచో ఈ మెట్లు ఒకదాని క్రింద మరొకటి కనబడ్డవి. ఇవి మామూలు వ్యక్తులు దిగుటకు అనువుగా లేవు. ఉదా: ఒక రైలు బోగీకి ఏవిధంగా ఒకదాని క్రింద మరోటి వర్టికల్ గ మెట్లు ఉండునో ఇవి ఆ విధంగా ఉన్నవి. రైలు బోగీ ప్లాట్ ఫామ్ నుండి ఒక అడుగు ఎత్తు మాత్రమే ఉండుట వలన రెండు లేక మూడు మెట్లుంటాయి. మరియు పట్టుకొనుటకు ప్రక్కన ఒక స్టీల్ రాడ్ సపోర్టుగా ఉంటుంది. కాని ఇక్కడ మాత్రం లోతు ఐదారు అడుగులు, దిగవలసిన మెట్లు కూడా ఆరేడు వర్టికల్ గా ఒకదాని క్రింద మరోటి ఉన్నవి. పట్టుకొనుటకు సపోర్టు ఏమీ లేదు. కాబట్టి దిగలేకపోయాము. నా భార్య దిగలేనన్నది. నేను ఆలోచించి ధైర్యము చేసి క్రింద కూర్చుండి నా భార్య చేయి పట్టుకుని నెమ్మదిగా జాగ్రత్తగా దిగుటకు ప్రయత్నించాను. నా భార్యను కూడా నెమ్మదిగా దిగుమని చెప్పాను. కాని ఆమె భయపడుచు దిగలేకపోయింది. ఇంతే కల. మొత్తం మీద మేము స్వామి వద్దకు పోలేకపోయాము. మరింత బాధ్యతగా స్వామి చెప్పినట్లు

నడుచుకుంటూ సేవ చేయాలని, యోగ్యత సాధించాలని నిర్ణయించుకున్నాము.

తెల్లవారి ఈ కలను గుర్తు చేసుకొని, నేను స్వామివారి సేవను చక్కగా ఏ తప్పు లేకుండా చేస్తున్నప్పటికీ ఆశించిన యోగ్యత సాధించలేదు కాబట్టి శ్రీవేంకటేశ్వరుని దర్శించుకోలేక పోయానని భావించాను తప్ప నాలోని తప్పులను గుర్తించలేదు.

## స్వామివారితో తెగని బంధం

గత కొన్ని రోజుల నుండి స్వామివారిని చూడాలని, ఆయన మరిన్ని లీలలను అనుభవించాలని ఆరాటపడ్డాను. ఎన్నోసార్లు ప్రార్థించాను కాని లాభం లేకపోయింది. దీనికి తోడు ఈమధ్య మా ఆఫీసుకు వచ్చిన ఒకరిద్దరు జ్యోతిష్కులు నీవు ఇకనుండి దైవచింతన ఎక్కువ చేయవు, నీ జాతకము ఆ విధంగా ఉన్నదని చెప్పారు. దీనివలన మరింత దిగులు చెందాను. నాకు స్వామివారు కనబడరేమో నేను ఆయనకు దూరమవుతాననే భయము నన్ను వణికించింది. కాని ఈరోజు స్వామివారు ఒక చక్కటి అనుభూతి కలిగించి స్వామివారితో నా బంధం తెగిపోదని సంతోషించేలా చేశారు.

**తేది 27-02-2008 కల :** ఇది ఒక హృదయాంతరంగ భావం. "స్వామివారిని పొందాలన్నా లేక చూడాలన్నా మరింత సాధన చేయవలె"ననే భావం ఏర్పడ్డది. ఇంతే. దీనితో స్వామివారితో నా బంధం దృఢంగా ఉండునని ఎంతో మురిసిపోయాను. నేను పొందిన దుఃఖం చెదిరిపోయింది. స్వామి చెప్పినట్లు సాధన దిశగా అడుగు వేయాలనిపించింది. కాని దురదృష్టవశాత్తు ప్రతి లీల ఒక వారం రోజుల తరువాత పూర్తిగా మరిచిపోతాను. ఒకప్రక్క వ్యవహారం చూచుకుంటూ... మరోప్రక్క స్వామివారిని మరో క్రొత్త లీల చూపెట్టమని ప్రార్థిస్తాను తప్ప... పాతది గుర్తుండదు. కాని ఈసారి తీవ్రంగా 'నా' అన్నది నశింపచేసుకుని స్వామివారి బహుమానాన్ని పొందాలని దృఢమైన పట్టుదలతో సాధన కొనసాగిస్తున్నాను.

## సురేఖను అనుగ్రహించుట

**తేది 28-02-2008 :** ఈ రోజు మా ఇంటికి శ్రీమాన్ ఉపేందర్ రావు గారు వచ్చారు. వీరికి శ్రీవేంకటేశ్వరుడు ఆవహించి మన గురించి చక్కగా చెబుతారు. వీరు మాకు సం॥ 2005 నుండి పరిచయం. నా భార్య సురేఖకు వీరి పట్ల మంచి సదభిప్రాయముంది. మరియు గతంలో వీరి మాధ్యమంగా శ్రీవేంకటేశ్వరుని శంఖు చక్రములను దర్శించింది కాబట్టి ఆయన పట్ల భక్తి భావం ఎక్కువ. ఈ రోజు కూడా ఆయన మా ఇంట్లో అడుగు పెట్టుటతోనే స్వామివారు ఆవహించారు. అప్పుడు ఆయన ముఖముపై నల్లని శ్రీవేంకటేశ్వరుణ్ణి సురేఖ చూచిందట. సురేఖ ఎంతో సంతోషించింది. చివరికి ఆయన మాతో మాట్లాడుచు సురేఖను మూడు శుక్రవారములు, మూడు మంగళవారములు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి పూజ చేయుమని చెప్పారు. నా గురించి మాత్రం ఏమీ చెప్పలేదు. ఆయనపై విశ్వాసముతో మా సురేఖ తేది 29-02-2008 ఉదయం నుండి పూజ చేయుటకై సిద్ధమైంది. పూజ కంటె ముందే స్వామివారు ఒక చక్కటి లీలను చూపి సురేఖను ఆనంద సాగరంలో ముంచారు.

**తేది 29-02-2008 కల :** ఇది సురేఖకు వచ్చిన కల. శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి పూజ చేయాలనే ఉద్దేశ్యముతో సురేఖ ఉదయం 4 గంటలకు మేల్కొన్నది. స్నానానంతరం పూజకు సిద్ధమవుతోంది. ఇంతలో సురేఖ మా ఇంటి ఉత్తర ద్వారం తెరచి చూచినట్లు, ఆ తలుపు తెరవగానే సుమారు ఏడున్నర అడుగుల ఎత్తు కలిగిన పడగతో ఒక పాము ఈ డోరు ఎదురుగా నిలబడి తననే చూస్తున్నట్లుగా చూచిందట. ఆ పాము కొంత భాగం ఈ డోర్ ముందు చుట్టుకుని ఉన్నది, తన తల మాత్రం డోరు ఎత్తుకంటే పైకి లేపి పడగ విప్పి సురేఖను చూస్తున్నదట. సురేఖ ఈ దృశ్యాన్ని చూచి ముందు భయపడిందట. ఆ తరువాత తేరుకుని స్వామివారికి నమస్కరించిందట. ఈ పాము ముదురు బ్లూ రంగులో ఉన్నదట. సురేఖనే చూస్తూ చాలాసేపు ఉన్నదట. కల చెదిరింది. ఈ లీలతో సురేఖ ఆనందానికి హద్దు లేదు. మురిసిపోయింది. అంత పెద్ద పామును అంత పెద్ద పడగతో ఆమె ఇంతవరకు ఎప్పుడు చూడలేదు. సురేఖ ఈ పూజను తేది 29-02-2008 నుండి 18-03-2008 వరకు చేసింది. చివరి రోజైన తేది 18-03-2008 నాడు కూడా క్రింది విధంగా చక్కని కల కన్నది.

**తేది 18-03-2008 కల :** ఈ కలలో కూడా స్వామివారు పడగ రూపములో సురేఖకు దర్శనమిచ్చారు. సురేఖ మా పూజ రూములో కూర్చుండి శ్రీవేంకటేశ్వరునికి పూజ చేస్తున్నదట.




**పాము సురేఖతో కలిసి ప్రార్థించుట**

ఇంతలో ఆమె ప్రక్కన ఒక ముదురు బ్లూ రంగు గల పాము చుట్టుకుని తన పడగను నేల నుండి దాదాపు రెండడుగుల ఎత్తు లేపి స్వామివారికి నమస్కరించునటుల కనబడిందట. దీనిని చూచిన సురేఖ మిక్కిలి సంతోషించింది. ఇది ఏ విధంగా సురేఖ కూర్చుండి స్వామివారికి పూజ చేస్తున్నదో అదేవిధంగా ఆ పాము కూడా సురేఖ ప్రక్కన కూర్చుండి పడగ విప్పి స్వామిని ధ్యానిస్తున్నట్లు ఉన్నదట. ఇంతే కల. దీనితో సురేఖ ఎంతో ఆనందించింది.

ఈ కలలో, శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహం కోసం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారిని ప్రార్థిస్తే, ఆ సుబ్రహ్మణ్య స్వామివారు తిరిగి సురేఖకు శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహం ఇప్పించుట కోసం ప్రార్థించినట్లున్నది.

## శ్రీశ్రీశ్రీ హయగ్రీవ స్వామి వారిని గురువుగా పంపుట

ఇక నేను మాత్రం శ్రీవేంకటేశ్వరుని బహుమానమును పొందడం కోసం 'నా' అన్నది నశింప చేసుకొనుటకు తీవ్రంగా సాధన చేయసాగాను. గతంలో స్వామివారు సూచించినప్పటి నుండి సరిగ్గా ఒక నెల రోజులు తీవ్రంగా సాధన చేశాను. ప్రతిరోజు ప్రతి క్షణం దీని గురించే ఆలోచించేవాడిని కాబట్టి ఒక నెల కాలము నాకు మూడు నాలుగు నెలల కాలము వలె అనిపించింది. మరియు ఈ సాధన క్రమములో నా మనస్సు నూతన మార్గంలో పయనించింది. నేను అప్పటికే ఏకాంత జీవితానికి, స్వామి స్మరణకు అలవాటుపడ్డ నాకు శ్రీవేంకటేశ్వరుణ్ణి చూడాలని, ఆయనతో కలిసి రోజుకు అరగంట కాలమైనా గడపాలనే కోరిక కలిగింది. పూర్వము మీరు విదురునికి, విభీషణునికి మీతో కలిసి జీవించే అవకాశమును ఏవిధంగా ఇచ్చారో అదే విధంగా నాకు ఇవ్వమని ప్రార్థించాను. "నాకు లోకంలో ఏదీ అవసరం లేదు, ఈ లోకంలో ఉన్నది అంతా మీదే, నా మనస్సు మీయందే నిమగ్నమయ్యే విధంగా, సర్వము మీరే అనుకునే విధంగా చేయుమని" ప్రార్థించాను. మరియు ఈ సృష్టి స్థితి లయ కారకులు మీరే అను భావము నా మనస్సులో దృఢంగా బలపడే విధంగా చేయమని ప్రార్థించాను. స్వామివారిని చూడాలని ఆయన బహుమానమును పొందాలని తహ తహ లాడాను. చివరికి మరింతకాలం భరించలేక ప్రభూ నేను 'నా' అన్నది నశింపచేసుకున్నాను, 'బహుమానం' అని అడిగాను కాని ఈసారి స్వామివారి నుండి ఎలాంటి స్పందన రాలేదు. దీనితో మనస్సు బాధేసింది. ప్రభూ నేను చాలా సాధన చేశాను, ఈ లోకంలో ఎవరూ ఇంతకంటే ఎక్కువ 'నా' అన్నది నశింపచేసుకోరు, ఆ స్థితికి వచ్చానన్నాను. అయినప్పటికీ స్వామి నుండి స్పందన లేకపోయేటప్పటికి నాకు అనుమానం వచ్చింది. స్వామివారు నాకు బహుమానం ఇవ్వరు, కేవలం నన్ను సాధన చేయించుటకే ఇలా చేశారనుకున్నాను. స్వామివారు అబద్ధాలాడారనుకున్నాను. బాధ పడ్డాను. తేది 22-03-2008 నాడు సాయంత్రము మా ఆఫీసులో మరీ ఎక్కువగా స్వామివారిని ప్రార్థించాను. నేను పూర్తిగా సమర్పించబడ్డానని, సర్వము మీదేనని 'నా' అన్నది నాలో లేశమైనా లేదని నన్ను కరుణించుమని, నా కన్నుల వెంట నీరు ధారలుగా కారగా వేడుకున్నాను. దీనితో స్వామివారు తప్పక ఈ రాత్రి అనుగ్రహించుదురని భావించాను. ఈనాడు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నా స్థితిని తెలుపుటకు తిరుపతి నుండి ఒక గురువుగారిని పంపారు.


బహుశా ఇంతవరకు ఏ భక్తుడు ఈ రకమైన పరీక్షకు గురి కాకపోవచ్చు. ఆ గురువుగారు వచ్చి నేను 'నా' అన్నది వదిలానా...? లేదా? యోగ్యత సాధించానా... లేదా? అనే విషయాన్ని బహు చక్కగా తెలియజేశారు. ఆ వచ్చిన గురువు గారు శ్రీమన్నారాయణుని గురు రూపమైన శ్రీశ్రీశ్రీ హయగ్రీవ స్వామివారు. ఈ లీల నా జీవితములో మరో ఆణిముత్యం

ఈ కలలో శ్రీవేంకటేశ్వరుడు నేను ఇంతవరకు 'నా' అన్నది నశింప చేసుకోలేదని నేను స్వయంగా బహుచక్కగా అర్థం చేసుకునేవిధంగా చెప్పారు. దీని తరువాత 'నా' అన్నది నశింప చేసుకొనుట అంత సామాన్య విషయం కాదని, అది స్వామి కృపతోనే సాధ్యమని గ్రహించాను.


ఈ లీలలో స్వామివారు రెండు మూడు సన్నివేశాలను చూపారు. మొదటి సన్నివేశంలో సం॥ 2011 లో నేను మారబోయే క్రొత్త ఆఫీసు గదిని చూపెట్టారు. (సం॥ 2011 నుండి దీనిని నా సాధనాలయముగ ఉపయోగిస్తున్నాను) మరో సన్నివేశంలో చిన్నగుండవెల్లి గ్రామంలోని మా ఇల్లు, మా బావిని చూపెట్టారు. ఆ సమయంలో మా అత్త కీ.శే. చెరుకుపల్లి శకుంతలాదేవి మాతోనే నివసిస్తోంది. ఈమెను ఉపయోగించి ఆ లీలను ఈవిధంగా చూపెట్టారు.

**23-03-2008 కల :** నేను (నా ప్రక్కన నా భార్య కూడా ఉన్నట్లు ఉంది) స్వామి కోసం ప్రార్థించాను. నాకు మీరు కావాలి నన్ను అనుగ్రహించుమని వేడుకున్నాను. మరియు ప్రభూ! మీరు తిరుమల నుండి మా గురించి ఇక్కడకు, నా ముందుకు రారాదా! వచ్చి నాకు తోడు నీడగా ఉండండి, నాకు మీతో కలిసి ఉండాలని ఉంది అని మా సొంతపు 12' X 16' సైజు గల ఒక గదిలో వేడుకున్నాను. (ఈ గది సం॥ 2011 లో మా ఆఫీసుగా నిర్మించుకున్నాము. దీనిని స్వామివారు ఈ రోజు ఈ లీలలో చూపారు) నేను 'నా' అన్నది నశింపచేసుకున్నాను, కాబట్టి మీరు తిరుపతి నుండి నా వద్దకు రమ్మని నా ప్రార్థన అంటూ ప్రార్థించాను. ఇంతలో తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మా గురించి తిరుపతి నుండి ఒక గురువు గారిని మా ఇంటికి

పంపుచున్నారనే విషయము హృద యాంతరంగ భావము ద్వారా లేదా ఒక వ్యక్తి చెప్పగా తెలిసింది. ఇంతలో సన్నివేశం మారిపోయింది. నేను, నా భార్య మరియు మా అత్త (నా భార్య తల్లి) కీ.శే. శకుంతలాదేవి ముగ్గురము మా చిన్నగుండవెల్లి లోని మా పాత ఇంట్లో ఉన్నాము. శ్రీవేంకటేశ్వరుడు మా గురించి మా ఇంటికి ఒక గురువుగారిని ప్రత్యేకంగా పంపుచున్నారనే విషయం వినగానే నేను ఉక్కిరి బిక్కిరి అయిపోయాను. నా స్వామివారు నా కోసం ఒక గురువును పంపుటను నేను తట్టుకోలేకపోయాను. దీనిని ఒక ప్రత్యేక అనుగ్రహముగా భావించాను. ఆ గురువును తొందరగా కలవాలనే ఆతృతతో పాటు, వారిని సగౌరవంగా ఆహ్వానించాలనే ఉద్దేశ్యముతో స్వామివారిని స్మరిస్తూ ఆయనకు ఎదురేగాను. నా భార్య, అత్తలు నన్ను అనుసరించారు. ఇంటినుండి బయలుదేరి ఊరు దాటే మార్గంలో ఉన్న మా ఒక బావి దగ్గర నిలబడి ఆయనకై వేచి చూస్తున్నాను. నాకు ఒక పది అడుగుల దూరములో ఒక ఆరడుగుల ఎత్తు, అంతే వెడల్పు కలిగిన దాదాపు గుండ్రని గుండు ఒకటి అక్కడ ఉన్నది. నేను స్వామి వారి రాకకై వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. ఇంతలో ఎక్కడి నుండో ఒక గుఱ్ఱపు సకిలింత ఒకటి వినబడింది. ఈ సకిలింత ఎక్కడినుండి వస్తుందా అని చుట్టూ చూచాను ఏమీ కనబడలేదు. ఇంతలో ఈ గుఱ్ఱపు సకిలింత పెద్ద శబ్దముతో మళ్ళీ వినబడింది. ఇప్పుడు ఈ శబ్దము ప్రక్కనున్న గుండు నుండి వస్తున్నట్లు గ్రహించాను. ఆ గుండుకు ఒక దగ్గర పొక్కబడి ఉండుటను చూచాను. ఇంతలో ఈ సకిలింత మరోసారి వినబడ్డది. ఇప్పుడు ఈ గుండు మరింత పైకి పొక్కింది. ఉదా: ఒక కోడిపిల్ల గ్రుడ్డు నుండి బయటికి వస్తున్నప్పుడు తన ముక్కుతో గ్రుడ్డు యొక్క పైపొరను పొడుచుకుంటూ వచ్చినట్లు ప్రతి సకిలింతకు కొంత కొంత గుఱ్ఱపు మూతి భాగము ఆ గుండు నుండి బయటకు వచ్చింది. ఇంతలో మళ్ళీ సీను మారింది. మేము పూర్వపు 12'X16' సైజు గల మా ఆఫీసు రూములో ఉన్నాము. నా ముందు ఒక గుఱ్ఱం ముందుభాగం కనపడింది. అంటే ఆ గుఱ్ఱం ముఖము చెవులతో పాటు ముందరి కాళ్ళు కనబడ్డాయి. ఇది సాక్షాత్తు తిరుపతి నుండి నా స్వామివారు పంపగా వచ్చింది కాబట్టి దీనిని చూచి నా స్వామి నా కోసం పంపాడని చాలా సంతోషించాను. ఇంతలో ఒక పొగ లాగా కమ్మింది. ఆ పొగ మధ్యలో సుమారు 23-24 సంవత్సరాల వయస్సు గల ఒక యువకుడు లేత మీసములతో జీన్స్ ప్యాంట్ ధరించి తెల్లని టీషర్టుతో గుఱ్ఱం ముఖం నుండి పుట్టాడు. ఈయన సాక్షాత్ తిరుమల శ్రీవేంకటేశ్వరుడు పంపగా నా కోసం నా వద్దకు నాకు విద్యాబుద్ధులు, హితోపదేశము చేయుటకు వచ్చాడట. ఆ దృశ్యమును చూచి నేను నా భార్య మరియు ప్రక్కన ఉన్న మరికొందరు చాలా ఆశ్చర్యపోయాము. నా మనస్సు అప్పుడు, ఈ సృష్టి కేవలము నా ప్రభు శ్రీవేంకటేశ్వరుడే చేశాడు, ఆయనే అంతిమము, ఆయనకు మించింది మరోటి లేదు, నా సర్వస్వం ఆయనే, నా కోసం ఆయన సాక్షాత్తు దిగి వచ్చినవాడు, ఆయన కోసం నేను ఏమైనా చేస్తాను. 'నా' అన్నది నాకు లేదు, ఏదీ నాది కాదు అనే భావం నాలో నూరు శాతం కలిగింది. నేను ఆనందంలో తన్మయత్వంలో మునిగిపోయాను. ఆ సమయాన నేను పొందిన ఆనందానికి హద్దులు లేవు. వర్ణించటానికి పదము లేదు. ఈ విషయంలో నాతోపాటు మా కుటుంబ సభ్యులు కూడా ఆనందమును పొందారు. ఈ స్వామివారు పంపిన వ్యక్తి మా ఇంట్లోనే శాశ్వతంగా నాతోపాటే ఉండుటకు వచ్చారు కాబట్టి మహదానందంగా ఉన్నాము. ఇంతలో మళ్ళీ సీను మారింది. ఇప్పుడు మాతో పాటు ఈ గురువుగారు కూడా చిన్నగుండవెల్లిలోని మా పాత ఇంట్లో ఉన్నాము. ఊరిలోని మా ఇల్లు కట్టే మొగురాళ్ళతో (స్తంభాలతో) నిర్మించింది. ఇంతలో ఒక పూట గడిచింది, అంటే స్వామివారు ఉదయం వస్తే సాయంత్రం




**గుఱ్ఱపు ముఖము నుండి శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి వారు పుట్టుట**




**గురువు గారు తనకు బట్టలు కొనివ్వమని అడుగుట**

అయింది. అందరము భవంతిలో కూర్చొని మాట్లాడుచున్నాము. మా అత్త మాత్రం ఒక మొగురానికి తన భుజాన్ని ఆనించి నిలబడి ఉంది. ఇంతలో ఆ వచ్చిన వ్యక్తి ఈ విధంగా అన్నాడు. ''సాయిరెడ్డీ ఈ సాయంత్రము మార్కెట్‌కు పోదాము, నాకు బట్టలు లేవు, నా శరీరముపై ఉన్న బట్టలు తప్ప వేరేవి లేవు, మనము సుల్తాన్ బజార్ మార్కెట్టుకు పోయి కొన్ని బట్టలు కొందాము'' అని నాతో అన్నాడు. ఈ మాటలు వినగానే నాలో కొంత కోపము వచ్చింది. ఈయన వచ్చి కొన్ని గంటలు మాత్రమే అయింది. ఇప్పుడే మార్కెటుకు వెళ్ళి బట్టలు కొందాం అంటున్నాడు. అంటే ఈయన ఇప్పుడే నాచే కొంత ఖర్చు పెట్టించాలని అనుకుంటున్నాడు, అబ్బా... మళ్ళీ ఈ ఖర్చును నేను ఎలా భరించేది... ఇప్పటికే చాలా ధనమును స్వామి సేవకు వెచ్చిస్తున్నాను, ఏమి చేయుదు, ఎలా తప్పించుకుందును, ఈయన నాకు దాపరించాడే... అని ఆలోచించాను. దీనికి అనుగుణంగా ప్రక్కనే నిలబడ్డ మా అత్త కీ.శే శకుంతలాదేవి నాతో ఈవిధంగా అన్నది. ''ఏమి సాయిరెడ్డీ... ఈయన వచ్చి ఎంత సేపైంది...? ఇప్పుడే మార్కెట్ కు వెళ్ళి బట్టలు కొందామంటున్నాడు, వచ్చేటప్పుడు తెచ్చుకోవద్దా...? ఏమిటిది... నీతో డబ్బు ఖర్చు పెట్టిద్దామని కాకపోతే...'' అని నాతో అన్నది. అప్పుడు మా అత్త ఒక మొగురానికి తన భుజాన్ని ఆనించి ఏటవాలుగా నిలబడి, తన అరచేతిని గదువ క్రింద పెట్టి వేళ్ళను తన చెంపపైన పెట్టుకుని అత్యంత ఆశ్చర్యకరంగా నా వైపు చూస్తూ మాట్లాడింది. నా మనస్సు కూడా ఈవిధంగానే ఆలోచించింది. కల చెదిరింది.

దీనర్థం – డబ్బు విషయము వచ్చేసరికి నేను స్వార్థపరునిగ వ్యవహరించాను. సర్వము నా స్వామియే అన్నదాన్ని నేను ఏకీభవించలేదు. 'నా' అన్నది నాలో పోలేదు. ఈ ప్రపంచ సుఖములు నన్ను వదలలేదు. నాలో చాలా మార్పు రావాలి, నేను నా స్వామి ఆశించిన స్థితికి చేరలేదు, ఇది నిజం, సందేహం లేదు. స్వామి నాకు ప్రత్యక్షంగా చూపారు. ఇంకా తీవ్ర సాధన చేయాలి అని నిర్ణయించుకున్నాను. మరియు శ్రీవేంకటేశ్వరుని కృపతోనే 'నా' అన్నది వదిలించుకోగలనని, లేకుంటే సాధ్యం కాదని కూడా గ్రహించాను. ఈ సంఘటన తరువాత ఏనాడూ నేను 'నా' అన్నది వదిలించుకున్నానని స్వామివారితో చెప్పలేదు, బహుమానం అడగలేదు. ఇక నాకు గురువుగా వచ్చింది విద్యాదేవుడు శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి వారు. మనవి అనుకున్న డబ్బులు కాని, ఆస్తులు కాని పోతున్నప్పుడు ఎలాంటి బాధ ఉండకూడదు, ఇదే 'నా' అన్నది వదిలిన దానికి గుర్తుగా స్థిత ప్రజ్ఞునిగ ఉండాలని భావించాను.

## శ్రీమహాలక్ష్మి అనుగ్రహము

ఈ కల తరువాత నేను ఎంత ప్రయత్నించినా 'నా' అన్నది నశింపచేసుకోలేనని దృఢంగా నమ్మాను, మరియు ఈ దిశగా మళ్ళీ ప్రయత్నించలేదు. నేను మీ సేవలను మాత్రమే చేస్తాను, యోగ్యత అవసరము లేదనే స్థితికి మళ్ళీ వచ్చాను. ఇదే విషయాన్ని మరో లీలలో శ్రీవేంకటేశ్వరుడు చక్కగా చూపెట్టాడు. ఈ రోజు రెండు కలలు కన్నాను. ఇవి వేర్వేరు అయినప్పటికీ ఒకదానితో మరొటి లింకు ఉన్నవి.

**తేది 30-03-2008 కల :** ఈ నాటి కలలో నేను నా భార్య, కుటుంబంతో సహా ఒక శ్రీవేంకటేశ్వరుని ఆలయానికి దర్శనార్థం వెళ్ళాము. అక్కడికి వెళ్ళిన ప్రతి భక్తుడు అక్కడ స్నానము చేసి దర్శనానికి వెళ్ళుట ఆనవాయితీ. నేను కూడా అదేవిధంగా స్నానము చేసి బట్టలు మార్చుకొన్నాను. అయితే నేను లుంగీపై స్నానము చేశాను, దానిని మార్చేటప్పుడు నేను చేసిన స్నానము వలన ఆ లుంగీ కేవలము ముందు భాగము మాత్రమే తడిసిందని తెలుసుకున్నాను, వెనుక భాగము తడవలేదు, దీనిని గమనించి నేను

మళ్ళీ స్నానము చేయుట ఎందుకులే అని భావించి అలాగే బట్టలు మార్చుకున్నాను. దర్శనమునకు సిద్ధమైనాను. కల చెదిరింది.

దీనర్థం నేను బయటి ప్రపంచమునకు చూడ చక్కగా సేవ చేస్తున్నాను. కాని అంతరంగాన పట్టువిడుపులతో లక్ష్యం వైపు సరైన అడుగులు వేయటం లేదని భావం. లేదా నన్ను నేను సంస్కరించుకొనుట లేదు.

ఇదే రోజు రెండవ కలలో నేను స్వామివారి దర్శనార్థం ఒక ఆలయం ముందుకు వెళ్ళాను. ఆ ఆలయం ముందు విశాలమైన మైదానం ఉంది. స్వామి దర్శనానికి వెళ్ళేదారికి ఇరుప్రక్కల పూజా సామాన్లు అమ్మేవారు వరుసగా కూర్చున్నారు. నేను ఆ ప్రక్క ఈ ప్రక్క చూస్తూ వెళ్ళాను. నా కుడిప్రక్కన ఒకామె నల్లని కోల ముఖముతో, వయస్సు సుమారు 45-50 ఉంటుంది. పసుపు పచ్చని చీర, తెల్లని జాకెట్టు ధరించి, అప్పుడే స్నానము చేసి తల వెంట్రుకలు ఆరపెట్టినటుల వాటి చివర ముడి వేసింది. ఆమె నన్ను తదేక దృష్టితో చూచింది. నాకు కూడా ఆమెపై ప్రత్యేక దృష్టి కలిగింది. నేను ఆమె వద్దనే పూజా సామాను కొనుటకు వెళ్ళి మాట్లాడాను. ఆమె అక్కడ ఉన్నవారి అందరిలో ప్రత్యేక ఆకర్షణంగా, చుక్కల్లో చంద్రునిలాగ, ఎర్రని పెద్దబొట్టు ఒకటి తన ముఖముపై పెట్టుకొని, నల్లని ముఖచ్ఛాయతో, ముఖముపై కొన్ని మొటిమలతో ఉన్నది. ఇంతే కల. కాని ఇందులో ఆమె నాకు మాతృవాత్సల్యాన్ని చూపింది.

దీనర్థం శ్రీమహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహము వలన శ్రీవేంకటేశ్వరుణ్ణి సంపూర్ణంగా అర్చించుటకు సిద్ధమైదునని భావం. అంటే నేను తప్పులు చేస్తున్నప్పటికీ నా వెనుక అమ్మవారు ఉండి నన్ను సరైన దారిలో నడుపుతున్నదని గ్రహించాను.

## సురేఖ స్వప్నం

ఇదే రోజు నా భార్య సురేఖ మరో కల కన్నది. అది మా వ్యవహారమునకు సంబంధించింది. ఆ కల ఈ విధంగా ఉంది.

సం॥ 2005 లో స్వామి కృపతో మేము హైదరాబాద్ లోని హబ్సీగూడలో చక్కటి ఇల్లును నిర్మించుకున్నాము. నేను స్వయంగా ఇంజనీరును, ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్నవాణ్ణైనప్పటికీ మా ఆర్కిటెక్ట్స్ చెప్పిన మాటలను వినక నా సొంత భావాలకు అనుగుణంగా ప్లాన్ వేసుకొని నిర్మించాను. కొన్ని రోజుల తరువాత ఆ ప్లాను నచ్చలేదు. అప్పుడు స్వామివారు ఎల్ (L) ఆకారపు హాలును నిర్మించుకొమ్మంటూ సలహా ఇచ్చారు. ఆ విధంగా ఎల్ ఆకారం హాలును నిర్మించుటకు వీలుగ, ఉన్న దానిని కూల్చి వేయుటకు సిద్ధమైనాము. ప్రస్తుతమున్న పూజగదిని తీసివేసి మరో స్థలములో నిర్మించాలని భావించాను. కొద్ది రోజులలో ఈ డిమాలిషన్ వర్క్ మొదలవుతుంది. ఈ సందర్భంగా సురేఖకు కల వచ్చింది.

**తేది 30-03-2008 కల :** దీనిలో నేను కొందరు పనివారిని ఇంటికి తెచ్చి, ఇల్లు రినోవేషన్ చేయుటకని కొన్ని గోడలను పగుల గొట్టుటకు ప్రయత్నిస్తున్నానట. కాని ఇది సురేఖకు ఇష్టం లేదు, ఆమె ఇది వద్దు... అది వద్దు... అనుచు, చివరికి ఈ పూజా మందిరమును మాత్రం ఏమీ చేయవద్దు, ఒకవేళ దీనిని ఏమైనా చేసినచో ముందు నన్ను చంపి ఈ పూజామందిరాన్ని తీయండని నాతో, పనివారితో గొడవ పెట్టుకున్నదట. ఇంతే కల.

దీని అర్థం నేను గ్రహించలేదు. సురేఖ ఉన్నదానితో తృప్తి చెందే రకం, భగవంతునిపై భక్తి ఉంది కాబట్టి ఇలా జరిగిందని భావించాను. ఇక్కడ మరో స్వామివారి నిగూఢ విషయాన్ని చెప్పుచున్నాను. నేను స్వయంగా ఇంజనీరుని, బిల్డరుగా అనుభవజ్ఞుణ్ణైనప్పటికీ నా సొంత ఇల్లు నిర్మాణములో పొరపాటు జరిగింది. తరువాత దీనిని ఈవిధంగా సరిచేసుకొమ్మని స్వామివారు స్వయంగా సూచించారు, ఇది బాగుంది. కాని ఈ విషయం ఇల్లు కట్టుటకు ముందు ఎందుకు తోచలేదు? మా ఆర్కిటెక్ట్ మాటలను ఎందుకు విస్మరించాను? అప్పుడే స్వామివారు ఎందుకు సూచించలేదు? అంటే... నా యొక్క వీక్ పాయింట్స్ పైన దెబ్బ కొడుతూ... నా వద్ద ఉన్న డబ్బును ఖర్చు చేయించి... అత్యంత క్రిందిస్థాయికి తీసుకురావడమే స్వామివారి లక్ష్యం...! దీనిని నెరవేర్చుటకు మా ఇంటిని క్రింది ఫ్లోర్ ఒకసారి, పై ఫ్లోర్ మరోసారి రెండుసార్లు రినోవేషన్ చేయించారు.

## హరి సేవను చూపుట

హరి సేవ చేయడం చాలా కఠినమైన పని. వెతికితే మూడు కాళ్ళ కుందేలునైనా సాధించవచ్చునేమో కాని హరిసేవ చేయుట అంతకంటే కష్టమైన పని యని సాక్షాత్తు హరిసేవ చేసి తరించిన అన్నమాచార్యులు ఒకసారి చెప్పారు. పైకి తేలికగా అగుపించినప్పటికీ ఇది అత్యంత కఠినంగా ఉంటుంది. తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మాకు తన సేవాభాగ్యాన్ని ప్రసాదించినప్పుడు ఒక్క తప్పు లేకుండా సేవ చేయమని ఆదేశించాడు. దీనర్థం మాకు వీలైనంతవరకు స్వామి సేవలో పాల్గొంటున్న ప్రతి భక్తుణ్ణి మరియు స్వామివారిని సంతృప్తి పరచడమే లక్ష్యంగా సేవ చేస్తున్నాము. ఈ సేవలో ఏ ఒక్కరి నుండి ఒక్క పైసా ఆశించకుండా మా సొంత డబ్బుతోనే చేస్తున్నాము. ఎంతో ఇష్టంగా ఈ సేవలను అంటే ప్రతి సంవత్సరము 7 కోట్ల జప సమర్పణ, హైదరాబాద్ నుండి తిరుపతి వరకు 'నమో వేంకటేశాయ' రథయాత్ర మరియు 'శ్రీవేంకటేశం' మాస పత్రిక సేవలను చేస్తున్నాము. నిజానికి మేము సంపూర్ణంగా స్వామివారికి అంకితమైపోయి ఈ సేవనే మా జీవిత ధ్యేయంగా చేస్తున్నాము. కాని... మేము కూడా సాధారణ మనుష్యులము. మాపై కూడా దుష్టశక్తుల ప్రభావము, స్వామి సేవలను అడ్డుకునే యోగమాయ ప్రభావము అందరిలాగే ఉన్నది.




రాక్షసుల బారి నుండి తప్పించుకుంటూ తిరుపతి ప్రయాణం

ఈ సేవను ప్రారంభించిన తరువాత మా జీవన విధానములో ఎంతో మార్పు వచ్చింది. ఎవరితో కలవకపోవుట, శాకాహార భోజనము, ఏకాంత జీవనము గడుపుట వలన ఎంతోమంది మమ్ములను ఎగతాళి చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నవి. మరికొందరు శ్రీవేంకటేశ్వరుడు వీరికి కోట్ల ధన సహాయము చేసి ఉంటాడు కాబట్టి ఈ సేవ చేస్తున్నారని ఎత్తి పొడిచేవారు, భక్తులను తృప్తి పరచడంలో కూడా చాలా ఇబ్బంది పడేవారిమి. దీనితో పాటు మాపై యోగమాయ ప్రభావం అధికంగా ఉండేది. ఈ మాయా ప్రభావం వలన స్వామి సేవ రుచించక దూరంగా వెళ్ళిపోతాం. ఇది మనలోని కామ క్రోధ లోభ మద మోహ మాత్సర్యాలనే అరిషడ్వర్గాలలో దేనినైనా పురిగొల్పి మనలను దైవచింతన నుండి మరల్చుతుంది. దీనిని తట్టుకుని నిలుచుట అత్యంత కఠినమైన పని, అందునా శ్రీవేంకటేశ్వరుణ్ణి మెప్పించే రీతిలో సేవ చేయుట బహు కఠినం. కాని ఇలాంటి ఎన్నో కష్టాలకు ఓర్చి మేము ఈ సేవలను చేస్తున్నామనే విషయాన్ని శ్రీవేంకటేశ్వరుడు ఒక చక్కని లీల ద్వారా ఈ క్రింది విధంగా చూపెట్టాడు.

**తేది 11-05-2008 కల :** అది జప సమర్పణ సమయం. నామ జపమును దాదాపు ముప్పై నలభై బస్తాలలో నింపి వాటిని తిరుపతికి తీసుకు పోవుచున్నాము. ఈ కలలో ఈ జప సంచులను హైదరాబాద్ నుండి తిరుపతికి తీసుకుపోవుటకు జల మార్గము మాత్రమే అందుబాటులో ఉన్నదట. అది ఒక పెద్ద నది లాగా, లేక సముద్రము లోని బ్యాక్ వాటర్ లాగా ఉన్నది. ఈ నీటికి ఇరుప్రక్కల పెద్ద పెద్ద వందల అంతస్తుల భవనములు పదుల సంఖ్యలో నిర్మించి ఉన్నవి. ఉదా : అమెరికాలోని న్యూయార్క్ లేదా చికాగో నగరములు ఏవిధముగా సముద్రము ప్రక్కన పెద్ద పెద్ద అంతస్తుల భవనములు ఉన్నట్లు ఇక్కడ కూడా అలాంటి భవనములు నీటికి ఇరువైపులా ఉన్నవి. మేము జప పుస్తకాల బస్తాలను ఒక బోటులో పెట్టుకుని నా భార్య సురేఖ పిల్లలతో కలిసి తిరుపతికి ప్రయాణమైంది. మాకు సహాయము చేయువారు ఎవ్వరూ లేరు, సురేఖనే ఆ నీటిలో బోటును నడుపుకుంటూ తిరుపతికి రావల్సిన పరిస్థితి ఉన్నది. అప్పటికే నేను సురేఖకు బోటును ఎలా నడపాలి, ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలని సూచనలు ఇచ్చానట. ఇదే సమయంలో పెద్ద మొత్తంలో వర్షం కురుస్తున్నది. నా భార్య అతికష్టం మీద ఈ జప పుస్తకాలు నానకుండా ఏదో ఏర్పాటు చేసుకుంటూ బోటును తిరుపతి వైపు పోవునట్లు తెడ్డుతో నీటిని వెనుకకు లాగుచున్నది. చాలా కష్టపడుచున్నది. వానతో పాటు గాలి దుమారం తీవ్రంగా వీస్తున్నది. ఇలా తిరుపతికి పోవుచున్నది. నేను మాత్రం బహుశా భగవంతుని శక్తి సహాయముతో గాలిలో పైకి ఎగురుచు సురేఖను అనుసరించి వారి రక్షణార్థం పోవుచున్నాను. ఆ బోటు వెళ్ళేదారికి ఇరుప్రక్కల అధునాతనమైన పెద్ద పెద్ద భవనములు ఉన్నవి. ఇంతలో ఆ భవనముల పైనుండి అంటే ఆకాశము నుండి పెద్ద పెద్ద రాళ్ళు మా బోటును, నన్ను లక్ష్యంగా చేసుకుని పడుచున్నవి. నేను ఆకాశంలో ఎగురుకుంటూ ఆ క్రింద పడే రాళ్ళను పెద్ద పెద్ద భవనాలను అడ్డుపెట్టుకొని తప్పించమంటూ సురేఖకు మరియు ఆ బోటుకు ఆ రాళ్ళు తాకకుండా ప్రక్కకు వెళ్ళమని సూచనలిస్తూ, తిరుపతికి పోవుచున్నాము. ఒక ముగ్గురు నలుగురు అదృశ్యంగా ఉన్న రాక్షసులు ఆకాశము నుండి మాపైకి టన్నుల కొద్దీ బరువున్న పెద్ద పెద్ద రాళ్ళను విసురుతున్నారు. ఆ రాళ్ళు నీటిలో పడి పెద్ద శబ్దముతో నీరు నలువైపులా చిమ్ముతున్నాయి. ఒక్క రాయి మాపై పడ్డా బోటు పగిలి పోతుంది, మేము జీవించి ఉండుట కష్టం అనే సైజులో ఆ రాళ్ళు ఉన్నవి. నేను బహుశా స్వామివారి శక్తితో గాలిలో ఒక ప్రక్క నుండి మరో ప్రక్కకు ఎగురుచు వారు విసిరే రాళ్ళ దిశను గమనించి ప్రక్కకు వెళ్ళమని సురేఖకు తగిన సూచనలు ఇస్తున్నాను. ఒక రకంగా నన్ను నేను రక్షించుకుంటూ, సురేఖను మరియు జప బస్తాలను రక్షించుకొనుటకు ప్రయత్నిస్తున్నాను. దారి ప్రక్కన ఉన్న పెద్ద పెద్ద భవనాలు మేము తప్పించుకొనుటకు కొంత సహాయకారిగా ఉన్నవి. ఈవిధంగా అత్యంత కష్టతరంగా మా ప్రయాణం సాగుతోంది. ఇంతలో ఒక బ్రిడ్జ్ వచ్చింది. ఈ బ్రిడ్జ్ దాటకుండా ఆ రాక్షసులు మాపై రాళ్ళవర్షం కురిపించారు. చివరికి అతి కష్టం మీద మా సురేఖ ఆ బ్రిడ్జ్ దాటింది. నేను కూడా దాటి ఆమె వద్దకు చేరాను. వర్షము ఆగింది. నీకేమన్నా అయిందా? అని నేను

సురేఖను అడిగాను. తాను క్షేమంగా ఉన్నానని చెప్పింది. ఆ నీళ్ళ మధ్యలో శ్రీవారి నామంతో నిండిన బస్తాలతో నేను, సురేఖ ఆ బోటులో ఉన్నాము. కల చెదిరింది.

ఈ కలలో యోగమాయ మా యొక్క సేవకు ఏవిధంగా ఆటంకం కలిగిస్తున్నదనే విషయమును బహు చక్కగా చూపెట్టాడు. ఇంతటి కష్టంలో కూడా మేము స్వామి సేవను వదలక కొనసాగించుటను కళ్ళకు కట్టినట్లు చూపెట్టాడు.

## 14 జన్మలు ఋణపడగలిగే అనుగ్రహాలను ప్రసాదించాడని తెలుపుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నా జీవితంలో ఎన్నో ఆణిముత్యాలను ప్రసాదించాడు. కొన్ని అంతకంటె ఎక్కువ విలువైనవి, నా పూర్తి జీవితాన్ని ఆయనకు సమర్పించి ఋణపడగలిగినవి ప్రసాదించారు. సం॥ 2002 తొలి ఏకాదశి రోజు "సాయిరెడ్డి" నావాడు అన్న ఒకే మాటకు పరవశించి నా పూర్తి జీవితాన్ని సమర్పించి మీ ఋణం తీర్చుకొనుటకు సేవ చేస్తానని మాట ఇచ్చాను. ఆ తరువాత దీనితో సమానము లేదా ఎక్కువ విలువ కలిగిన ప్రతి అనుగ్రహానికి ఒక జీవితాన్ని కేటాయిస్తున్నాను. ఇంతవరకు ఇలాంటి పూర్తి జీవితాన్ని సమర్పించి స్వామివారికి ఋణపడే యోగ్యత కలిగిన అనుగ్రహాలు ఒక ఐదారు ప్రసాదించి ఉండవచ్చని భావించేవాడిని. అందుకే నేను ముక్తిని కోరక మరో ఐదారు జన్మలు మానవునిగా జన్మించి మీ ఋణం తీర్చుకునే భాగ్యాన్ని ప్రసాదించమని పదే పదే కోరేవాడిని. కాని ఈరోజు స్వామివారు అసలు విషయం చెప్పారు. నేను ఎంతటి అనుగ్రహానికి పరవశించి నా పూర్తి జీవితాన్ని అంకితం చేశానో అలాంటి అనుగ్రహాలు ఇప్పటివరకు 14 ప్రసాదించారని తెలియజేశారు. ఈ మాట సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడే చెప్పాడు కాబట్టి అందులో ఎలాంటి సందేహమునకు తావు లేదు. నేను పొందిన అన్ని అనుగ్రహాలను వ్రాయక పోవచ్చు, లేక మరచిపోవచ్చు లేదా మరేదో కావచ్చు కాని మొత్తం మీద నా పూర్తి జీవితం ఋణపడే యోగ్యత గల అనుగ్రహాలను ఈనాటి వరకు 14 పొందానని చెప్పారు. నేను ఇంకా 14 జన్మలు ఎత్తి ఈ జన్మలో చేసినంత సేవ చేస్తే తప్ప నా స్వామి ఋణం తీర్చుకోలేను. ఇక నేను జన్మ జన్మలు స్వామివారికి ఋణపడి ఉంటానని అర్థం. స్వామివారు చూపిన ఈ అద్భుతమైన లీల గురించి ఆరోజు ఈవిధంగా వ్రాసుకున్నాను.

స్వామివారి అనుగ్రహాన్ని పొందిన కొద్ది రోజుల వరకు మనస్సు స్వామివారిపై నిమగ్నమై, ఏమీ కోరకుండా, వేరే ఏ విషయమూ ఆలోచించకుండా, నా కర్తవ్యంగా, విధిగా, ధర్మంగా స్వామి సేవ చేస్తూ, ఆయనను స్మరిస్తూ ఉంటాను. కొద్ది రోజుల తరువాత దీనిని మరచిపోయి ఈలోకంలోనికి వచ్చేస్తాను. మనస్సు అనిశ్చయ స్థితిలో ఉండి ఆలోచనలు ఎక్కడికో పోతాయి. అప్పుడు స్వామివారితో మళ్ళీ మొర పెట్టుకోవడము, ఆయనను లేదా ఆయన లీలలను చూడాలని ఉవ్విళ్ళూరుతూ ప్రార్థించడము నా జీవితంలో జరుగుచున్నది. ఇలా స్వామి లీలలను పొందుటకు రకరకాలుగా ప్రార్థించేవాణ్ణి. దీనికి అనుగుణంగా, నా భాగ్యవశాత్తు స్వామివారు కూడా చిత్ర విచిత్రాలను చూపేవారు. ఈరోజు చూపిన చిత్రం కూడా అందులో ఒకటి. వీటిని నేను రోజూ గుర్తు పెట్టుకుని ఆవిధంగా నడుచుకోవాలని వ్రాసుకున్నాను.

**తేది 30-05-2008 కల :** ఈ రోజు శుక్రవారము. ఈ కల నాకు ఉదయం 4 తరువాత వచ్చింది. ఒక పెద్ద అధునాతన కమ్యూనిటీ హాలులో శ్రీవేంకటేశ్వరుని ఉత్సవాలు గత వారం పది రోజుల నుండి జరుగుచున్నవి. ఈరోజు ఆఖరి రోజట. ఈ ఉత్సవాలుజరిగే హాలుకు ఒక చివర ఒక గదితో పాటు ఒక అడుగు ఎత్తులో 12' X 15' సైజుతో స్టేజి ఒకటుంది. ఈ స్టేజి పైన చేసే ప్రతి పూజ ఆ హాలులో కూర్చున్న ప్రతి భక్తునికి స్పష్టంగా కనిపిస్తుంది. ఆ పెద్ద పొడుగాటి హాలులో భక్తులు నిండుగా



స్వామి వారి సంపదను 14 సార్లు తీసుకొనుట

కూర్చుని ఉన్నారు. ఈ స్టేజిపై కొందరు వైష్ణవ స్వాములు శ్రీవేంకటేశ్వరునికి పూజలు, కళ్యాణము లాంటి సేవలు చేస్తున్నారు. ప్రతి వైష్ణవ స్వామి తిరునామం ధరించి ఉన్నారు. ఆ స్టేజి మధ్యలో ఒక ముఖ్య జీయరు స్వామివారు (యతీశ్వరులు) త్రిదండము ధరించి ప్రవచనములు చేస్తున్నారు. నేను ప్రతిరోజు ఈ యతీశ్వరునికి కుడి ప్రక్కన కూర్చుంటాను. నేను నిర్వాహకులలో ఒకడిని మరియు పూజ దుస్తులతో ఉన్నాను. గత వారం పది రోజుల నుండి జరుగు ఈ స్వామివారి కైంకర్యములకు ఈరోజు చివరి రోజు. ప్రతి రోజు భక్తులు భగవత్సేవ నిమిత్తమై బియ్యం, ఖర్జూరపండ్లు, పసుపు లాంటి వస్తువులను తెచ్చేవారు. వాటిని ఒక జోలె సంచిలో నింపి అదే హాలులో ఒక ప్రక్క గోడకు ఆనించి పెట్టారు. ఆ సంచి దాదాపు మూడొంతులు ఆ బియ్యంతో నిండింది. అది చివరి రోజు. నేను మామూలుగా స్టేజి పైన ఆ ప్రవచనములు ఇచ్చే స్వామివారికి కుడిప్రక్కన కూర్చుండేవాడిని. కాని ఆరోజు అలా కూర్చుండలేదు. ఆ స్టేజి పైన శ్రీవేంకటేశ్వరుడు మరియు అమ్మవారి విగ్రహములు కూడా చక్కగా అలంకరించి ఉన్నవి. ఈ విగ్రహముల ముందు ఈ జీయర్ స్వామివారు ప్రవచనములు ఇస్తున్నారు. ఇంతలో నాకు ఏదో పని ఉన్నదట, మరియు నాకు కొన్ని బియ్యము అత్యవసరము వచ్చిందట. చేయునది లేక, శ్రీవేంకటేశ్వరునికై భక్తులు తెచ్చిన బియ్యం నుండి, అనగా శ్రీవేంకటేశ్వరుని బియ్యం లేదా స్వామివారి ఆస్తి నుండి నేను బాకీ నిమిత్తమై అంటే బదులు నిమిత్తమై ఒక తట్టలో ఆ సంచి నుండి బియ్యమును తోడుకున్నాను. నేను లెక్కపెట్టుచు సరిగ్గా 14 సార్లు ఆ బియ్యమును తోడుకున్నాను. ఇవి శ్రీవేంకటేశ్వరుని బియ్యం, ఆయన వద్ద అప్పుగా తీసుకుంటున్నాను, వీటిని తిరిగి తప్పకుండా ఆయనకు ఇవ్వవలె అనే దృఢమైన అభిప్రాయముతో 14 సార్లు, నాకు తగినంత, తీసుకున్నాను. ఆ బియ్యం కొంచెము పసుపు కలిసి అక్కడక్కడ ఖర్జూర పండ్లు, పోక వక్కలతో ఉన్నాయి. కల చెదిరింది.

దీనర్థం ఏమనగా నేను నా స్వామివారికి 14 జన్మలు బాకీ ఉన్నాను. ఆ బాకీ తీర్చవలసిందే! ఆ బాకీ తీసుకున్న ధాన్యముతోనే నేను జీవిస్తున్నాను. ఆ బాకీ తీర్చుటకే ఆయన సేవ చేస్తున్నాను తప్ప నా సొంతమైంది ఆయనకు పెట్టుట లేదు. ఇంతటి మహత్తరమైన, దివ్యమైన సందేశమును నా కళ్ళకు కట్టినట్లు, నేను తృప్తి చెందునట్లు చూపెట్టిన నా స్వామివారికి కోటి కోటి ప్రణామాలను అర్పించాను. మరియు ఇంతటి అనుగ్రహాలకు నోచుకున్న నా జీవితాన్ని ఏమని వర్ణించుదు? లేదా ఇప్పటి వరకు ప్రసాదించిన అనుగ్రహాలతో పాటు ఇకముందువి కూడా కలుపుకుని ఈ జీవితంలో మొత్తం 14 జన్మలు ఋణపడగలిగే అనుగ్రహాలను ప్రసాదించుననే భావం కూడా కావచ్చుననిపించింది. మొత్తం మీద నా ఈ జన్మ గతంలో పొందిన అన్ని జన్మల కన్నా మిన్న అని గ్రహించాను.

**నా దశ :** బహుమానం కొరకు సాధన చేయించారు. స్వామివారితో నా బంధం తెగిపోదన్నారు. గురువుగా శ్రీశ్రీశ్రీ హయగ్రీవ స్వామివారిని పంపారు. స్వామి సేవలో చాలా కష్టపడుచున్నావని అన్నారు. స్వామివారు జీవితం మొత్తం ఋణపడే యోగ్యత గల అనుగ్రహాలు 14 ప్రసాదించినట్లు చెప్పారు. సురేఖను అనుగ్రహించారు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు

**గోవిందదాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,

హైదరాబాద్. ఫోన్: 040-27175050



తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

**దిశానిర్దేశము**



స్వామివారి 700 దివ్యలీలలు

**మొదటి సంపుటము**

తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.

**12 భాగాలు కల**

**పుస్తకము ధర : 250/-**

ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)

ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.

ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)

website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్



ధారావాహికం

# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## దేవసేనాని

సూతమహర్షి వేదిక వద్దకు వస్తుండటాన్ని చూసిన మునులందరూ లేచి ఆయనకు భక్తితో నమస్కారం చేశారు. ఆయన ఆశీర్వదించగానే కూర్చున్న మునులు ఈరోజు ఏం చెప్పబోతున్నారో గురువుగారన్న ఆలోచనలో నిమగ్నులైనారు.

"నాయనలారా! ఈరోజు శివపార్వతుల పుత్రుడైన కుమారస్వామి మహిమ గురించి చెబుతాను శ్రద్ధగా వినండి" అని చెప్పటం ప్రారంభించాడు సూతమహర్షి.

**"హరుడు తనదు వీర్యమగ్నియందిడిన వ**
**హింపఁ జాలకజున కెఱుగ జెప్పి**
**యతడు పనుప దాని నగ్ని గంగా గర్భ**
**భూతముగ నొనర్చె భూపవర్యా!"**

**-175 ప – ద్వితీయాశ్వాసము – శల్యపర్వము – మహాభారతము**

దేవతలు ప్రార్థించగా శివుడు పార్వతీదేవి పరిష్వంగము వీడి వారికి దర్శనమిచ్చాడు. ఇచ్చిన పరమేశ్వరుడు తన వీర్యాన్ని అగ్నిలో నిక్షేపించి దేవతలను అనుగ్రహించాడు. శివ వీర్యాన్ని అగ్ని భరించలేనివాడై, అదే విషయాన్ని బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి ఆయనకు విన్నవించాడు. అగ్ని వాక్కులను విన్న విధాత, శివ వీర్యాన్ని గంగానదిలో ప్రవేశపెట్టమని చెప్పడంతో బ్రహ్మ చెప్పిన విధంగా చేశాడు అగ్నిహోత్రుడు. గంగాదేవి కూడా శివవీర్యాన్ని భరించలేక హిమవత్పర్వతం మీద వదిలింది. కాంతిమంతమైన ఆ వీర్యము రెల్లుదర్భలున్న నేలపైన పడింది. ఆ ప్రదేశమంతా బంగారుమయంగా శోభించింది. అప్పుడక్కడ –

**"ఆ దివ్య నిభుడు విపుల**
**ద్వాదశ బాహుండు షడ్వదనుడఖిల దిశా**
**రోదోంతరంబు వెలుగ మ**
**హోదారుండై కుమారుడుదయంబయ్యెన్"**

**-206 ప - పంచమాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

శరవణం (రెల్లుపొద) నుంచి గర్భంలోని శిశువు, సూర్యకాంతితో ఉదయించాడు. ఆ పసివాడు పన్నెండు చేతులను,



ఆఱు ముఖాలను కలిగిన కుమారుడిగా సకల దిశలను, భూమ్యాకాశా లను ప్రకాశింపచేస్తూ మహానుభావుడుగా అందరిచేత ఆకర్షింపబడ్డాడు.

ఒక్కక్షణం ఆగి సూత మహర్షి – ''మునులారా! కుమారస్వామి ఆరు ముఖాలతో వెలుగొందడానికి ఇంకో విశేషం కూడా ఉంది. హిమవత్పర్వతం మీద తిరుగాడుతున్న కృత్తికలు తేజోమయుడైన కుమారుని చూసి, మాతృభావంతో ఆరుగురూ ఆ బిడ్డడికి పాలివ్వాలని కోరుకున్నారు. పుట్టుకతోనే యోగి లక్షణాలు గల కుమారుడు కృత్తికల భావాలను గ్రహించి, ఆరు ముఖాలు ధరించి ఆరుగురి వద్ద స్తన్యపానం చేశాడు. ఆవిధంగా షణ్ముఖుడిగా ప్రశస్తి చెందిన కుమారస్వామి కృత్తికలకు కూడా పుత్రుడు కావడంతో కార్తికేయుడుగా మరో విశిష్ట నామంతో విరాజిల్లాడు. తొలుత శివపార్వతుల పుత్రుడైన కుమారస్వామి – అగ్నిభవుడిగా, గాంగేయుడిగా, శరవణ జన్ముడిగా, కార్తికేయుడిగా అనేక నామాలతో వర్ధిల్లాడు.

శివపుత్రుడు జన్మించిన శుభవేళలో దేవగురువైన బృహస్పతి వచ్చి ఆ బాలుడికి జాత కర్మలను నిర్వర్తించి వెళ్ళాడు. ఆ కుమారుడు ఉత్తమమయిన తపస్సును విహారంగా, భూదేవి దాదిగా, ధనుర్వేదం మొదలైన వేదాలన్నీ సేవిస్తుండగా దినదినాభివృద్ధి చెందాడు. ఒకనాడా కుమారుడు హిమాలయ పర్వతంలో దాచి ఉంచిన శివుని విల్లును చూసి, దాని అల్లె త్రాటిని మ్రోగించాడు. ఆ మహాధ్వనిని విన్న ఐరావతము, సుప్రతీకములనే దిగ్గజాలు శివపుత్రునిపై విరుచుకుపడ్డాయి. ఆ దేవతా గజాలను రెంటినీ తన రెండు చేతులతో కదలకుండా నొక్కిపట్టాడు ఆ బాలవీరుడు. తన శక్తి ఆయుధాన్ని ఇంకో చేతితో, మరో చేతితో ఆటగా ఒక కోడిని, ఇంకో రెండు చేతులతో శంఖాన్ని పట్టుకొన్నాడు. శంఖాన్ని పూరిస్తూ, వేరే రెండు చేతులతో ఆకాశాన్ని చరిచాడు. మరో రెండు చేతులను ముఖంపైన పెట్టి ఆడిస్తూ, బొటన వేళ్ళను నోటిలో పెట్టుకొని శిశువు లాగా చప్పరించసాగాడు. తక్కిన రెండు చేతులతో క్రీడా విలాసంగా బాణ ప్రయోగం చేస్తూ ఆనందపడ్డాడు. అంతటితో ఆగక తన ఆరు ముఖాలతో ఒక్కసారిగా సింహానాదం చేశాడు. కుమారస్వామి చేసిన ఆ భయంకర ధ్వని ప్రళయకాలంలో భైరవుడు (శివుని భూత గణాధిపుడు) చేసే భీతావహమైన మహాధ్వని లాగా విశ్వమంతా వ్యాపించింది.

**"కులశైలంబులు గ్రక్కునం గదలె : దిక్కుల్ వ్రయ్యలయ్యెన్ : మహీ**
**వలయంబంతయు దిర్దిరం దిరిగె; దేవ వ్రాతముల్ సాధ్వ సా**
**కులతం బొందెఁ : బయోధులన్నియును సంక్షోభించె : సప్తాశ్వు స**
**ప్తులు బిట్టుల్కి రథంబు నల్ దెసలకుంబో నీడ్చె సంభ్రాంతమై"**

**-208ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''కుమారస్వామి చేసిన వింటి యొక్క గుణధ్వనికి (అల్లె త్రాడు లాగగా వచ్చిన శబ్దానికి) – ఏడు కుల పర్వతాలూ వేగంతో సంచలించిపోయాయి. దశదిశలూ బ్రద్దలైనాయి. భూమండలమంతా గిరగిరా తిరిగింది. దేవతలందరూ తొట్రుపాటుతో వ్యధ చెందారు. సప్త సముద్రాలు క్రక్కదలి పొంగి పొర్లాయి. సూర్యదేవుని సప్తాశ్వాలు కలతపడి ఎటు పోవాలో దిక్కు తోచక, రథాన్ని నాలుగు దిక్కులవైపు నడపసాగాయి''.

ఈ విధమైన మహోత్పాతాలు పుట్టడంతో సకల లోకవాసులు భయకంపితులైనారు. దేవతలు మహేంద్రుని వద్దకు వెళ్ళి జరిగిన సంగతి అంతా వివరించారు. "త్రిలోకాధిపతీ! అగ్నిపుత్రుడైన ఈ బాలుడు మహాపరాక్రమంతో ప్రకాశిస్తున్నాడు. గర్వంతో ఏ వీరునీ సరకు గొనటం లేదు. నిన్ను కూడా లక్ష్యపెట్టడని అనిపిస్తోంది. ఇంద్రపదవిని కైవసం చేసుకోగలడు. ఏ క్షణానైనా నీ పైకి యుద్ధం చేయటానికి రాగలడు. కుమారుడు నీపైకి రాకముందే నీవాతని వధించి మా అందరికీ రక్షణ కల్పించవలసిందిగా ప్రార్థిస్తున్నాము" అని దేవతలు లోక క్షేమం కోసం చెప్పగా విని దేవేంద్రుడు తల పంకించాడు. వెంటనే సప్త మాతృకలను పిలిచి 'అగ్ని కుమారుని చంపి రండ'ని చెప్పటంతో వారా పనికి ఉద్యుక్తులై కుమారుని సమీపించారు. అతని నిరుపమానమైన తేజోరాశికి భయపడినవారై, అతనిని శరణు జొచ్చి "మహావీరా! మేము లోకమాతలము. నీకును తల్లి వంటి వారం. మా పట్ల మాతృభావన కలిగి మమ్మల్ని రక్షించుమని వేడగా కుమారుడు పుత్రభావనతో చూసి, వారినాదరించాడు. కుమారుడు తన వద్దకు వచ్చిన అగ్ని దేవుని సభక్తికంగా పూజించి, తండ్రి ఆశీస్సులను పొందాడు. కుమారుని సద్గుణాలను చూసి, మెచ్చుకుని, ఆతని రక్షణ కార్యంలో నిమగ్నుడైనాడు అగ్నిదేవుడు.

అగ్ని, సప్తమాతృకలు కుమారుని ఎదిరించలేక, ఆ వీరుని పక్షం వహించారని విన్న మహేంద్రుడు ఆగ్రహావేశుడైనాడు. బలగర్వంతో చతురంగ బలాలను సమకూర్చుకుని సురవీరులందరూ వెంట నడువగా స్కందుని (కుమారుని) మీదకు భీకర సంగ్రామ వాంఛ తరుముతుండగా దండు వెడలాడు. అగ్ని కణాలను విరివిగా విరజిమ్ముతున్న వజ్రాయుధాన్ని చేతిలో ధరించి, కుమారుని వధించి తీరుతానన్న పట్టుదలతో ఇంద్రుడాతనిని సమీపించాడు. సంగరోత్సాహంతో తనమీదకు వచ్చిన దేవేంద్రుని, దేవతలను చూసిన కుమారస్వామి ఒక నవ్వు నవ్వాడు. ఆ నవ్వులో కోపం, కాఠిన్యం తప్ప మరే దయాగుణం, అనుగ్రహ లక్షణం కనపడకపోవడంతో దేవతలు ఒక్క క్షణం ఖంగు తిన్నారు. వెంటనే తేరుకుని యుద్ధానికి సిద్ధమైనారు. ఇంద్రుని ఆలోచన గ్రహించిన కుమారస్వామి తన ఆరు ముఖాలను ఒక్కసారిగా తెరిచాడు. ఆ స్వామి ముఖాలనే గుహల నుంచి అగ్నిజ్వాలలు వెలువడి దేవతల సమూహాలను దహించసాగాయి. భయంకరమైన అగ్నిజ్వాలల వేడిమికి తట్టుకోలేకపోయిన సురలందరూ కుమారస్వామిని శరణు వేడారు.

**"నీ కింకరులము మమ్ముం**
**జేకొని కృపగావుఁ" మనుచు శిఖినందను న**
**స్తోక బలు శరణు వేడిన**
**చేకొని దాహ భయ ముడుగ జేసె నతండున్"**

**-219 ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

"మహాబలుడవైన అగ్నిదేవుని కుమారా! మేము నీ సేవకులం. మమ్మల్ని దయతో రక్షించు. నీ శరణు కోరుతున్నాం" అని దీనంగా వేడుకొంటున్న సురలను చూసి కుమారస్వామి జాలితో వారికి మంటల వేడిమి లేకుండా కాపాడాడు. దానితో సంతోషపడిపోయిన దేవతలందరూ కుమారస్వామిని ఆశ్రయించారు. అది చూసిన దేవేంద్రుడికి అపరిమితమైన క్రోధం కలిగింది.తనఏలుబడిలో ఉన్నదేవతలుఇతరునిఆశ్రయించడాన్ని చూసి తట్టుకోలేకపోయాడు. వెంటనే కుమారస్వామి మీద తన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. వజ్రాయుధం కుమారుని కుడి పార్శ్వాన్ని తాకింది. అప్పుడు కుమారుని దక్షిణ పార్శ్వం నుంచి అనేకమంది వీరులుద్భవించారు. ఆ భయంకర సన్నివేశానికి భయపడిన మహేంద్రుడు కుమారుని అభయమిమ్మని కోరాడు. నవ యౌవనంతో, పూర్ణచంద్రుడిలాగా సౌందర్యంతో వెలుగొందుతున్న కుమారస్వామిని, అతని శౌర్యాన్ని చూసిన దేవతలు, మునులు ఆ మహాత్ముని భక్తితో కొలువసాగారు. కుమారుని చూసిన వారందరూ –

"మహావీరా! లోకాలనన్నిటినీ జయించిన నీ శక్తి సంపద సంస్తవనీయమైనది. నీ మహిమ చాలా గొప్పది. ఇంద్ర పదవి నధిష్ఠించి మమ్మల్నందరినీ పరిపాలించు" అని అడిగారు.

కుమారుడు వారిని చూసి ఇంద్రపదవిలో ఉండేవారు చేయవలసిన పనులేమిటో చెప్పండి" అని అడగటంతో వెంటనే వాళ్ళు – " సూర్యచంద్రులూ, పంచభూతాలు (భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము) స్థిరంగా ఉండేటట్లు చూడటం; శక్తి సామర్థ్యాలతో లోకమంతటా నీ తేజస్సు నింపి దయామయుడవై పాలించడం; దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయడం – ఇంద్రపదవిలో ఉండేవాని కర్తవ్యాలు సుమా!" అని తెలియజెప్పారు.

వెంటనే ఇంద్రుడు కలుగజేసుకుని "మహావీరా! నీవు దేవతలకు నాయకుడిగా అభిషిక్తుడవై నన్ను సేవకుడిగా స్వీకరించు. నీ దయ వల్ల దోషరహితుడనై ఉండగలుగుతాను. ఇంద్రపదవికి నీవే అర్హుడవు. మమ్మల్నందరినీ ఏలుకోవలసిందిగా కోరుతున్నాను. నీ బలపరాక్రమాల ముందు నేను తూగలేను. ఒకవేళ నేను ఇంద్రపదవిలో కొనసాగినా గిట్టనివాళ్ళు మనిద్దరి మధ్యా వైరభావాన్ని కల్పిస్తారు. అదీకాక నీవు మహేంద్రుడివి కావటమే నాకూ ఇష్టం. కనుక మహాశక్తి సంపన్నా! నీవు ఇంద్రపదవిని చేపట్టు" అన్న దేవేంద్రుని చూసి చిరునవ్వు చిందించాడు కుమారస్వామి.

**"అట్టివి యేలపుట్టు? నమరాధిప! నీవ జగత్త్రభుండవై**
**యిట్టలమైన తేజము వహించి సుఖంబుననుండు : మేము నీ**
**చుట్టమనై భుజాబలము సొంపున నీకెలసంబు దీర్చెదం :**

**జట్టన నన్నుఁ బంపుము భృశంబుగ నెయ్యది కార్యమిత్తఱిన్"**

**-228 ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

"మహేంద్రా! నీకూ, నాకూ మధ్య ఎవరూ శత్రుత్వాన్ని ఏర్పరచలేరు. నీవు తేజోవిరాజితుడవై త్రిలోకాధిపతివై సుఖంగా ఉండు. నీకు బంధువుగా, నా బలపరాక్రమాలతో నీ పనులన్నిటినీ నెరవేర్చి పెడుతుంటాను. ఇప్పుడు నేను చేయవలసిన పని ఏమున్నదో చెప్పి నన్ను పంపించు. తప్పక చేసుకొస్తాను" అన్న కుమారస్వామి మాటలకు ఇంద్రుడు సంతోషభరితుడైనాడు.

"సత్య హిత భాషణుడవైన మహావీరా! నీ ఆజ్ఞతో నేను ఇంద్రపదవిలో సుస్థిరంగా నిల్చి ప్రకాశిస్తాను. శౌర్యశాలీ! దేవతా సైన్యానికంతటికీ నాయకుడివై, కృపతో లోకుల భయాలకు విమోచనాన్ని కలిగిస్తూ మా అందరికీ రక్షణ కల్పించు" అనిన దేవేంద్రుని మాటలకు అంగీకారాన్ని తెలిపాడు కుమారస్వామి. దేవేంద్రాది దేవతలందరూ కుమారస్వామి తమ వాడయినందుకు పరమానంద భరితులైనారు. కుమారుని విజయవార్త విన్న శివపార్వతులు, అతనిని చూడాలన్న కోరికతో సపరివార సమేతంగా బయలుదేరి పుత్రుడున్న చోటికి వేంచేశారు.

**"నానా సిద్ధ గణంబు గొల్వ పరమానందంబునం జంద్ర రే**
**ఖా నవ్యాంచిత మౌళి భూరి భుజగా కల్పోజ్జ్వలాకారుడీ**
**శానుండానత శంకరుండు గిరిజా సంయుక్తుడై వచ్చెఁ ద**
**త్సేనానిం బ్రియసూను షణ్ముఖుని వీక్షింపం గడుం బ్రేమతోన్"**

**-233 ప – అరణ్యపర్వము – పంచమాశ్వాసము – మహాభారతము**

చంద్రరేఖామౌళి, నాగాభరణుడు, భక్తగణ రక్షకుడు అయిన ఈశానుడు, పార్వతీ సమేతుడై ప్రియపుత్రుడైన షణ్ముఖుని చూడాలని వచ్చాడు. శంకరుని వెంట ప్రమథ గణాలు, సిద్ధులు మొదలైన సేవకులు, కొలిచి వస్తుండటాన్ని కుమారస్వామి తన యోగదృష్టితో చూసి శివపార్వతుల కభిముఖంగా నడిచాడు. తన వద్దకు నడిచి వస్తున్న కుమారుని చూసిన శివుడు తన మనసులో 'పార్వతి, అగ్ని, గంగాదేవి ఉండగా కుమారుడు వారందరికన్న నన్ను అధికుడిగా భావించి నా దగ్గరకు ముందుగా వస్తున్నాడా? పుత్రునికి నాపైన భక్తి, గౌరవం, ప్రేమ అంత మిక్కుటమైనవా?' అని అనుకొన్నాడు. శివునిలాగానే ఉమాదేవి, అగ్ని, గంగ కూడా భావిస్తుండటాన్ని యోగవిద్యలో కుశలుడైన కుమారస్వామి తెలుసుకొన్నాడు. తెలుసుకొని ఒక్కడే నలుగురు కుమారులుగా రూపాలు పొంది ఒకేసమయంలో నలుగురి వద్దకు వెళ్ళడం అక్కడి వారందరూ చూసి ఆశ్చర్యంతో తల మునకలయ్యారు. కొద్దిసేపటికి కుమారుడు ఒక్కడై భాసించాడు. కుమారుడి మహిమకు పరమానంద భరితులైన పార్వతీ పరమేశ్వరులు, అగ్ని, గంగాదేవి – బ్రహ్మదేవుని చేరి, 'విధాతా! ఈ కుమారుని తేజస్సుకు, సుగుణ సంపదకు తగిన ఉత్తమమైన పదవిని నిర్ణయించి ఇమ్మ'ని అడిగారు. దానికి బ్రహ్మ – దేవతలకు మేలు చేకూర్చాలనే తలంపుతో 'ఈ కుమారుడు దేవసేనకు పతియగు గాక' అని నిర్ణయించి తెలిపాడు. ఇంద్రుడు, వరుణుడు మొదలైన మేటి వేల్పులను కుమారుడికి చూపించి – 'వీళ్ళు నీకు రక్షకులు సుమా! అని అప్పగించాడు. ఇంద్రాది దేవతలు కుమారస్వామిని దేవసేనానిగా అభిషేకించాలన్న ఉద్దేశంతో బ్రహ్మదేవుని ముందుంచుకొని సరస్వతీ నదీతీరానికి వెళ్ళారు. హిమవంతుడు రత్నమయమైన దివ్యపీఠాన్ని అమర్చాడు. ఆ దివ్యపీఠం పైన కుమారస్వామిని కూర్చుండబెట్టి బృహస్పతి హోమకార్యాన్ని నిర్వర్తించాడు. హరి హర బ్రహ్మలు, మహర్షులు అభిషేక ద్రవ్యాలను, సరస్వతీ నదీజలంతో నింపిన మణి కనక కలశాలు ధరియించి నిలవగా, గంధర్వులు, అప్సరసలు శుభప్రదమైన గీతాలు ఆలపించారు. మహర్షి శ్రేష్ఠులు పుణ్యాహవచనాలు పలికారు. పార్వతి, లక్ష్మి, సరస్వతి, శచి మొదలైన పుణ్యాంగనలు దీవిస్తూ సేసలతో అభిషేకించారు (స్నానం చేయించారు). అంగరంగ వైభవంగా కుమారస్వామికి సేనాధిపతిగా పట్టం కట్టారు. పట్టాభిషేకానంతరం త్రిమూర్తులు, దేవేంద్రాది దిక్పతులు తమ తమ అనుచరులలో, రూప గుణ బలపరాక్రమాలలో అధికులైన వారిని ఎన్నుకొని కుమారస్వామికి అనుచరులుగా అప్పగించారు. చతురంగ బలాలతో నిండిన సైన్యాన్ని కుమారునికి మూల బలంగా ఇచ్చారు.

**"శంకరుడుదిత భాస్కర నిభ ధ్వజమును**
**వాసవుడు సుర విధ్వంసకరణ**
**పరిణత శక్తియు, హరి బలవర్ధని**
**యగు వనమాలయు, నగజ యెపుడు**
**మాయని వెలిపట్టుదోయిని, గంగయు**
**జ్వల సుధామయ కమండులువు, గురుడు**
**దీప్తదండము, వైనతేయుండు మహిత మ**
**యూరంబు, వరుణుండుదార రూప**
**మైన తామ్ర చూడంబును, నర్థ విభుడు**
**దర్పితచ్ఛాగమును, శతదళ భవుండు**
**లసిత కృష్ణాజినంబును నసమ సమర**
**జయము నొసగిరి ప్రీతి నా షణ్ముఖునకు"**

**-184 ప – ద్వితీయాశ్వాసము – శల్యపర్వము – మహాభారతము**

పరమశివుడు ఉదయభాస్కరుని కాంతితో సమానమైన కాంతితో వెలిగిపోతున్న ధ్వజాన్ని (జెండాను) ప్రేమతో కుమారునకిచ్చాడు. దేవేంద్రుడు రాక్షసులను ధ్వంసం చేసే శక్తి ఆయుధాన్ని కానుకగా ఇచ్చాడు. విష్ణుమూర్తి బలాన్ని పెంచే వనమాలను కుమారునికిచ్చి దీవించాడు. పార్వతీదేవి ఎన్నడూ

మాసిపో నటువంటి తెల్లని పట్టు వస్త్రాల జతను కుమారుని చేతిలో పెట్టి ఆశీర్వదించింది. గంగాదేవి అమృతమయమైన కమండలాన్ని ఇచ్చి సంతోషపడింది. బృహస్పతి ప్రకాశమానమైన దండాన్ని ఇచ్చి కీర్తిమంతుడివి కమ్మని పలికాడు. గరుడుడు గొప్ప మహిమ గల నెమలిని, వరుణుడు కుక్కుటాన్ని, కుబేరుడు మేకలను ఇచ్చి తృప్తి చెందించారు. బ్రహ్మదేవుడు జింకతోలునిచ్చి, రణరంగంలో ఎల్లవేళలా విజయుడివి కమ్మని ప్రేమతో పలికి ఆశీర్వదించాడు. ఈ విధంగా సకల దేవతాధిపులు కానుకలివ్వడమే కాక తమ తమ సైన్యాలను కుమారస్వామికి సమర్పించి, శివపుత్రుని ఆనందపరవశుని చేశారు.

దేవేంద్రుడప్పుడు బ్రహ్మ ఆజ్ఞచే తాను సురక్షితంగా సాకుతున్న దేవసేన అనే కన్య గుర్తుకు రావటంతో దేవకాంతలను పిలిచి ఆమెను చక్కగా అలంకరించి సభకు తీసుకురమ్మని చెప్పి పంపాడు. వారు కూడా దేవసేనను సర్వాలంకృతురాలిగా చేసి తెచ్చినట్లుగా ఇంద్రుడికి చెప్పారు. ఇంద్రుడు కుమారస్వామిని చూసి – 'శివకుమారా! ఈ కన్య నీ కోసమే బ్రహ్మదేవుని చేత సృష్టింపబడింది. కనుక ఈ సుందరాంగిని స్వీకరించుమని చెప్పాడు' అని చెబుతున్న సూతమహర్షిని నమస్కారంతో ఆపి – ఒక ముని లేచి ''మహాత్మా! దేవసేన ఎవరు? ఆమె ఎవరి పుత్రిక? ఇంద్రుడి రక్షణలో ఎందుకున్నది? షణ్ముఖుడు ఇంద్రుడు చెప్పినంత మాత్రాన ఆమెను పెండ్లాడాడా? వివరంగా తెలుసుకోవాలని అనిపిస్తోంది చెప్పండి గురుదేవా!'' అని అడగడంతో చెప్పసాగాడు సూతమహర్షి.

''నాయనా! అడగవలసిన ప్రశ్న అడిగావు. చెబుతాను అందరూ వినండి. పూర్వం రాక్షసుల చేత ఓడిపోయిన ఇంద్రుడు తారకాది మహాబలవంతులైన రాక్షసేంద్రులను ఎలా జయించాలా అని ఆలోచిస్తూ, వారి బలాన్ని అణచివేయగల శక్తిమంతుడెవడని తనలో తాను ప్రశ్నించుకొంటూ 'మానస' మనే పర్వతం మీద నడయాడుచుండగా ఆ త్రిలోకాధిపతికి ఒక ఆడుదాని ఆర్తనాదం వినిపించింది. ఆ దిక్కువైపు వెళ్ళి చూడగా సుందరాంగి యైన ఒక కన్యను బలవంతంగా తీసుకొని వెళుతున్న 'కేశి' అనే రాక్షసుడు కనిపించాడు. ఇంద్రుడాతనితో ఘోర యుద్ధం చేసి, ఆ కన్యను విడిపించి ఆమె వివరాలడిగి తెలుసుకొన్నాడు. ఆ సుందరి తండ్రి అరిష్టనేమి అనే ప్రజాపతి అని వినగానే ఇంద్రుడు 'అమ్మా, నీ జనని, నా జనని అక్కచెల్లెండ్లు. అందుచేత నీవు నా సోదరివి అని అనగానే ఆమె పొందిన ఆనందం అపారం. 'అన్నా! నా పేరు దేవసేన. నా తల్లీ, నీ జననీ దక్షప్రజాపతి కుమార్తెలన్నమాట. చిన్నప్పుడు నా తండ్రి నాతో 'తల్లీ! నీకు పేరు ప్రతిష్ఠలు గల మహాపరాక్రమశాలి భర్త కాగలడ'ని చెప్పాడు. నీవు నన్ను వరం కోరుకో ఇస్తానన్నావు. నా



కోరిక తెలియజేస్తాను విను.

**"అనిమిష దానవేంద్రులకు నైన నజయ్యుడు, నుగ్రవైరి భం జనుడు, త్రిలోక రక్షణ వశంవదుడున్, భవదిష్ట మిత్రుడన్ ఘన గుణ కీర్తనుండు నగు కాంతునిఁ గోరెద, నా మనోరథం బు నెరయ సంఘటించి సురపుంగవ! నన్నుఁ గృతార్థఁ జేయవే!"**

**-189 ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''దేవదానవులకెవ్వరికీ జయింప శక్యము కానివాడు, భయంకరులైన వైరి వీరులను వధించేవాడు, ముల్లోక వాసులను రక్షించేవాడు, నీకిష్ట మిత్రుడు, సద్గుణ సంపన్నుడు అయిన వాడు నాకు భర్త కావలెనన్నది నా కోరిక. నా కోరిక తీర్చి, నన్ను కృతార్థురాలిని చేయమని ప్రార్థిస్తున్నాను'' అని దేవసేన చెప్పడంతో, ఆమెకు భర్త కాగలవాడెవడా? అని ఆలోచిస్తూ బ్రహ్మ వద్దకు వెళ్ళాడు దేవేంద్రుడు.

దేవసేనను చూపి ''విధాతా! ఈ కాంతకు తగిన వరుని ప్రసాదించుమ''ని ఇంద్రుడు కోరడంతో ''ఇంద్రా! ఈ కన్యకు కీర్తిమంతుడు, మహాపరాక్రమశాలీ, త్రిలోక రక్షకుడు అయినవాడు భర్త కాగలడు. ఆతడే దేవతలను, నిన్ను రక్షిస్తాడు. దేవసేనానిగా మీ కష్టాలు పోగొడతాడు'' అని బ్రహ్మదేవుడు చెప్పి వారిని సంతోషపఱుస్తాడు. ఇంద్రుడు బ్రహ్మకు నమస్కరించి, దేవసేనను తీసుకొని తన మందిరానికి వెళ్ళి ఆమెకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాడు. మునులారా! దేవసేన ఎవరో ఇప్పుడు తెలిసింది

గదా! ఒక ప్రజాపతి కూతురు, మరొక ప్రజాపతి మనుమరాలు, అతిలోక సౌందర్యవతి అయిన దేవసేనను చూసి, అంగీకారంతో పార్వతీనందనుడు చిరునవ్వులు చిందించాడు. మాతాపితల ఆమోదంతో, దేవమునుల సంతోషాల మధ్య కుమారస్వామి దేవసేనను వివాహమాడాడు.

**"మానిత విక్రమోజ్జ్వలుడు మంగళ తూర్య నినాద మొప్పఁ దే**
**జో నిధి వహ్ని సాక్షిగ విశుద్ధ విధిజ్ఞుడు దేవమంత్రి మం**
**త్రానుగమంబొనర్పఁగఁ బ్రియం బెసలార వరించెఁ జారుప**
**ద్మానన దేవసేనఁ గరియానఁ గర గ్రహణ ప్రయుక్తితోన్"**

**-237 ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

"మహాపరాక్రమశాలి, తేజోనిధి అయిన కుమారస్వామి, మంగళవాద్య ధ్వనులు మిన్నుముట్టుతుండగా, దేవమంత్రి అయిన బృహస్పతి శాస్త్రోక్తంగా మంత్రాలను ఉచ్చరిస్తుండగా అతిలోక సౌందర్యవతి, గజగమన అయిన దేవసేనను ప్రేమమీర అగ్నిసాక్షి వివాహం చేసుకొన్నాడు.

**"గుహుడు దేవసేనఁ గోరి పెండిలియైన**
**యా దినంబు షష్ఠియగుటఁ జేసి**
**చర్చనీయమయ్యె నా దివసంబు లో**
**కములనెల్ల వెలసె గారవమున"**

**-238ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

"కుమారస్వామి ప్రేమతో దేవసేనను పెండ్లాడిన రోజు షష్ఠి కావటం వల్ల అన్ని లోకాలలో ఆ రోజు కుమార షష్ఠిగా, స్కంద షష్ఠిగా, సుబ్రహ్మణ్య షష్ఠిగా అందరిచేత పూజింపబడుతోంది. స్కంద షష్ఠి నాడు కుమారస్వామిని స్మరించినా, ధ్యానించినా, అర్చించినా, అభిషేకించినా ఆయన కోరుకున్న వరాలను ప్రసాదిస్తాడన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం.

దేవసేనానిగా వెలుగులీనుతున్నవాడిని, బలపరాక్రమాలు ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్న మహావీరుని, నిజపుత్రుని చూసి పరమశివుడు – స్కందుడిక అమర విరోధులను నాశంబు చేసి దేవతలకు హితాన్ని సమకూర్చటానికి సిద్ధం కావాలని తలచి భూతమయమైన మహాసైన్యాన్ని ఇచ్చాడు. ఇంద్రాది సకల దేవతలు తమ సైన్యాలతో కుమారుని చుట్టూ చేరారు.

శంఖం, భేరి, ప్రణవం మొదలైనవాటి విజయ నాదాలు దిక్కుల నిండా మారుమ్రోగాయి. ఇంద్రాదులవల్ల వారినందరినీ తారకాసురుడు అనేక బాధలకు గురి చేశాడని తెలుసుకొన్న కుమారస్వామి వెంటనే తారకుని మీదకు యుద్ధానికి తరలి వెళ్ళాడు. ఆ విషయం విన్న తారకాసురుడు కూడా ససైన్యంగా కుమారునికి ఎదురు నడిచాడు. వారిద్దరి మధ్య భయంకరమైన యుద్ధం జరిగింది.

**"తన దొరలు తాను తారక**
**దనుజేంద్రుడు కార్తికేయుఁ దాకిన న మృతా**
**శన గణ సమ్మద సంపా**
**దనుడగు చును శక్తియతడు ధరియించె నృపా!"**

**-188 ప – ద్వితీయాశ్వాసము – శల్యపర్వము – మహాభారతము**

"తారకాసురుడు తన సైన్యాధిపతులతో, మంత్రులతో కుమారస్వామిని భీకరంగా ఎదుర్కొన్నాడు. ఆ దానవాధిపతి తన మీదకు రావటం చూసిన కార్తికేయుడు దేవతలకు సంతోషం కలిగేటట్లు శక్తి ఆయుధాన్ని ధరించాడు. అప్పుడు అత్యద్భుతంగా ఆ శక్తి ఆయుధం నుంచి అనేక కోటి శక్తులుద్భవించి దానవసైన్యాన్ని, మిక్కిలి పరాక్రమశాలురైన తారకుని సైన్యాధిపతులను హతమార్చాయి. దేవవీరులు కూడా రాక్షసులను వధించారు. కుమారస్వామి ప్రయోగించిన శక్త్యాయుధం శత్రువులను పరిమార్చి, తిరిగి శివపుత్రుని చేతిని అలంకరించింది. అది చూసిన తారకాసురుడు మిక్కిలి క్రోధవశుడై కుమారునితో యుద్ధానికి పూనగా, ఆ మహావీరుని శక్త్యాయుధానికి ఆ దానవ వీరుడు బలియై నేల కూలాడు. తారకాసుర సంహారంతో కుమారస్వామి విజయుడై దేవతల జయ జయ ధ్వానాలతో, సంస్తుతులతో ప్రకాశించాడు. దేవసేనాని పరాక్రమానికి అచ్చెరువొందిన దేవతలాతనిని జేరి తమ బాధలను విన్నవించుకొన్నారు. క్రౌంచ పర్వతం నివాసంగా గల బలిపుత్రుడైన బాణుడు మహాబలవంతుడై దేవతలను అనేక బాధలకు గురి చేస్తున్నాడు. అతని బారినుండి మమ్మల్ని విముక్తుల్ని చేయమని ప్రార్థించిన సురలను కరుణాళుడై చూసి స్కందుడు బాణాసురుని మీదకు దండు వెడలాడు.

**"కడిమిం బోయి మహోగ్రశక్తినిహతిం గ్రౌంచంబు భేదించి యె**
**క్కుడు గర్వం బున వచ్చి మార్కొనిన రక్షోనాథుఁ దత్సైన్యముం**
**గడు వేగంబున రూపుమాపి ముని సంఘంబుల్ ప్రశంసింపఁ బె**
**ల్లడరన్ నిర్జర దుందుభి ధ్వనులు పుష్పాసార మొప్పారగన్"**

**-192 ప – ద్వితీయాశ్వాసము – శల్యపర్వము – మహాభారతము**

"త్రిభువనానందకరుడైన కుమారస్వామి, మహోగ్రశక్తిని ప్రయోగించి క్రౌంచ పర్వతాన్ని భేదించాడు (చీల్చాడు). గర్వంతో తనను ఎదుర్కొన్న రాక్షసాధిపుడైన బాణుని, అతని సైన్యాన్ని వెనువెంటనే రూపుమాపి, శివపుత్రుడు ముని సమూహాల ప్రశంసలందుకొన్నాడు. దేవదుందుభులు మ్రోగుతుండగా ఆ విజయవంతునిపై అప్సరసలు పుష్పవర్షం కురిపించారు. కుమారస్వామిని అండచేసుకుని దేవతలు, మునులు, సర్వజనులు సుఖజీవనులైనారు" అని చెప్పి సూతమహర్షి – షణ్ముఖ స్తుతితో పరవశుడైనాడు. సూతునితో పాటు మునులందరూ

కుమారస్వామి స్తుతిలో లీనమై ఆశ్రమోన్ముఖులైనారు.

–0–

## ఉపసంహారం

ఆఖ్యానమంటే కథ. ఉపాఖ్యానమంటే ఉపకథ. చిన్నకథ. ప్రతి ఉపకథ – ప్రధాన కథకి ఉపబలకంగా ఉంటుంది. ఉపకరిస్తూ ఉంటుంది. ప్రధాన కథను అనుసరిస్తూ తనను ప్రధాన కథ అనుసరించగలిగేటట్లుగా చేసుకోగల పటిమను కలిగింది ఉపాఖ్యానం. అందుకే మహాభారతం అనేకానేక ఉపాఖ్యానాలను తనలో ఇముడ్చుకున్నది. ఏ కథకు ఆ కథే మానవుడికి మహోన్నత సందేశాన్నిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది. ఉపాఖ్యానాలే లేకపోతే భారత ప్రధానాఖ్యానికి ఉనికీ లేదు, పట్టూ లేదు. మహాభారత వృక్షానికి పువ్వులుగా విరిసి, పండ్లుగా తియ్యదనాన్నిచ్చి, వేర్లుగా లోతుకు పాతుకుపోయి – ఆచంద్ర తారార్కం నిలబెట్టి – తద్వృక్ష ఫలితాన్ని మనకందించింది ఉపాఖ్యానాలే.

మాతృభక్తికి ప్రతీకగా నిలిచింది గరుడోపాఖ్యానం. నేటి యువత ఈ కథను అర్థం చేసుకుంటే వృద్ధాశ్రమాలే ఉండవు. ఈనాటి ఆడపిల్లలకు అద్భుతమైన మార్గదర్శి శకుంతల కథ. పెద్దలకు తెలియకుండా చాటుమాటు వివాహాలు చేసుకున్న వారికి, వివాహేతర సంబంధం కలిగించుకున్న వారికి – శకుంతల జీవితం ఒక చక్కని కనువిప్పు. మగవారు కూడ తమ హద్దుల్లో ఉంటే ఎలాంటి అనర్థాలూ వాటిల్లవని కచుని కథ బోధిస్తుంది. అలాగే అధికార గర్వానికి, కన్నుమిన్ను కానని కామానికి ఎంతటి పతనం సంభవిస్తుందో నహుషుని కథ చెప్తోంది.

దృఢ దీక్షకు, కార్య సాధనకు భగీరథుని జీవన సరళియే ఒక మహోన్నత తార్కాణ. అపకారికి, ప్రాణహంతకుడికి కూడ మహోపకారం చేసిన నాడీజంఘుని కథ తారాస్థాయి నందుకున్నది. అనేక ధర్మాలను, ధర్మ సూక్ష్మాలను కూలంకషంగా వివరించాయి ధర్మవ్యాధోపాఖ్యానము, పద్మని కథలు. నమ్మకం లేనిచోట క్షణమైన నిలువరాదని, ఆత్మ గౌరవం అత్యవసరమని స్పష్టం చేసింది వ్యాఘ్ర గోమాయు ఉదంతం. ప్రాణ రక్షణ కోసం బలవంతుడయిన బద్ధ శత్రువుతో అయినా స్నేహాన్ని పాటించి ముందు తనను తాను కాపాడుకోవాలని, శత్రువుతో స్నేహం – అవసరార్థం కేవలం క్షణమాత్రమేనని – ధర్మసూక్ష్మాన్ని తెలియజెప్పిన మూషిక మార్జాలం కథ ఉపాఖ్యానాలకు మకుటాయమానం. పగను మనస్సునిండా నిలుపుకొని, ప్రతీకార వాంఛతో రెండు జన్మల జీవితాలను వ్యర్థం చేసుకొన్న అంబ కథ మనకు చక్కని గుణపాఠంగా నిలిచింది.

దైవ లీలలతో కూడిన ఉపాఖ్యానాలూ భారతంలో చోటు చేసుకున్నాయి. కుమార సంభవం, తారకాసుర వధ కథ – ఆ స్వామి మహిమను చాటుతున్నాయి. త్రిపురారి అయిన పరమశివుడు – లోక కంటకులయిన త్రిపురాసురులను లోక భీకరంగా సంహరించి – లోకాలను కాపాడిన వృత్తాంతం – మనలను భక్తులుగా చేస్తుంది. మానవుడికి దైవభక్తి ఎంతైనా అవసరం. ఇలాంటి ఉపాఖ్యానాలు మనలను భగవంతునికి చేరువయ్యే మార్గంలో నడిపిస్తాయి.

నారదుడు, మైత్రేయ మహర్షి, మార్కండేయుడు, భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు మొదలైన వారంతా ధర్మజాదులను ధర్మ మార్గంలో నడిపించడానికే ఈ కథలను చెప్పాడు. ప్రతి ఒక్క ఉపాఖ్యానమూ చెడును నివారించమనే చెప్పింది. ప్రతి ఒక్క ఉపాఖ్యానమూ ప్రబోధాత్మకమే.

రాజధర్మాలు, రాజనీతి ధర్మాలు, కుటిల నీతిమార్గాలు, స్వీయరక్షణోపాయాలు, స్వధర్మాలు, పరధర్మాలు, దుర్నీతి పథకాలు, దైవభక్తి, మాతృభక్తి, రాజభక్తి, దేశభక్తి వైనాలు, పగ – ప్రతీకార ఫలితాలు, యుద్ధనీతులు, యుక్తియుక్తాలు, లోకరీతులు, లోకనీతులు, భగవల్లీలలు ఇలా ఎన్నో అంశాలు భారతోపాఖ్యానాలలో నిండి ఉండి మహాభారతానికే వన్నె తెచ్చి పెట్టాయి.

నిజానికి ఈ ఉపాఖ్యానాలన్నీ భారత ప్రధాన కథకు ఉపబలకాలు మాత్రమే కాదు – మానవ జీవితానికే మార్గదర్శకాలు. మానవ జీవితమే మహాభారతం. లోనారసి సూక్ష్మాలను అంది పుచ్చుకుని ఆచరిస్తే మానవుడు మహానుభావుడవుతాడు. అందుకే ప్రతి ఒక్కరూ మహాభారతాన్ని చదవాలి. వినాలి. అర్థం చేసుకోవాలి. ఆచరించాలి. ఎందుకంటే – మహాభారతం పురాణం. ఇతిహాసం. ఆధ్యాత్మిక కావ్యం. ధర్మశాస్త్రం. చతుర్వేద సారం. పంచమవేదం.

**"యదిహాస్తి తదన్యత్ర**
**యన్నేహాస్తి న తత్క్వచిత్"**

అన్నాడు మహాభారత కర్త వ్యాస భగవానుడు.

**సర్వేజనాః సుఖినో భవంతు**

**శ్రీవేంకటేశం పాఠకులకు శ్రీమహాభాగవతము మరియు మహాభారతంలోని మహోపాఖ్యానాలను అందించిన రచయిత్రి డా॥ పులిగడ్డ విజయలక్ష్మి గారికి శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షాలు లభించాలని కోరుకుంటున్నాము.**

***- ఎడిటర్, శ్రీవేంకటేశం***



# గోదాదేవి వైభవమ్

– చిల్లర సీతారామారావు

శ్లో॥ "స్వోచిష్ట మాలికాబంధ గంధ బంధుర జిష్ణవే
మాదృశా కించన త్రాణ బద్ధ కంకణ పాణయే
విష్ణుచిత్త తనూజాయై గోదాయై నిత్య మంగళం"

తాను తాల్చి విడిచిన మాల యొక్క కస్తూరికా గంధ ప్రియత్వముచే బాంధవ్యము కలిసిన విష్ణువు గలది, నా వంటి పేదలను రక్షించుటకై కంకణము కట్టుకొన్న పాణి గలది, మహాత్ముడగు విష్ణుచిత్తుని కుమార్తె యగు గోదాదేవికి నిత్య మంగళమగు గాక.

చాంద్రమానాన్ని అనుసరించి మృగశిరా నక్షత్ర యుక్త పౌర్ణమి గలది మార్గశీర్ష మాసం. ధనూరాశి యందు సూర్యుడు ఉండటము వలన దీనికి ధనుర్మాసము అని పేరు. మార్గశిర మాసములో నందవ్రజ కుమారికలు కాత్యాయనీ వ్రతమును ఆచరిస్తారు. వారిలాగే శ్రీరంగనాథ వారి ప్రియ భక్తురాలు గోదాదేవి, శ్రీరంగనాథుడిని భర్తగా బడయగోరి ధనుర్మాస వ్రతమును ఆచరించింది. ఆ వ్రతమే తిరుప్పావై.

ధనుర్మాసము డిసెంబర్ 15-16 తేదీలలో ప్రారంభమై జనవరి 14 వ తేదీన మకర సంక్రాంతితో పూర్తవుతుంది. ధనుర్మాసము నందు విష్ణువును పూజించితే పునర్జన్మ అనునది ఉండదు. ధనుర్మాసము నందు వైష్ణవాలయములు భక్తులతో కళ కళ లాడుతుంటాయి. ఈ మాసమున విష్ణువు మధుసూదనుడను పేరుతో పూజలందుకుంటాడు. విష్ణువును భక్తి శ్రద్ధలతో పూజిస్తే మనోరథములన్నీ నెరవేరుతాయి. ధనుర్మాసమున శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయమున సుప్రభాతమునకు బదులు తిరుప్పావైను గానం చేస్తారు. తిరుప్పావైలోని కవితలను పాశురములు అని అంటారు. ఈ పాశురములను గోదాదేవి రోజుకొకటి చొప్పున పాడి ధనుర్మాస వ్రతములో వీటిని స్వామివారికి సమర్పించింది. తిరు అను శబ్దమునకు శ్రీకరమగు అని అర్థం. పావై అను శబ్దమునకు వ్రతము అని అర్థము. తిరుప్పావై అనగా శ్రీవ్రతము అని అర్థము. ఈ పాశురములను రచించిన గోదాదేవికి "శూడికొడుత్త నాచ్చియార్" అను పేరు కూడా ఉంది. శూడి అనగా తాను ధరించిన, కొడుత్త అనగా పూలమాలలు, నాచ్చియార్ అనగా దేవునికిచ్చిన అని అర్థము. సంస్కృత భాషలో 'ఆముక్త మాల్యద' అని పిలుస్తారు. ఆముక్త మాల్య అనగా తాను ధరించి విడిచిన పుష్పమాలిక, ద అనగా ఇచ్చునది. ఇది ఆముక్త మాల్యదకు వ్యుత్పత్తి అర్థము. పన్నెండుమంది ఆళ్వారులలో ఒకరైన స్త్రీమూర్తి గోదాదేవిని ధనుర్మాసమున వైష్ణవాలయాలలో పూజిస్తుంటారు.

ధనుర్మాస వ్రతమును ఆచరింపదలచినవారు వేకువ

జామున నే లేచి స్నానాదికములు ముగించుకుని శుచిగా ఆరవేసిన బట్టలను ధరించాలి. లలాటమునందు ఊర్ధ్వముగా తిలకాన్ని పెట్టుకుని స్వామి సన్నిధికి చేరవలసి ఉంటుంది. గంధ, పుష్ప, ధూప, దీపాది షోడశోపచారాలను సమర్పించాలి. బెల్లము, ద్రాక్ష, జీడిపప్పు మొదలగువాటితో పొంగలిని చేసి మిక్కిలి భక్తితో స్వామికి నివేదన చేయాలి. తరువాత స్వామికి నమస్కరించి తమ మదిలోని కోర్కెలను నివేదించుకోవాలి. భగవంతుని ప్రసాదమును ఒకసారి మాత్రమే తీసుకొంటూ ఒక నెల ఈ వ్రతమును ఆచరించాలి. ఈ విధముగా ఆచరించినందువల్ల మోక్షప్రాప్తి కలుగుతుంది. వ్రతానంతరము పూజించిన ప్రతిమను సద్బ్రాహ్మణునకు దానముగా ఇవ్వాలి. వైష్ణవాలయాలలో ధనుర్మాసము నందు మొదటి పదిహేను రోజులు దధ్యోదనమును ప్రసాదముగా పెడతారు. తదుపరి పదిహేను రోజులు చక్కెరపొంగలిని ప్రసాదముగా భక్తులకు ఇస్తారు.

ధనుర్మాసమున అన్నదానము చేసిన వారికి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. సూర్యోదయ కాలములో బ్రాహ్మణ భోజనము ఉత్తమము. రెండు ముహూర్త కాలములయిన మధ్యమము. మూడు ముహూర్త కాలములైన అధమము. బ్రాహ్మణాదులకు పప్పు, భక్ష్యములతో, మంచి గడ్డపెరుగుతో, పరమాన్నము పెట్టి సంతృప్తులను గావించినచో వందమంది బ్రాహ్మణులకు పుణ్యతీర్థములలో అన్నదానము చేసినంత ఫలితము కలుగుతుంది. చలిలో బాధపడు బ్రాహ్మణులకు వస్త్ర దానము చేసినవారు ఇహ పరలోకములందు సుఖములను అనుభవిస్తారు. ధనుర్మాసము నందు పూజలు చేసి, విష్ణువుకు సంబంధించిన గాథలను తప్పనిసరిగా వినాలి. అలా వినినవారికి రుగ్మతలు కలగవు. ధనుర్మాసము చాలా సందడిగా ఆనందముగా ఉంటుంది. వేకువజామునే స్త్రీలు బాలికలు మేల్కొని వాకిళ్ళను శుభ్రము చేస్తారు. గోమయము కలిపిన నీటితో కళ్ళాపి చల్లుతారు. వరిపిండితో ముగ్గులు వేస్తారు. ఆ ముగ్గుల మీద గోమయముతో చేసిన ముద్దలను ఉంచుతారు. ఆ ముద్దలకు వరిపిండితో కుంకుమబొట్లు పెడతారు. వాటికి పువ్వులు గుచ్చుతారు. పిదప పూలతో పూజిస్తారు. ధనుర్మాసము ముప్పై రోజులు వేకువ జామున స్నానానంతరం విష్ణువును పూజించాలి. ముప్పై రోజులు పూజించిన తరువాత పూజించిన ప్రతిమను సద్బ్రాహ్మణునకు దానముగా ఇవ్వాలి. 'తిరుప్పావై' రచయిత్రి గోదాదేవి వైభవమును ఒకసారి స్మరించుకుందాం.

పాండ్య దేశమున విల్లిపుత్తూరు అను నగరమున్నది. ఆ నగర దేవాలయమున శ్రీమహావిష్ణువు శ్రీరంగనాథుడను పేర పూజలందుకుంటున్నాడు. ఆ నగరమున భట్టనాథుడు అను బ్రాహ్మణుండేవాడు. అతనికి చిన్నప్పటి నుండి విష్ణుభక్తి ఎక్కువ. నిత్యము విష్ణువును హృదయమునందే నిలుపుకుని ఉండటము చేత ప్రజలు అతనిని విష్ణుచిత్తుడని పిలవసాగారు. శ్రీరంగనాథుడికి తులసిమాలలు కట్టి సమర్పించడము విష్ణుచిత్తుడి నిత్యకృత్యము. తులసీదళములు, పువ్వులు మున్నగు వాటికోసం ఒక తోటను ఏర్పాటు చేసుకున్నాడు. రోజూ ప్రాతఃకాలముననే లేచి స్నానాదికములు పూర్తి కావించుకుని తోటకు వెళ్ళి తులసిదళములను, పువ్వులను సేకరించి వాటిని మాలలుగా అతని దినచర్యలో ఒక భాగమై పోయింది. ఒకనాడు తులసి వనమునకు వెళ్ళి తులసి దళములను కోయబోతుండగా, వికసిత తామర పుష్పము వలె శోభిల్లుచున్న చిన్నారి శిశువొకటి కనుల పండువలా విష్ణుచిత్తుడికి కనిపించింది. సంతానము లేని తనకు దైవమే ఆ బిడ్డను ప్రసాదించెనని ఆనందపడిపోయాడు. ఆ శిశువును ప్రేమతో ఎత్తుకొని తన గృహమునకు తిరిగి వచ్చాడు. ఆ శిశువును చూచి విష్ణుచిత్తుడి ధర్మపత్ని ఆనందభరితురాలైంది. ఆ శిశువుకు 'కోదై' అను నామకరణము గావించారు. కోదై నామము కాలక్రమేణా గోదాదేవిగా మారిపోయింది.

దినదినాభివృద్ధి చెందుతూ గోదాదేవి అల్లారుముద్దుగా పెరగసాగింది. పన్నెండు సంవత్సరములకే సంస్కృత, తమిళ భాషలలో ప్రవీణురాలు అయింది. విష్ణుచిత్తుడు శిష్యులకు విష్ణుభగవానుని అవతార గాథలు వినిపిస్తుండగా వాటిని శ్రద్ధగా వినుచుండెడిది. తులసి మొక్కలకు నీరు పోయడము, తులసిదళములను కోయడము, తులసి మాలలను కట్టడం మున్నగు పనుల యందు తండ్రికి తోడ్పడుతుండెడిది. దైవ కైంకర్యములలో తండ్రికి నీడవలె వెంట ఉండేది. విష్ణుచిత్తుడు తన శిష్యులకు వేదాంతార్థములు, వైష్ణవ భక్తిభావములు, శరణాగతి తత్వము, స్వార్థరాహిత్య భావము మున్నగు విషయములను బోధిస్తున్నప్పుడు గోదాదేవి కూడా వాటిని ఏకాగ్రతతో వినుచుండెడిది. విష్ణువు అవతార గాథలు విని, విని ఆమె లేత మనస్సులో విష్ణువు నందు మక్కువ ఏర్పడింది. వివాహము చేసుకుంటే విష్ణుభగవానుడినే చేసుకోవాలన్న భావన ఆమెలో ఏర్పడింది. వయస్సుతో పాటు ఆ భావన క్రమంగా పెరుగుతూ వచ్చింది. తండ్రి ద్వారా గోపికలు కాత్యాయనీ వ్రతమాచరించి తమ జీవితములను ధన్యము గావించుకున్నారు అని విన్నది. తను కూడా కాత్యాయనీ వ్రతమాచరించి జీవితమును ధన్యము చేసుకోవాలనుకున్నది. కాత్యాయనీ వ్రతమునే ధనుర్మాస వ్రతమని కూడా అంటారు. గోదాదేవి ధనుర్మాస వ్రతమును ఆచరిస్తూ, రోజుకో పాశురము చొప్పున, ముప్పై రోజులు ముప్పై పాశురములు రచించి శ్రీరంగనాథస్వామికి అర్పించింది.

గోదాదేవికి పెళ్ళీడు వచ్చింది. గోదాదేవికి వివాహము చేయవలెనని నిశ్చయించుకున్నాడు విష్ణుచిత్తుడు. ఆ సంగతి తెలిసిన గోదాదేవి నాకు చిన్నప్పటినుండి విష్ణువు

అంటే చాలా ఇష్ట ము. విష్ణువునే వివాహము చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. నాకు వేరే సంబంధములు చూడకండి అని తన మనస్సులోని మాటను తెలియజేసింది. గోదాదేవి అభిప్రాయమును వినిన విష్ణుచిత్తుడు ఆమెతో – మానవ యువతి భగవంతుడిని ఎలా వివాహం చేసుకుంటుంది? ఏ ప్రబంధమందయిననూ, ఏ కావ్యము నందైననూ చదివావా? అని పలికాడు. కాని గోదాదేవి తన నిశ్చయమును మార్చుకోవడానికి ఇష్టపడలేదు. ఆమె మనో నిశ్చయము వినిన విష్ణుచిత్తునకు ఏమి చేయాలో తోచలేదు. నేను భగవంతుడినే వివాహము చేసుకుంటాను అని చెప్పడముతో ఆమె మానవుడిని వివాహము చేసుకోవడానికి సంసిద్ధముగా లేదని అర్థమైపోయింది. మాటలలో పెట్టి ఆమె మనస్సును మార్చేద్దామని విష్ణుచిత్తుడు ఇలా అన్నాడు.

అమ్మా! భగవంతుడు సర్వాంతర్యామి కదా! నీవు అతడిని ఎలా వివాహము చేసుకుంటావు? అని అడిగాడు. సమాధానంగా గోదాదేవి – అర్చావతారమున భక్తుల కోర్కెలను తీర్చు భగవంతుడిని సేవించి, ఆయన అనుగ్రహంతో వివాహము చేసుకుంటాను అని పలికింది. అయితే తల్లీ! అర్చావతారములు అనేక దివ్యతిరుపతులందు వెలసి యున్నాయి గదా! నీవు ఏ అర్చామూర్తిని వివాహం చేసుకుంటావు? అని నవ్వుతూ అడిగాడు. అర్చావతారముల గురించి, దేవాలయముల వైభవము గురించి, తండ్రి వలన, భక్తుల వలన, యాత్రికుల వలన ఇంతకుముందే తెలిసికొని యున్నది. అందువలన గోదాదేవి – తండ్రీ! శ్రీరంగ పుణ్యక్షేత్రమున, వైభవోపేతముగా ఉన్న శ్రీరంగనాథుడినే వివాహమాడతాను అని జవాబిచ్చింది. కాలము యథావిధిగా జరిగిపోతూనే ఉన్నది. గోదాదేవి తండ్రి కట్టిన తులసిమాలలను ధరించి, పెరటిలోని బావిలో తన సౌందర్యమును చూచుకొని మురిసిపోయెడిది. తరువాత ఆ మాలను తిరిగి యథాస్థానమునందుంచెడిది. శ్రీరంగనాథుడికి తనమీద దయ ఎప్పుడు కలుగుతుందా అని ఎదురు చూస్తూ ఉండేది. తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళి గ్రంథములలోని పాశురములను పరవశమున, మనోహరముగా పాడుతుండెడిది. ఇలా కొంతకాలము గడిచిపోయింది.

రోజూ మాదిరిగానే ఆ రోజు కూడా గోదాదేవి తులసిమాలను ధరించి పెరటి తోటలోనికి వెళ్ళింది. బావినీటియందు తన సౌందర్యమును చూసుకొని మురియసాగింది. అదే సమయమున గృహమునకు తిరిగి వచ్చిన విష్ణుచిత్తుడు గోదాదేవిని గమనించి ఆశ్చర్యపోయాడు. గోదాదేవి చేసిన పనికి ఆగ్రహం కల్గింది. చిరుకోపముతో–ఎంతటి అపరాధము గావించావు తల్లీ! స్వామికి సమర్పించవలసిన మాలను ముందుగా నీవు ధరించి, దానిని అపవిత్రం చేశావు. ఇప్పటికే సూర్యాస్తమయమైనది. మరియొక హారము కట్టుటకు అవకాశము లేదు. స్వామిని ఆరాధించే సమయము ఆసన్నమవుతున్నది. ఈరోజున తులసిమాలలే లేకుండా పోయాయి కదా! ఎంతటి అపరాధము జరిగిపోయింది అని వాపోయాడు. చింతాక్రాంతుడై ఆరోజు నిద్రిస్తుండగా పలుమార్లు ఈ సంఘటననే మనస్సును తొలచివేస్తున్నది. ఆలోచనలతో సతమతమవుతూ నిద్రలోకి జారిపోయిన విష్ణుచిత్తునికి కలలో శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై – విష్ణుచిత్తా! నీవు బాధపడవలసిన పని లేదు. గోదాదేవి ఎవరో కాదు, సాక్షాత్తు భూదేవి అవతారమే. నాకు పూలమాలను సమర్పించడానికే గోదాదేవిగా అవతరించింది. ఆమె ధరించి ఇచ్చిన మాల అంటేనే నాకు చాలా ఇష్టము. కనుక నిత్యము ఆమె ధరించి ఇచ్చిన మాలనే నాకు సమర్పించుము అని పలికి అదృశ్యమైనాడు. శ్రీరంగనాథుడి పలుకులకు ఆనంద పరవశుడయ్యాడు విష్ణుచిత్తుడు. మరుసటి రోజునుండి తులసిమాలను ఎటువంటి సందేహము లేకుండా నిండు మనస్సుతో దేవాలయమునకు వెళ్ళి రంగనాథుడికి సమర్పించసాగాడు. ఇలా కొంతకాలము గడిచిపోయింది.

ఒకనాడు శ్రీరంగనాథుడు విష్ణుచిత్తుడికి కలలో కనిపించి గోదాదేవిని పరిణయమాడుతానని, ఆమెను తీసుకొని మేనాలో దేవాలయమునకు రమ్మని చెప్పి అదృశ్యమయ్యాడు. పిదప గోదాదేవికి కలలో కన్పించి నీ భక్తికి, అనురాగమునకు ప్రసన్నుడయినాను. నిన్ను పరిణయమాడుతాను. చక్కగా అలంకరించుకొని, మేనాలో బయలుదేరి రమ్ము. నిన్ను శ్రీరంగమునకు తీసుకొని రమ్మని మీ తండ్రి గారికి తెలియజేశాను అని పలికి అదృశ్యమయ్యాడు. శ్రీరంగనాథుడి పలుకులు ఆమెకు అంతులేని ఆనందమును కలిగించాయి.

శ్రీరంగనాథుడి ఆదేశానుసారముగా గోదాదేవిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. సర్వాలంకార భూషితయైన గోదాదేవి ముత్యాలపల్లకిలో కూర్చున్నది. మంగళ వాద్యములు మ్రోగిస్తూ వాద్యకారులు ముందుకు నడవసాగారు. పల్లకీకి ఇరువైపులా పాండ్యరాజ దంపతులు, విష్ణుచిత్తుడు నడవసాగారు. పల్లకి వెనకాల అశేష భక్తజనము అనుసరించసాగారు. వైభవోపేతముగా ముత్యాల పల్లకి శ్రీరంగనాథుని దేవాలయమునకు చేరుకున్నది. గోదాదేవి పల్లకి దిగి, అతివేగముగా, ఆనందముగా, భక్తి శ్రద్ధలతో, చకచకా అడుగులు వేస్తూ గర్భాలయము లోనికి ప్రవేశించింది. రాజదంపతులు, విష్ణుచిత్తుడు, అశేష భక్తజనము గర్భగుడి ద్వారము వరకు వచ్చారు. గోదాదేవి గర్భాలయములో శేషపాన్పు వరుస మెట్లను అధిరోహించి శ్రీరంగనాథుడి పాద పద్మముల కడ ఆసీనురాలై స్వామి యందైక్యము చెందింది. అనగా స్వామివారి పాదముల వద్దనే పరమ పదమును చేరుకున్నది. ఇదియే గోదాదేవి దివ్య వైభవము.

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్త్వం

- రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

శుకమహర్షిని పరీక్షిత్తు మహారాజు అడుగుతున్నాడు ఇలా–

సంస్థాపనాయ ధర్మస్య ప్రశమాయేతరస్య చ ।
అవతీర్ణో హి భగవానంశేన జగదీశ్వరః ॥
న కథం ధర్మసేతూనాం వక్తా కర్తాభిరక్షితా ।
ప్రతీపమ్ ఆచరద్బ్రహ్మన్ పరదారాభిమర్శనమ్ ॥
ఆప్తకామో యదుపతిః కృతవాన్ వై జగుప్సితమ్ ।
కిమభిప్రాయ ఏతం నః సంశయం ఛింధి సువ్రత ॥

జగన్నాథుడైన కృష్ణుడు ధర్మాన్ని స్థాపించడానికి– అలాగే అధర్మాన్ని నశింపచేయడానికి– అవతరించాడు కదా! ధర్మస్వరూపుడు– ధర్మాన్ని స్వయంగా ఆచరించేవాడు అయివుండి– పరమ జుగుప్సితంగా పరభార్యలతో కలిసితిరగడం ధర్మవిరుద్ధం కాదా? శ్రీహరి ఆప్తకాముడు. తనకు ఏవిధమైన కామం లేనివాడు– ఇలాంటి నింద్యమైన కార్యానికి పాల్పడటం ఏపాటి ధర్మం? దయతో నా ఈ సంశయాన్ని తీర్చవా?



పరభార్యను స్పృశించి– అపహరించి– మహాపరాధానికి పాల్పడిన రావణుని సంహరించాడు శ్రీరాముడు.సుగ్రీవుడు బతికుండగానే అతని భార్య రుమతో కూడిన కారణంగా–వాలిని శిక్షించాడు శ్రీరాముడు. అహల్యతో సంగమించిన ఫలితానికి ఇంద్రుడు శాపగ్రస్తుడైనాడు. అలాగే తన భార్యని కూడా శపించాడు గౌతమమహర్షి. ఇతరుల భార్యల పొందు క్షమించరాని నేరమైనపుడు కృష్ణుడు గోపభామలను రాసక్రీడకి– పిలిచాడు. వారిని స్పృశిస్తూ క్రీడించడం శిక్షార్హమే కదా. ఆ స్వామి ధర్మ వ్యతిక్రమణము దోషమవుతుంది కదా. దీనికి శుకబ్రహ్మ సమాధానం ఇస్తున్నాడు.

పరీక్షిత్తు మహారాజుతో అంటున్నాడు శుకమహర్షి–

ధర్మవ్యతిక్రమో దృష్ట ఈశ్వరాణాం చ సాహసమ్ ।
తేజీయసాం న దోషాయ వహ్నేః సర్వభుజో యథా ॥
ఈశ్వరాణాం వచస్సత్యం తథైవాచరితం క్వచిత్ బుద్ధి మాంస్తత్ సమాచరేత్ ॥

ఈశ్వరులుగా చెప్పబడే సమర్థులైన తేజోవంతులు వున్నారు. వారి కార్యాలు ధర్మవిరుద్ధంగా కనపడవచ్చు. ఆలోచిస్తే– వారి వారి కార్యాలకు ఎటువంటి దోషాలు అంటవు. ఇది మంచి ఇది చెడు అనే భేద బుద్ధి లేకుండానే సకల పదార్థాలను శుభ్రంగా భక్షిస్తున్న అగ్నికి ఏవిధమైన మాలిన్యమూ అంటుకోదు. అలాగే గుణదోషాలను సరి సమానంగా స్వీకరించ గల శక్తిసామర్థ్యాలు వున్న తేజోమూర్తుల ఆచరణాల్ని తప్పు పట్ట కూడదు.

క్షీరసాగర మథనంలో పుట్టిన కాలకూట విషానికి భయపడితే–పరమశివుడు దానిని తన కంఠంలో కుదురుగా నిలుపుకున్నాడు. ఆయన ఆచరణ లోక కల్యాణదాయకం అయ్యింది. అలాగే గోవర్ధనగిరిని ఏడు రోజులుగా ఎత్తిపట్టాడు కృష్ణుడు. అది కూడా లోకహితార్థమే. మరి సామాన్యులు కాలకూట విషాన్ని తాగితే–కాలిపోయి బూడిదవుతారు. అలా కృష్ణునిలాగా కొండనెత్తగలరా?

వ్రజగోపికలను ఆనందింపచేయడానికి రాసక్రీడలో కృష్ణభగవానుడు తన యోగమాయని ప్రదర్శించి– అనేకానేక రూపాలను ధరించాడు. అటువంటి రాసక్రీడ సామాన్యులు కనుక ఆచరిస్తే ఫలితం ఎలావుంటుందో చెప్పాలా?

పరీక్షిన్మహారాజా! కృష్ణభగవానుడు మొదలైనవారు సర్వసమర్థులు. వారు పలికిన మాటలు నిత్యసత్యాలు. అవి మనకు ఆచరించదగినవే. అయితే వారి ఆచరణలు మాత్రం

సామాన్యులకు అనుగుణంగా వున్నవి మాత్రమే అనుసరించాలి.

పరీక్షిత్తు మహారాజా! దేహాత్మాభిమానం లేనివారు అహంకారరహితులై వుంటారు.వాళ్లకు సంసార జంటాం వుండదు. వాళ్ల శుభాశుభకర్మలు అన్నీ లోకహితార్థమే. కుశలం అకుశలం వలన సంభవించే సుఖదుఃఖాది సంబంధం లేనపుడు– పశుపక్ష్యాదులు మానవులు దేవతలు మొదలైన చరాచరజీవకోటికి ఏకైక స్వామియైన కృష్ణభగవానుని విషయంలో చెప్పాల్సిన పనిలేదు.

మహాత్ములైన సనక సనందాదులు ఆ శ్రీహరి(కృష్ణుని) పాదపద్మరేణువులు సేవిస్తూ ఎంతో ఆనందభరితులవుతారు. వాళ్లందరూ కూడా కృష్ణభగవానుని అనుగ్రహంతోనే కర్మబంధాలనుంచి విముక్తులవుతారు. సంకల్పమాత్రంతో మానవ దేహాన్ని కృపతో స్వీకరించి– అవతరించిన స్వామికి మనలాగా కర్మబంధమెట్లుంటుంది?

రాధా కృష్ణ నామాన్ని ఎందరో ధ్యానిస్తూ స్మరిస్తూ వుంటారు. బోలో రాధేశ్యాం అని ఉత్తర భారతదేశ వాసులు–తన్మయులై భజనలు చేస్తూ వుంటారు. అయితే సంస్కృత ఆంధ్ర భాగవతాల్లో ఎంత వెదికినా రాధ మనకు కనపడదు. కృష్ణ భగవానునుడు అదృశ్యమైనపుడు– గోపికలు స్వామిని అన్వేషిస్తున్నపుడు ఒక స్త్రీ పాదముద్రలు చూస్తారు.

అనయారాధితో నూనం భగవాన్ హరీశ్వరః ।
యన్నో విహాయ గోవిందః యామనయద్రహః ॥

నిజంగా ఆ కాంత మన జగన్నాథుడైన కృష్ణదేవుని భక్తిపూర్వకంగా సేవించియే వుంటుంది. ఎందుకంటే–ఆ గోవిందుడు మనలను అందరినీ విడిచిపెట్టి– ఏకాంతంలో ఆమెతో కలిసి నడిచివుంటాడని తలచారు.

అక్కడ అనయారాధితో అనే ఒక పదప్రయోగంలో రాధ అనే పేరు వచ్చిందని కొందరి వ్యాఖ్యాతల అభిప్రాయం.ఈ రాధ విషయముగా రక రకాలైన అభిప్రాయాలు ఇంకా వాదోపవాదాలు సాగుతూనే వున్నాయి. అయితే దక్షిణాది తిరుప్పావైలోని పాశురాల్లో నప్పిన్న–నీళాదేవి–అనే పేర్లు వినబడుతున్నాయి. ఏడు ఎద్దులను లొంగదీసి– నాగ్నజితిని కృష్ణుడు వివాహం చేసుకున్నాడు. మరి ఆమే నప్పిన్న నీళాదేవీలు అని మరి కొందరి అభిప్రాయం.

అయితే ఉత్తర దక్షిణ దేశాలలోని రాధ–నప్పిన్న నీళాదేవీలు కేవలం కల్పిత పాత్రలని మరి కొందరి అభిప్రాయం.ఏది ఏమైనప్పటికి రాధాకృష్ణుల ప్రేమ అజరామరమైనది. నిజంగా విశ్వప్రేమకు ఉదాహరణ చెప్పమంటే రాధాకృష్ణుల పేర్లే చెబుతారు. ఈ శరీరం కృష్ణభగవానునిదే.నాది కాదు. ఈ బతుకు నాది కాదు–కృష్ణ పరమాత్మదే. అదే రాధా గోపికల తత్వం. త్వదీయం వస్తు గోవింద– తుభ్యమేవ సమర్పయే–నీ వస్తువు నీకే అంకితం గోవిందా!అదే వారి త్యాగనిరతి.

విశ్వంలోని సమస్త చరాచర ప్రాణికోటికి అంతరాత్మయైన భగవానునుడుతనకుఒకలీలగాతలచి–దేహధారిఅవుతున్నాడు. ఆవిధంగా తన లీలామానుషరూపాన్ని ధరించడం–ఆయా జీవకోటినంతయూ అనుగ్రహించాలనే కదా. అందుకే తన దివ్య శరీర స్పర్శతోనూ దర్శనంతోనూ మృదుభాషణాలతో ఆనందింపచేస్తాడు. అంతేకాదు–ఎవరెవరికి ఏవిధమైన అనుబంధాలు కావాలో–ఆయా విధంగానే అనుగ్రహిస్తాడు. ఇక రాసక్రీడ జరిపినా– గోపికలు అందరూ వారి వారి భర్తల బిడ్డల అత్తమామలు చెంతనే వున్నట్లు భావించారట.

మహర్షులు అందరూ వ్రజ గోపికలుగా స్త్రీరూపధారులైనారని– అదంతయూ భగవత్ సంకల్పమనే–పురాణకథనం నిజమైనపుడు–ఇక వ్రజభామినులకు పైపైకి కనిపించేవి లౌకిక బంధాలు కావని అనుకోవాలి.

కృష్ణుని రాసక్రీడ విషయంలో–బాగా పరిశీలిస్తే–బహు నర్తకీ నర్తకాయుక్త నృత్య విశేషమని భరతుని నాట్య శాస్త్రం చెబుతోంది. అంటే అనేకానేక నర్తకీ నర్తకులు చేసే ఒకానొక విధమైన నాట్య ప్రక్రియ. ఇది లౌకిక పరమైతే–మరి అలౌకిక అర్థంలో చెప్పాలంటే" రసో వై సః"–రసం అనగా అతడే భగవానుడే. ఆనంద స్వరూపుడు. అంతే కాదు– అతడే ఆనంద ప్రదాత కూడా. అందుకనే అనేకానేక వ్రజ గోపభామలతో కృష్ణ భగవానునుడు రాసక్రీడ సలిపాడు. రసానుభూతిని– ఆనందానుభూతిని ప్రసాదిస్తున్న వాడెవడు అన్నపుడు భగవానుడే కదా. ఇక ఆ స్వామి చేసిన లీల– రాసలీల– ఆనందలీల. అదే రాసక్రీడ.

అలౌకికమైన వస్తువును చెప్పడానికి లౌకిక భాషనే వాడాలి. కనుక భాషను వదలాలి.భావాన్ని పట్టుకోవాలి. ఆ గోపికలు తమ భక్తి పండిన ప్రేమను లౌకిక భాషలో కామం అన్నారు. ఆ ప్రేమ సిద్ధి కోసమేగా ఉద్ధవాదులు పరితపించారు. అందుకనే పోతన కామోత్కంఠితం అనే అర్థంలోనే చెప్పాడు.

ఉద్ధవునికి తాను కృష్ణ భక్తుడననే అహంకారం బాగా తలకెక్కింది.దానిని అణచాలని కృష్ణస్వామి తలచాడు.తను త్వరలో గోకులానికి వచ్చేస్తానని–ఆ సందేశాన్ని గోపికలకు చెప్పాలని ఉద్ధవుణ్ణి పంపాడు.అక్కడ గోపభామల మధుర భక్తికి ఉద్ధవుని అహంకారం మొత్తం అణగిపోయింది.

నంద వ్రజ స్త్రీణాం పాదరేణుమభీక్షశః అంటాడు ఉద్ధవుడు. నంద వ్రజ గోప భామల పాదధూళిని తలమీద దాల్చినవారికి పదే పదే శిరసా నమస్కారం చేస్తూనే వుంటాను అన్నాడు ఉద్ధవుడు.

ఇంతా చేసి గోపికలు కృష్ణభగవానుని కోరుకున్నది మూడే మూడు మాత్రం.1–కృష్ణ దర్శనం కావాలి. (దానితో జన్మ ధన్యమవుతుంది) 2–స్వామీ చేయి తమ తలలపై వుంచాలి. (తమ మనస్సులోని అసురగుణాలు భస్మమైపోవాలి) 3–తమ

వక్షఃస్థలంపై దివ్య పాదాలను వుంచాలి. (హృద్రోగాలు నశించాలి)

నిరంతరం భగవన్నామాన్ని స్మరిస్తూ–ఆ భగవానుని దివ్యమైన మంగళ కళ్యాణ గుణగణాలను మనసారా కీర్తిస్తూ–పరవశించిపోయేవారు కొందరు–పరమాత్మ సేవా భాగ్యంతో తన్మయులైపోయేవారు కొందరు–అలాంటి వాళ్లందరూ మోక్షాన్ని కోరుకోరు.ముక్తి దశలో–పరమ పదంలో సదా పశ్యంతి సూరయః– దివ్యసూరులతో పాటుగా శ్రీమన్నారాయణుని తృప్తిగా దర్శిస్తూ– అమితానందాన్ని పొందుతూ వుంటారు.

ఈరోజుల్లో భక్తులం అని చెప్పుకుంటున్న మనం భగవానుని లెక్కలేనన్ని కోరికలు కోరుతున్నాం. చిల్లర మల్లర కోరికలు తీర్చే దేవుడు దేవుడే కాదు. దుష్టశిక్షణ శిష్ట రక్షణ– ధర్మప్రతిష్ఠాపనం కోసమే స్వామి అవతరిస్తుంటాడు. నీ పాదమే శరణం అనే వారు అరుదుగానే వుంటారు.హంగూ ఆర్భాటాలు అనేవి తెలియవు వారికి. పిచ్చివాళ్లమాదిరి వుంటారు. సమస్త కర్మాచరణనూ భగవదర్పితం చేసిన భాగ్యశాలురు వారు. అందుకే కృష్ణభగవానుడు వారి హృదయాలలో స్థిరంగా వుంటాడు.

**(సశేషం)**

# తిరుప్పావై

శ్రీమతే రామానుజాయ నమః

తిరుప్పావై ఒక అద్భుత వేదాంత గ్రంథం. భగవంతుని సులభంగా అందించగలిగే సాధనామార్గం. తిరు అంటే శ్రీ అని, పావై అంటే పాటలు లేక వ్రతం అని అర్థం. కలియుగంలో మానవకన్యగా జన్మించి గోదాదేవిగా ప్రఖ్యాతమైన ఆండాళ్ భగవంతుడినే తన భర్తగా భావించి, ఆయన్ను చేపట్టడానికి సంకల్పించిన వ్రతమే తిరుప్పావై వ్రతం. తిరుప్పావైలో పాశురాలు ఉంటాయి. పాశురం అంటే ఛందోబద్ధంగా ఉన్న పాటలు. ఆండాళ్ అపురూప భక్తి పారవశ్యాన్నే శ్రీకృష్ణదేవరాయలు ఆముక్త మాల్యద అనే గ్రంథంగా అందించాడు.

తిరుప్పావై వ్రతానికి కొన్ని విధి విధానాలు ఉన్నాయి. వేకువజామునే నిద్ర లేచి స్నానం చేయాలి. ప్రతిరోజు క్రమం తప్పకుండా స్వామి కీర్తనలను, తిరుప్పావై పాశురాలను ఆలపించాలి. పేదలకు దానాలు, పండితులకు సన్మానాలు చేయాలి. స్వామికి, ఆండాళ్ కు ఇష్టమైన పుష్పకైంకర్యం చేయాలి. ప్రతిరోజూ స్వామివారికి పొంగలి నివేదించాలి.

సృష్టిలో భగవంతుడొక్కడే పురుషుడు. మానవులందరూ స్త్రీలు అనే ఉద్దేశంతోనే విష్ణుమూర్తిని శ్రీవారు అని సంబోధిస్తుంటారు. అటువంటి విష్ణుమూర్తిని భర్తగా పొందాలనే తలపుతో గోదాదేవి ధనుర్మాసంలో చేసిన ఈ వ్రతాన్ని నేటికీ మనం ఆచరిస్తున్నాం. ధనుర్మాసం మొదటిరోజున ఈ వ్రతాన్ని ఆరంభించి, భోగిరోజున ఆండాళ్, శ్రీరంగనాథుల కళ్యాణం జరిపించడంతో ఈ వ్రతం ముగుస్తుంది.

శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం భక్తిసాగరంలో మునిగి తేలినవారిని ఆళ్వారులు అంటారు. పన్నెండుమంది ఆళ్వారులలో విష్ణుచిత్తుడు మొదటివాడు. ఆయన గోదాదేవికి



భక్తిసంపదలను వారసత్వంగా ఇచ్చాడు. నిజానికి భూదేవియే ఆండాళ్ అని చెప్తారు. జనకమహారాజు భూమిని దున్నే సమయంలో సీతామాత దొరికింది. అలాగే శ్రీరంగనాథునికి పుష్ప కైంకర్యం కోసం విష్ణుచిత్తులవారు తులసితోట సాగుచేస్తుండగా ఆండాళ్ దొరికింది.

భగవంతుని తప్ప ఇతరులని సేవించడానికి వినియోగం కాని తులసివనంలో ఆండాళ్ దొరకడాన్ని గమనిస్తే సీతాదేవి, ఆండాళ్, భూదేవి అంశయే అన్న సంగతి అర్థమౌతుంది. ఆండాళ్ అసలు పేరు కోదై. కోదై అంటే మాలిక. ఆ పేరే క్రమంగా గోదాగా మారింది. ఆ గోదాదేవి రచించిన 30 పాశురాలలో ఏయే అంశాలు ఉన్నాయో తెలుసుకోవాలనే ఆసక్తి అందరికీ ఉంటుంది. 30 పాశురాలలోని అంశాలు స్థూలంగా మంచిని ప్రబోధిస్తాయి. మంచి అలవాట్లతో జీవించమని తోటివారికి సాయపడమని, భగవంతుని తప్పనిసరిగా ఆరాధించమని ఈ ప్రబోధాలు సూచిస్తాయి.


ప్రతి పాశురంలోనూ ఇలాంటి సదాచరణే ఉంటుంది.

**ఆళ్వార్ ఎంబెరుమానార్ జీయర్ ఆచార్య తిరువడిగళే శరణమ్**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

## 332. అక్రూర స్తుతి సంప్రీతాయ నమః

– మహాభాగవతుడైన అక్రూరుని స్తోత్రమునకు ఆనందించినవాడు కృష్ణుడు.

అక్రూరుడు వృష్ణి వంశస్థుడైన శపల్కునకు కాశీరాజు యొక్క పుత్రిక నందినికి జన్మించాడు. సాత్యకి, అక్రూరుడు పినతండ్రి పెదతండ్రి బిడ్డలు. అతడు కంసుని నగరము మధురలో నివసించినాడు. కంసుని ఆదేశమున అక్రూరుడు అస్త్ర పూజకు రావలసినదిగా కృష్ణుని కోరుటకు వెళ్ళి కంసుని అంతరంగమైన కృష్ణ వధను అతనికి నివేదించిన కృష్ణ భక్తుడు.

అక్రూరుడు బలరామకృష్ణులను రథముపై మధురా నగరమునకు తీసుకొని వెళ్ళుచు మార్గమధ్యమున ముందు బలరామకృష్ణులు రథము దిగి యమునానది నీటిని త్రాగి రథము నెక్కి కూర్చున్నారు. అంతట సారథి యగు అక్రూరుడు యమున నదిలో దిగి సంధ్యావందనము చేసి, యమునా నదిలో రామకృష్ణులను చూచి ఆశ్చర్యపడినాడు. వెంటనే తీరమున చేరి రథముపై నున్న బలరామకృష్ణులను చూచినాడు. చూచి ఆశ్చర్యపడి

**శా|| కంటిన్ మున్ను రథంబుపై జలములో గంటిన్ దుదిన్ గ్రమ్మరన్**
**గంటిన్ దొంటి రథంబు మీద నిదె ఈ కళ్యాణచారిత్రు లే**
**వెంటన్ దోచిరి రెండు దిక్కుల మనోవిభ్రాంతి యో నీటిలో**
**నుంటాశ్చర్యము చూతు నంచు మరియు న్నూహించి మగ్నాంగుడై - భాగ. 10, పూర్వ – 1227**

బలరామ కృష్ణులను యమునా నదీ జలములలోను, రథము పైనను చూచి వీరు రెండు దిక్కులలో కనిపించారు. ఇది నా మనో విభ్రాంతియా లేక యథార్థమా అను ఊమలందు నిమగ్నుడైనాడు. పిమ్మట మరల యమునా నదీ జలములలో బలరామకృష్ణులను చూచి భక్తితో గద్గద కంఠముతో నమస్కరించి కృష్ణుని స్తుతించినాడు. అక్రూరుని స్తోత్రమునకు కృష్ణుడు సంతుష్టుడైనాడు.

అక్రూర స్తుతిచే సంప్రీతుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 333. కుబ్జా యౌవన దాయకాయ నమః

కుబ్జ కంసునికి చందనాది అనులేపన ద్రవ్యములు తయారు చేసి ఇచ్చెడు దాసి. ఈమె శరీరము మూడు వక్రములు కలిగి యుండుటచే ఈమెకు త్రివక్ర అను పేరు కలిగింది. బలరామకృష్ణులు మధురానగరమున రాజవీధిలో వెళ్ళుచున్నప్పుడు దారిలో కుబ్జ నానావిధ కలపములు, (పరిమళ ద్రవ్యములను చేర్చి కలిపిన చందనము కలపము) అనులేపన ద్రవ్యములు గల పాత్రలను పట్టుకొని రాచనగరుకు పోవుచుండెను. కృష్ణుడు కుబ్జపై అనుగ్రహము కలిగి నవ్వుచు కుబ్జతో సుందరీ నీవు ఎవరు? ఈ చందనాది లేపనములను ఎవరి కొరకు తీసుకొని వెళ్ళుచున్నావు? మేలైన ఈ అంగరాగములను మా ఇరువురికి ఇమ్ము. ఇచ్చిన యెడల నీకు త్వరలో మిక్కిలి శ్రేయస్సు కలుగునని చెప్పినాడు. కృష్ణుని మాటలను విని కుబ్జ సుందరా! నేను కంసుని దాసిని. నన్ను త్రివక్ర అందురు. నేను సిద్ధపరచిన చందనాది అంగరాగ ద్రవములపై కంస రాజుకు చాలా ఇష్టము. ఆ రాజు నన్ను ఎంతగానో ఆదరించును. ఈ అంగలేపనములను అలదుకొనుటకు యువకులైన మీరే అర్హులు అని చెప్పింది.

కృష్ణుని రూప వైభవమునకు, రసికత్వమునకు, సుందర మందహాసమునకు, మధురాలాపములకు, ఆకర్షణీయమైన చూపులకు కుబ్జ ముగ్ధురాలైంది. వెంటనే ఆమె మనస్సు కృష్ణుని పరమైంది. ఆమె స్వచ్ఛమైన అనులేపనములను వారిరువురికీ సమర్పించింది. అంత బలరామకృష్ణులు ఆ మైపూతలను నాభికి పైభాగమున వక్షస్థలాది అంగములకు పూసుకొనిరి. అంత వారు సౌందర్య శ్రీ తో తేజరిల్లినారు. అడిగినంతనే అనులేపనములను సమర్పించిన కుబ్జపై కృష్ణుడు ప్రసన్నుడైనాడు. కుబ్జ తనను దర్శించినందులకు ప్రత్యక్ష ఫలమును ప్రసాదించుటకై వంకరలు తిరిగి యున్న ఆమె శరీరమును చక్కజేయ నిశ్చయించుకొన్నాడు.

పిమ్మడ కృష్ణుడు కుబ్జ యొక్క రెండు పాదములను తన పాదములతో అదిమిపట్టి, ఆమె గడ్డమునకు తన రెండు వేళ్ళను చేర్చి మీదికెత్తినాడు. కృష్ణుని కరస్పర్శతో పైకెత్తబడగనే ఆమె శరీరంలోని వంకరలు తొలగిపోయి అవయవములు పూర్తిగా చక్కబడి ఆమె ఒక యువతీ లలామగా రూపొందింది. అంతట ఆమె కటి సౌందర్యము, వక్షస్థల పైభాగము అత్యంత ఆనందదాయకమయ్యెను. ఒక్క క్షణములో కుబ్జ యొక్క రూపలావణ్యములు మిక్కిలి మనోహరములయినవి. అంతట కుబ్జ కృష్ణునిపై మరులు గొని, కృష్ణుని యొక్క ఉత్తరీయాంచలమును (ఉత్తరీయపు కొంగు) పట్టుకొని లాగుచు చిరునవ్వు నవ్వుచు మహావీరా! మా ఇంటికి వెళ్ళెదము రమ్ము. పురుషోత్తమా! నన్ను అనుగ్రహింపుము అని కోరింది. కృష్ణుడు నేను వచ్చిన పని పూర్తియైన పిమ్మట నీ ఇంటికి తప్పక వచ్చెదను అని మృదు మధుర వచనములతో సమాధాన పరచి కుబ్జను వీడ్కొనెను.

కుబ్జకు సుందర శరీరమును, యౌవనమును ఇచ్చిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చావతారమగు వేంకటేశునకు నమస్కారము.

## 334. ముష్టకోరః ప్రహారిణే నమః

మధురలో కంసుని యొక్క క్రీడాంగణములో అతని యెదుట జరుగుచున్న మల్లయుద్ధములో ముష్టికుడను కంసుని భటి బలరాముడు గుండెపై కొట్టి చంపినాడు. బలరాముడు కూడ విష్ణుదేవుని అవతారమే కనుక విష్ణుదేవుని అర్చామూర్తి యమగు వేంకటేశునకు అన్వయించబడిందీ నామము.

ముష్టికుడు రాక్షసుడు. మల్లుడు. కంసుని సేవకుడు. చాణూరునికి స్నేహితుడు. కంసుని ఎదుట జరిగిన మల్ల యుద్ధములో ముష్టికుడు తన పిడికిలి పోటులతో బలరాముని నొప్పింపసాగెను. కాని పరాక్రమశాలి అయిన బలరాముడు వాటిని లెక్కచేయక తన అరచేతితో ముష్టికుని గుండెపై తీవ్రముగా కొట్టినాడు. ఆ దెబ్బకు ముష్టికుడు కంపించిపోగా వాని నోటినుండి రక్తము కారుచుండెను. క్షణములో ముష్టికుడు ప్రాణములు కోల్పోయి పెనుగాలి తాకిడికి నేలకూలిన వృక్షము వలె నేల కూలినాడు.

ముష్టికోరః ప్రహారి అయిన బలరామునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

# రాముడు లోకాభిరాముడు

– మందరపు వి.జి.శంకరాచారి



**రాముడు... లోకాభిరాముడు...**

ధర్మాన్ని ఆచరించి చూపిన మహానుభావుడు... ప్రజా సంక్షేమమే రాజుల కర్తవ్యమని చెబుతూ రాజ్యపాలన గావించిన మహోన్నత చక్రవర్తి.

తల్లి తండ్రుల యెడల ఎటువంటి కృతజ్ఞతా భావాన్ని కలిగియుండాలో ఆచరణలో చూపిన మానవతామూర్తి. తను జన్మించినది కౌసల్య కడుపులోనైనా... పిన తల్లులైన సుమిత్ర, కైకేయిలను కూడా మాతృమూర్తులుగానే భావించి గౌరవించినవాడు. రక్తబంధానికి నిర్వచనాన్ని ఇచ్చినవాడు. తోడబుట్టిన తమ్ముళ్ళను తన నీడగా భావించినవాడు.

గురువు విశ్వామిత్రుని ఆజ్ఞను మీరనివాడు. అతడి అనుజ్ఞ మేరకు సీతా స్వయంవరంలో పాల్గొని శివధనుస్సుని విరిచి సీతాదేవి మనస్సు దోచినవాడు. తండ్రి వాగ్దానానికి కట్టుబడి అడవులకు సంతోషంగా బయలుదేరిన స్థితప్రజ్ఞుడు. నారచీరలు ధరించి తనతో కట్టుకున్న ఆలిని తీసుకు వెళ్ళడానికి సంకోచించినా, భార్య కోరిక మేర కడదాకీ వెన్నంటి ఉండేది భార్యేనని అంగీకరించి తనతో పాటుగా కానలకు రక్షకుడిగా వస్తానని కోరినప్పుడు మొదట వద్దన్నా, పిదప అంగీకరించి తనతో పాటుగా పూజకు అర్హతను కల్గించినవాడు. భరతుడి కోరిక మేరకు తన పాదుకలను అనుగ్రహించి రాజ్యపాలన చేయుటకు అంగీకరించినవాడు.

వనవాస సమయంలో గుహుడి అనుంగు మిత్రుడుగా భావించి అతడిని సంతోషపెట్టినవాడు. జీవితకాలం తన రాకకై నిరీక్షించిన శబరి వద్దకు వెళ్ళి ఆమె ఇచ్చిన ఎంగిలి పళ్ళను ఆరగించినవాడు. పిమ్మట ఆమెను పవిత్ర నదిగా మార్చినవాడు.

వనవాస సమయంలో ఎదురుపడిన హనుమంతుడిని పేరుపెట్టి పిలిచి తనెవరో స్పష్టంగా తెలియపరచినవాడు. కిష్కింధ రాజు సుగ్రీవుణ్ణి ప్రాణమిత్రుడిగా స్వీకరించినవాడు. మిత్రుడి కొరకు అధర్మపరుడైన వాలిని చంపి అతడి కుమారుడైన అంగదుణ్ణి చేరదీసినవాడు.

సీతాన్వేషణలో పాల్గొన్న వానరవీరులలో హనుమంతుడు ఒక్కడికే సీతజాడ తెలుసుకునే వ్యక్తియని, అతడిని గుర్తుగా తన అంగుళీయకమును ఇచ్చి సీతాదేవికి ఇమ్మని చెప్పిన త్రికాలజ్ఞుడు.

రామ రావణ సంగ్రామంలో ముందుగా యుద్ధానికి వచ్చి రణభేరి మోగించిన ఇంద్రజిత్ చేతిలో పరాజితుడై నేలకొరిగిన లక్ష్మణస్వామిని చూసి సామాన్య మానవుడివలె రోదించినవాడు. తర్వాత లక్ష్మణుడి చేతిలో ఇంద్రజిత్ అసువులు బాసిన తర్వాత తమ్ముడి వీరత్వాన్ని కీర్తించినవాడు.

ఒకరాత్రి – ఒక పగలు జరిగిన రామ రావణ సంగ్రామంలో రావణాసురుడి మరణం యొక్క గుట్టుని విభీషణుడు చెప్పినా అది వీరత్వమనిపించుకోదని తన అమ్ముల పొదిలో శరమును రావణాసురుడి తల నేలకొరిగేటట్లుగా సూటిగా వేసినవాడు. అయితే ఆంజనేయుడి ప్రార్థన వలన వాయుదేవుడు రామబాణం యొక్క దిశను మార్చి రావణుడి ఉదరంలో గల అమృత భాండాన్ని ఛేదించి రావణ బ్రహ్మను నేలకొరిగేటట్లుగా చేసింది. అంతేకాని రాముడు రణరంగంలో నీతి తప్పి శత్రువుని సంహరించిన జాడ కనబడదు.

అశోకవనంలో ఉన్న సీతమ్మను మహా పతివ్రతగా లోకానికి తెలియజేయపరచాలని అగ్నిపునీతను చేసి ఆమెను తన వెంట అయోధ్యకు తీసుకొని వెళ్ళినవాడు.

ప్రజాసంక్షేమమే పరమావధిగా భావించి పాలన సాగిస్తున్న శ్రీరాముడు ఒక రజకుడి మాటలు సత్యమేనని తలచి ఆదర్శ రాజ్యపాలనలో ప్రజలనుండి ఎటువంటి వ్యతిరేక భావనలను రాజు ఎదుర్కోకూడదని, అదే ధర్మమని భావించి నిండు చూలాలైనా సరే పరమ పతివ్రత యైన సీతను కానలలో విడిచినవాడు.

సీత దూరమైన పిమ్మట ఆమె ఎడబాటును భరించలేక ఒక

సామాన్య మానవుడిలా దుఃఖిస్తూ అనుక్షణం ఆమె తలంపులతో జీవితం సాగించిన ప్రేమ స్వరూపుడు.

సీతాదేవి బంగారు ప్రతిమను తన చెంత ఉంచుకొని అశ్వమేధ యాగం చేసిన ఏకపత్నీవ్రతుడు.

దారి తప్పిన అశ్వాన్ని బంధించిన లవకుశులు తన కుమారులేనన్న విషయం సీతా ప్రమేయంతో గ్రహించి వారిని అక్కున చేర్చుకుని పుత్రుల పరిష్వంగంలో అనంతమైన ఆనందాన్ని అనుభవించినవాడు.

తదనంతరం సీతాదేవి తన వెంట రాకుండా జనని భూమాతతో కలిసిననాడు... విపరీతమైన శోకంతో "సీతా... సీతా అంటూ రోదించి ఆమె లేని జీవితం వృధా అని తలపోసి అయోధ్యకు చేరుకుని లవకుశులను పట్టాభిషేకమొనరించి పిమ్మట సరయూనదిలోకి వెళ్ళి అంతర్ధానమైనవాడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడైన శ్రీరామచంద్రమూర్తి.

అటువంటి శ్రీరాముడు ఇలపై నడచి... భక్తులను చెంత చేర్చుకున్న కరుణామూర్తి... శత్రువులకు కూడా అభయము నొసగే వాత్సల్యమూర్తి... సోదర ప్రేమను గురించి తెలియపరచిన ప్రేమమూర్తి... అతిథులను గౌరవించే మర్యాదా పురుషోత్తముడు. స్నేహబంధం గురించి తెలియపరచిన స్నేహశీలి.

ఆదర్శవంతమైన రాజు యొక్క పరిపాలన ఏవిధంగా ఉండాలో తెలియపరచిన సుపరిపాలకుడు. ధర్మాన్ని ఆచరించి చూపినవాడు.

నారాయణుడే శ్రీరాముడిగా అవతరించి ఈ పుడమిని పవిత్రం చేసి దుష్టశిక్షణ చేసిన ఆ శ్రీరాముడి నామం భక్తులందరి నోట పలికితే శుభదాయకం. క్షేమదాయకం. ఫలదాయకం.

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే**

అందుకే అందరికీ శ్రీరామ రక్ష... సర్వజగద్రక్ష.

# తల్లి దాస్యం తొలగించిన గరుత్మంతుడు – కౌతా నిర్మల

కశ్యపమహర్షి భార్యలు కద్రువ, వినత. వారిద్దరూ ఒకసారి ఒక అశ్వము విషయంలో గొడవపడి, పందెము కాయగా వినత ఆ పందెములో తన సవతి అయిన కద్రువతో ఓడిపోయింది. షరతు ప్రకారంగా వినత కద్రువకు దాస్యం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. కద్రువ సంతానం సర్పములు. వినత తనయుడు గరుత్మంతుడు. తల్లి దాస్యానికి గరుత్మంతుడు ఎంతో బాధపడ్డాడు. తన తల్లి దాస్యాన్ని తొలగించటానికి సర్పమాత అయిన కద్రువ కోరిక ప్రకారంగా సర్పాలకు అమృతం తెచ్చివ్వటానికి సిద్ధపడ్డాడు. స్వర్గలోకానికి వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు. తల్లికి నమస్కరించి ఆమె ఆశీస్సులు అందుకున్నాడు. తాను ప్రయాణం చేసే సమయంలో తనకు మార్గమధ్యంలో ఆకలి వేస్తే ఏమి తినమంటావని తల్లిని ప్రశ్నించాడు గరుత్మంతుడు.



అందుకు వినత "బ్రాహ్మణుని తప్ప ఇతరమైన వాటిని వేటినైనా తినవచ్చు. వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, ధర్మాలు అభ్యసించిన విప్రునికి అపకారం తలపెడితే వారికి భయంకరమైన నరకం కలుగుతుంది. మనిషిని గాయపరచి, బలహీనుడిని చేసే ఆయుధం ప్రాణాలను హరించే విషం, ప్రాణాపాయాన్ని, అమిత బాధను కలిగించే, దహించే అగ్ని శరీరాన్ని వికారంగా ఏవిధంగా మారుస్తుందో, సద్బ్రాహ్మణునికి, పండితునికి అపకారం కలిగించిన వారికి నాశనం తప్పదు. బ్రాహ్మణునికి మేలు చేసి, ఆదరించి, సన్మానించిన వారికి శుభం కలిగి మనోవాంఛితాలు నెరవేరుతాయి.

ఆయుధం ఉపయోగించినప్పుడు, మృతి చెందకపోయినా శరీరానికి గాయం అవడమో, శరీరంలోని ఏదైనా అంగం ఖండించబడి, శరీరం నుంచి తొలగిపోవడమో జరగవచ్చు. విషాన్ని ప్రయోగిస్తే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. అగ్ని విజృంభిస్తే జన, ధన వస్తువులన్నీ దహించుకుపోతాయి. అందువల్ల ధర్మమార్గంలో నడిచే విప్రునికి ఎటువంటి హాని తలపెట్టినా అది వారికి దుష్పరిణామాలను కలిగిస్తుంది" అన్న తల్లి మాటలు విన్న గరుత్మంతుడు తన లక్ష్య సాధనకై బయలుదేరి స్వర్గలోకమునకు చేరుకుని ఇంద్రునితో యుద్ధము చేసి అమృతమును తెచ్చి కద్రువకు అందజేసి తన తల్లి దాస్యమునకు విముక్తి కల్గించాడు. గరుత్మంతుడు సమర్థవంతుడయిన, బాధ్యత కలిగిన కుమారుడు. 'మాతృదేవోభవ' అన్న పదానికి సార్థక చేకూర్చిన ధన్యజీవి గరుత్మంతుడు.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

అది పానశాల. లోపలికి వెళ్ళాడు మారుతి. ఎన్నో తినుబండారాలున్నాయి. జింకల మాంసం ఉంది. దున్నపోతు మాంసం ఉంది. అడవి పందుల మాంసం ఉంది. అన్నీ విడి విడిగా ఉన్నాయి. ఒకచోట వెడల్పాటి పాత్రలున్నాయి. సగం సగం తిన్నారు. వదిలేశారు. నెమలి మాంసం, కోడిమాంసం వదిలేసి ఉన్నాయి. ఒక పాత్రలో పెరుగు, ఒక పాత్రలో పప్పు, ఒక పాత్రలో గొర్రె మాంసం సగం తిని వదిలేశారు. అలాగే అడవిపంది, కొక్కెరల మాంసాలు మిగిలి ఉన్నాయి. చకోర పక్షుల మాంసం, చేపల మాంసం సగం ఉన్నాయి. ఇంగువ, మిరియాలు వేసి వండిన మాంసాలున్నాయి.

రకరకాల లేహ్యాలు (నాక తగినవి) పానీయాలు, పేయాలు (తాగతగినవి) వివిధ రకాలున్నాయి. పులుపు, తీపి, ఉప్పు కలిసిన పదార్థాలున్నాయి. చక్కెర, తేనె, ద్రాక్ష, దానిమ్మ రసాలు కనిపించాయి. రకరకాల వెండి పాత్రలున్నాయి. స్ఫటిక పాత్రలున్నాయి. బంగారు పాత్రలున్నాయి. బంగారు చెంబులున్నాయి. ఆ పాత్రల్లో మద్యాలున్నాయి. కొన్ని పాత్రల్లో సగం తాగినట్లున్నారు. సగం వదిలేశారు. తినగా మిగిలి వుంది అన్నం. పానశాలలో ప్రతి అంగుళం పరికించి చూశాడు. సీతమ్మ కనిపించలేదు.

అన్నం మనిషికి ప్రాణాధారం. అది తింటున్నామంటే – ఎన్నో కులాల వారి కష్టఫలంగా – మన కంచంలో చేరింది. కులాల పట్టింపులకి పోతే ఒక్క మెతుకు కూడా ముట్టలేం. అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావించాలి.

## ఆలోచనా తరంగాలు

మళ్ళీ వెదకసాగాడు హనుమ. ఉత్సాహం పుంజుకున్నాడు. లతా గృహాలు, చిత్రశాలలు, నిశాగృహాలు వెదికాడు. జనకాత్మజ జాడ లేదు. ఇంతకూ ఆమె జీవించి ఉందా? రాముని కోసం ఉండాలి. శీల సంరక్షణ తత్పరురాలు. ధర్మమార్గంలో ప్రవర్తించే సాధ్వి. రావణుని మాట విని ఉండదు. దాంతో ఆ దుర్మార్గుడు ఆమెని చంపేశాడేమో! వాడు మహా దుష్కర్ముడు. ఏ పాడు పనైనా చేస్తాడు. పరమ పాపాత్ములకి పాపాలు అంటవేమో!

ఇక రాక్షస స్త్రీలు వికార రూపులు. వికృత వేషధారులు. వాళ్ళ కళ్ళు భయంకరంగా ఉంటాయి. ముఖాలు భయంకరంగా ఉంటాయి. అలాంటి వాళ్ళని చూసి ఉంటుంది సీతమ్మ. బిత్తరపోయి ఉంటుంది. గడగడ వణికి పోయి ఉంటుంది. ప్రాణాలు విడిచి ఉండొచ్చు. రాముడు వస్తాడని బాణాలు వేస్తాడని భయం రావణునికి. మహావేగంలో వెడుతున్నప్పుడు సీతమ్మ జారిపడిపోయిందా? సముద్రం చూసి ఉంటుంది.

భయపడి ఉండొచ్చు. గుండె ఆగిపోయి ఉంటుందా? రావణునితో పెనుగులాడి వుంటుంది. సముద్రంలో జారిపడివుండొచ్చు. లేదా లంక చేరాక – ఆమె ప్రవర్తన భరించలేక – చంపి తిని వుంటాడా రావణుడు? లేదా కాపలా కాసే రాక్షస కాంతలు భక్షించి ఉంటారా? రామనామ జపం చేస్తూ ప్రాణాలు విడిచిందా? లేదా ఏ నేల మాళిగలోనో ఆమె దాచబడిందా?

అంతఃపుర స్త్రీలని చూశాను. నిద్రలో ఉన్నారు. అలా చూడరాదు. అది ధర్మలోపం. అయితే నేను కావాలని చూడలేదు.

**మనోహి హేతుస్సర్వేషామ్ ఇంద్రియాణాం ప్రవర్తనే ।**
**శుభాశుభా స్వవస్థాను తచ్చమే సువ్యవస్థితమ్ ॥**

ప్రతి కార్యానికి మనస్సు ప్రధానం. ఇంద్రియాల ప్రవర్తనకు అదే కారణం. నా మనస్సు నిలకడగా ఉంది. పరిశుద్ధంగా ఉంది. వికారం చెందలేదు. సీతమ్మ కనిపిస్తుందని చూశాను. జానకిని స్త్రీలలో వెదకాలి. ఏ జాతి జంతువుని ఆ జాతిలోనే వెదకాలి. అదే ధర్మం. స్త్రీని స్త్రీలలో వెదకాలి. మృగాల్లో వెదకలేం కదా! అంతఃపురంలో దేవతా స్త్రీలు కనిపించారు. గంధర్వ కన్యలు కనిపించారు. నాగకన్యలు కనిపించారు. సీతమ్మ మాత్రం కనిపించలేదు.

మళ్ళీ వెదకాలనుకున్నాడు. అది మారుతి నిశ్చయం. ఉత్సాహం పుంజుకున్నాడు. లతా గృహాలున్నాయి. చిత్రశాలలున్నాయి. నిశాగృహాలున్నాయి. అన్నింట్లోకి వెళ్ళాడు. చూశాడు. రామప్రియ జనకాత్మజ కానరాలేదు. అసలు సీతాదేవి బతికి వుందా? మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. బతికి ఉండదు. ధర్మమార్గంలో ప్రవర్తిస్తుందామె. శీల సంరక్షణ తత్పరురాలు. రావణునికి వశపడి ఉండదు. చంపేసి ఉంటాడు. లేదా రాక్షస స్త్రీలు భయంకర రూపులు. భయంకర నేత్రులు. వాళ్ళని చూసి వుంటుంది. భయపడి ఉండొచ్చు. చనిపోయి ఉండొచ్చు. రావణుడు దుష్కకర్ముడు. ఏ పాడు పనైనా చేస్తాడు. రాక్షసాంగనల్ని పిలిచి సీతమ్మని తినండని చెప్పి వుంటాడు. లేదా వాళ్ళే భక్షించి ఉంటారు.

సుగ్రీవుడు చండశాసనుడు. వానరులందరూ గడువులో వెళ్ళారు. మేం పోలేదు. నాకు సీతమ్మ కనిపించలేదు. నా పని కాలేదు. సముద్ర లంఘనం వ్యర్థమేనా? ఒకవేళ కిష్కింధకి పోతే – సీతమ్మ చనిపోయిందని రామునికి చెప్పరాదు. చెప్పకపోతే దోషం. చెబితే దోషం. ఏం సాధించావ్ అని అడిగితే – ఏం చెప్పాలి? సీతమ్మ కనిపించలేదంటే – వార్త వింటాడు రాముడు. ప్రాణం విడిచేస్తాడు. అది చూస్తాడు సౌమిత్రి. ప్రాణత్యాగం చేస్తాడు. రామలక్ష్మణులు పోయారని వార్త వింటూనే భరతుడు శత్రుఘ్నుడు చనిపోతారు. నలుగురు కొడుకులు పోయాక ముగ్గురు తల్లులూ చనిపోతారు. అనుమానం లేదు. సుగ్రీవుడు కృతజ్ఞుడు. సత్యసంధుడు. రాముడు చనిపోవటం చూస్తాడు. అతడూ ప్రాణం విడిచేస్తాడు. అతని భార్య రుమ కూడా చనిపోతుంది. అసలే కృశించింది తార. ఆమె కూడా పోతుంది. వాళ్ళని చూస్తాడు అంగదుడు. వాడూ చనిపోతాడు. వానరరాజు పోయాడు. చూస్తారు మంత్రులు. తలలు బాదుకుంటారు. వాళ్ళు మాత్రం బతుకుతారా? చస్తారు. ఇక వానరులు – కొండలెక్కి దూకుతారు. చస్తారు. లేదా విషం తాగి చస్తారు. ఉరేసుకుని పోతారు. మంటల్లో పడిపోతారు. ఒక్కడూ మిగలడు. అందరూ చస్తారు.

నేను వెనక్కి వెడితే – ఇక్ష్వాకు వంశం నాశనమవుతుంది. కిష్కింధ శూన్యమవుతుంది. కనుక నేను కిష్కింధకు పోను. ఇక్కడే వుంటాను. నేను వస్తానని – సీతమ్మ జాడ చెబుతానని – రామలక్ష్మణులు, సుగ్రీవుడు ఎదురు చూస్తుంటారు. అందుకు నేనిక్కడే ఉంటాను. వానప్రస్థుడిలా ఉంటాను. దొరికింది తింటాను. లేదా ఉపవాసం ఉంటాను. చితి పేర్చుకుంటాను. అగ్నికి ఆహుతి అవుతాను. ప్రాయోపవేశం చేస్తాను. నేను చస్తాను. నా శరీరాన్ని కుక్కలు తింటాయి. నక్కలు తింటాయి.

ఈ రాత్రి మంగళకరం అనుకున్నాను. వెన్నెల తోడైందని సంతోషించాను. కీర్తి మాలలు మెడలో పడతాయనుకున్నాను. కానీ జానకీమాత కనిపించలేదు. ఇంత రాత్రి నిరర్థకమైంది.

**వినాశే బహవో దోషా జీవన్ భద్రాణి పశ్యతి**

చనిపోతే అనేక దోషాలుంటాయి. బతికి వుంటే ఏనాటికైనా శుభాలు చూడవచ్చు. కాబట్టి నేను చావను. ఆత్మహత్య చేసుకోను. బతికి వుంటాను. దానివల్ల మంచి జరుగవచ్చు అని హనుమంతుని ఆలోచనలు. పదే పదే దుఃఖించాడు. ఈ దుఃఖానికి అంతమెప్పుడో తోచలేదు మారుతికి.

సీతాదేవి కనబడకపోతే ఈ దశగ్రీవుణ్ణి మహాబలవంతుణ్ణి చంపేస్తాను. వాడు చేసిన దానికి చెల్లుకు చెల్లు. లేదా వాణ్ణి బంధిస్తాను. ఎత్తుకుని పోతాను. పశుపతికి పరువులా (కానుకలా) – రామునికి సమర్పిస్తాను.

సంపాతి మాట విన్నాం. సీత లంకలో వుందన్నాడు. అది నమ్మి రాముణ్ణి ఇక్కడికి తీసుకొని వచ్చి వుంటే – జనకాత్మజ కనిపించకపోతే – దుఃఖపరవశుడైపోతాడు రాముడు. బాణాలు వేస్తాడు. వానరులు అందరినీ దహించి వేస్తాడు. నా వల్ల వానరులు చావరాదు. ఎవరూ చావరాదు. నేను మళ్ళీ వెదుకుతాను. లంక జల్లెడ పడతాను.

మనం కోరుకునేది రాదు. తలచింది జరగదు – నచ్చింది ఉండదు. వుండేది నచ్చదు. అలా అని నిస్పృహ చెందరాదు. మానవ ప్రయత్నం సాగించాలి. అనుకున్నది సాధించాలి. ఒడిదుడుకుల బతుకులో విజయం ఒక్కోసారి దోబూచులాడుతుంది. నిబ్బరంగా ఉంటే సఫలీకృతులం కాగలం. మానవ ప్రయత్నానికి దైవబలం తోడ్పడుతుంది. అపుడే ఫలం లభిస్తుంది.

## అశోకవనం

అలా ఆలోచిస్తున్నాడు హనుమంతుడు. అతని దృష్టి మళ్ళింది. ఒక వనం మీద నిలిచింది. ఎన్నో చెట్లున్నాయి. అది అశోకవనం. ఆ వనాన్ని నేను వెదకలేదు. ఇపుడే వెళ్తాను. అష్టవసువులకు ఏకాదశరుద్రులకు ద్వాదశాదిత్యులకు అశ్వనీదేవతలకు సప్త మరుత్తులకు నమస్కరిస్తున్నాను. ఈసారి రాక్షసులందరినీ జయిస్తాను. దుఃఖాల పాలు చేస్తాను. సీతమ్మని రామునికి సమర్పిస్తాను – అనుకున్నాడు. ఓ ముహూర్తం మళ్ళీ ఆలోచించాడు. కర్తవ్యం నిశ్చయించుకున్నాడు. అతనిలో దుఃఖం పోయింది. దిగులు పోయింది. ఇంద్రియ వ్యాకులత ఎగిరిపోయింది. లేచాడు.

**నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యైచ తస్మై జనకాత్మజాయై।**
**నమోస్తు రుద్రేంద్ర యమానిల్ భ్యో నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః॥**

రామలక్ష్మణులకు నమస్కారం. జనకాత్మజకు నమస్కారం. రుద్రునికి ఇంద్రునికి యమునికి అగ్నిదేవునికి నమస్కారం. సూర్యచంద్రులకు మరుద్గణాలకు నమస్కారం. అలా అందరికీ నమస్కారం చేశాడు. సుగ్రీవునికి విడిగా నమస్కరించాడు.

ఇది ప్రార్థనా శ్లోకం. నిత్యం అనుసంధానం చేయాల్సిన శ్లోకం. రామాయణం పారాయణం చేసేవారు ఉన్నారు. వాళ్ళు ఈ శ్లోకాన్ని ప్రార్థనగా భావిస్తారు. సముద్ర లంఘన సమయంలో సూర్యునికి ఇంద్రునికి బ్రహ్మకు వాయుదేవునికి నమస్కరించాడు హనుమంతుడు. ఇపుడు రామలక్ష్మణులకు సీతకు ముందుగా నమస్కారం చేశాడు. తరువాత తక్కిన దేవతలకు నమస్కరించాడు.

భగవదనుగ్రహం పొందాలంటే – భక్తుల భాగవతుల అనుగ్రహం పొందాలి. అమ్మవారి అనుగ్రహం పొందాలి. ఆ తర్వాతనే భగవద్దర్శన ప్రాప్తి. అపుడు రామబాణంలా పోతానన్నాడు. ఇపుడూ అలాగే అంటున్నాడు. నాదేం లేదు. నేను ఒక పరికరం. ఒక పనిముట్టు. ఆ దేవుడే కరుణిస్తాడు. అనుగ్రహిస్తాడు. సీతాదర్శనం లభింపచేస్తాడు – అది హనుమంతుని విశ్వాసం. అది అతని పరతంత్రత.

ఇక్కడ ఓ విశేషం ఉంది. శ్లోకంలో సీత అని లేదు. మైథిలి అని లేదు. జనకాత్మజ జనకుని కూతురు అని కదా అర్థం. భూమిని దున్నుతున్నాడు జనకమహారాజు. నాగటి చాలులో దొరికింది సీతమ్మ. అంటే జనకచక్రవర్తి వెదకలేదు. అమ్మవారు తనకు తానై దర్శనమిచ్చింది. లభించింది. అలా నేను వెదకటం కాదు. అమ్మా నీవే దర్శనం ఇవ్వాలి నాకు అనుకున్నాడు హనుమంతుడు. అదే పరతంత్రత. అదీ జనకాత్మజ – పదప్రయోగంలోని అంతరార్థం.

చుట్టుప్రక్కల చూశాడు. మళ్ళీ ఆలోచించాడు ఇలా. ఈ వనంలో రాక్షసమూక ఉంటుంది. వనరక్షకులుంటారు. వాయుదేవుడు కూడా నెమ్మదిగా ఉన్నాడు. నేను రాక్షసులకి కనపడరాదు. రామకార్యం సిద్ధించాలి. ఇంకా సూక్ష్మరూపం ధరిస్తాను. దేవతలు మహర్షులు నా కార్యసిద్ధికి సహకరించాలి.

క్షుద్రుడు పాపాత్ముడు క్రూరకర్ముడు భయంకరుడు రావణుడు. దుర్బల దీన సీతమ్మ. ఆ మహాతల్లి నాకు దర్శనమివ్వాలి – అని ధ్యానించాడు. రావణ భవనం నుంచి దూకాడు. వింటినుంచి వదిలిన బాణంలా పోయాడు. అశోకవన వాటిక ప్రవేశించాడు. అది వసంత ఋతువు. చెట్లన్నీ పూచి ఉన్నాయి. సాల వృక్షాలు, అశోక వృక్షాలు నానావిధ వృక్షాలున్నాయి. మృగాలున్నాయి. పక్షులున్నాయి. ఉపవనాలున్నాయి. అక్కడ ఋతుభేదం లేదు. అన్ని కాలాల్లో అన్ని చెట్లు పూలు పూస్తాయి. పండ్లనిస్తాయి. అన్ని జంతువులు ఉత్సాహంగా ఉన్నాయి. పక్షులు కూస్తున్నాయి. కోకిలలు పాడుతున్నాయి. తుమ్మెదలు ఝుంకారం చేస్తున్నాయి. నెమళ్ళు కేకలు వేస్తున్నాయి.

సీతాదేవి అన్వేషణలో పడ్డాడు హనుమంతుడు. చెట్టు నుంచి చెట్టుకు దూకుతున్నాడు. నిద్రిస్తున్న పక్షులు లేచాయి. ఎగిరాయి. వాటి రెక్కలు తగిలాయి. రంగు రంగుల పూలు రాలిపోయాయి. అవి హనుమంతుని మీద పడ్డాయి. అతడొక పూలకొండలా కనిపించాడు. చెట్లని ఊపాడు. ఆకులన్నీ రాలిపోయాయి. చెట్లబోదెలు మిగిలాయి. పందెం వేసి ఓడిన జూదగాండ్లు – తమ బట్టలు సొమ్ములు కిందపడేసి నిలుచున్నట్లుగా కనిపించాయి చెట్లు.

మణులు పొదిగిన నేలలు – వెండి బంగారం తాపడం చేసిన నేలలు – అక్కడక్కడా బావులు – వాటి మెట్లకు మణులు పొదగబడ్డాయి. సమీపంలో సెలయేళ్ళు. చక్రవాకాల కూజితాలు, నీరు కోళ్ళ సవ్వడులు వినిపిస్తున్నాయి. ఒక క్రీడా పర్వతం చూశాడు. అది మనోహరంగా ఉంది. దానిపై విచిత్ర శిఖరాలున్నాయి. పర్వతం మీద ఇళ్ళున్నాయి. అవి రాతి కట్టడాలు. చుట్టూ ఉద్యానవనాలు.

కొండ మీదనుంచి పరిగెడుతున్నాయి సెలయేళ్ళు. ప్రియుడిపై కోపించిన ప్రియురాండ్రలా ఉన్నాయి. నీటివేగానికి వాలిపోయిన చెట్ల కొమ్మలు – చేతులెత్తి ప్రియురాండ్రని పోవద్దని అంటున్నట్లున్నాయి. ఆ సెలయేళ్ళు కొండవైపు మలుపు తిరిగాయి. ప్రియులపై ప్రసన్నులైనట్లు – ప్రియురాండ్రు వాళ్ళని చేరినట్లున్నాయి సెలయేళ్ళు.

ఓ శింశుపా వృక్షం (ఇరుగుడు చెట్టు) చూశాడు మారుతి. దాని చుట్టూ అరుగులున్నాయి. బంగారు తాపడం చేసి ఉన్నాయి. ఆ చెట్టు పైకి ఎక్కాడు. నేను ఇక్కడ ఉంటాను. సీతమ్మని కనిపెడతాను. జానకీమాత ఇక్కడికి రావచ్చు. ఆమె వనసంచార కుశల. తప్పక ఇక్కడికి వస్తుంది. ఇక్కడి ప్రకృతి రమణీయంగా ఉంది. ఆమె మనసుకి ఊరట కల్గించవచ్చు. మైథిలికి మృగాలంటే మోజు. జీవించి ఉంటే ఇక్కడికి వస్తుంది – అనుకున్నాడు హనుమ. ఆ శింశుపా వృక్షం మీద దాగాడు. సీతాదేవి కోసం నిరీక్షిస్తున్నాడు.


## సీతా దర్శనం

ఇరు గుడు చెట్టు మీదున్నాడు హనుమ. అశోక వనాన్ని కలయజూస్తున్నాడు. వందలకొద్దీ ఉన్నాయి అశోక వృక్షాలు. బా గా విరగకాశాయి. అవి ఎంతటి దుఃఖమైనా పోగొట్టేట్టు ఉన్నాయి. పూల బరువుకి కొమ్మలు వంగాయి. నేలని ముద్దాడుతున్నట్లున్నాయి. కొండగోగు చెట్లు పొన్నచెట్లు సంపంగి చెట్లు ఏడాకుల అరటిచెట్లు ఇంకా రకరకాల చెట్లున్నాయి. అన్నీ విరగపూశాయి. కొన్ని బంగారు రంగులో ఉన్నాయి. కొన్ని అగ్నిశిఖల్లా ఉన్నాయి. కొన్ని నల్లని కాటుకలా కనిపిస్తున్నాయి.

ఆ వనంలో హర్మ్యాలు ప్రాసాద గృహాలు ఎన్నో ఉన్నాయి. మారుతి ఉన్నది శింశుపా వృక్షం మీద. దానికి దగ్గరలో చైత్య ప్రాసాదం కనపడింది. ఆ భవనంలో వెయ్యి స్తంభాలు ఉన్నాయి. ఆ భవనం ఆకాశాన్ని తాకుతున్నట్లు ఉంది. ఆ ప్రాసాద ప్రాంతంలో ఓ స్త్రీ కనిపించింది. ఆమె చుట్టూ రాక్షస స్త్రీలు ఉన్నారు. మాసిన చీరతో ఉంది. ఉపవాసాలతో కృశించినట్లుంది. మాటి మాటికీ నిట్టూరుస్తోంది. ఆమెని గుర్తించటానికి చాలాసేపు పట్టింది. శుక్లపక్ష పాడ్యమినాటి చంద్రరేఖలా ఉందామె. దీనంగా ఉంది. ఒకే ఒక పచ్చని చీర కట్టింది. అది బాగా మాసిపోయింది. ఒళ్ళంతా ఆ చీరే చుట్టుకుంది. పొగ ఆవరించిన అగ్ని జ్వాలలా ఉందామె. తామరల్లేని తామరతీగలా ఉంది. అలంకార రహితంగా ఉంది. దుఃఖిస్తోంది. వాడిపోయి ఉంది ముఖం. కుజునితో పీడింపబడ్డ రోహిణిలా ఉంది. ధ్యానపరురాలై ఉంది. తనకి ప్రియజనులు కనిపించలేదు. ఎటు చూసినా రాక్షసాంగనలే. మందలోంచి తప్పిపోయిన జింకపిల్ల కుక్కలమధ్య చిక్కుకున్నట్లుంది. నల్లనిపాములాంటి జడ పిరుదుల దాకా వేలాడుతోంది. కన్నీరు కారుస్తోంది. దీనురాలై ఉంది. ఆ విశాలాక్షిని చూశాడు హనుమంతుడు. ఆలోచించాడు. ఆమే సీతాదేవి అనుకున్నాడు. రావణుడు అపహరించిన వేళ – తాము చూసిన స్త్రీ రూపం – అదే అని తోచింది. ఆరోజు అంత అందంగా ఉంది. ఈరోజు తాపసాంగనలా ఉంది. నేలమీద కూర్చుంది. దిగాలుగా ఉంది.

ఆమె సందిగ్ధపడ్డ స్మృతివాక్యంలా ఉంది. క్షీణించిన సంపదలా ఉంది. విశ్వాసంలేని శ్రద్ధలా ఉంది. భగ్నమైన ఆశలా ఉంది. విఘ్నాలున్న కార్యంలా ఉంది. కలతపడ్డ బుద్ధిలా ఉంది. అసత్యమైన అపవాదుతో చెడిన కీర్తిలా ఉంది. అభ్యాసం లేక మరచిపోయిన విద్యలా ఉంది. దగ్గరలో రాముడు లేడు. మనోవ్యధత కనపడుతోంది. రావణుని అపహరణతో బాధపడుతోంది. అసహాయురాలిలా ఉంది. బెదిరిన జింకలా ఉంది. అన్నివైపులా చూస్తోంది.

పదేపదే చూశాడామెను. మారు రూపు పడినట్లుందామె. రాముడు చెప్పిన ఆనవాళ్ళు స్మరించాడు. ఆమె సీతాదేవి అని



ఇలా తెల్సుకున్నాడు. 1. రాముడు చెప్పిన ఆభరణాలున్నాయి. అవి చెట్టుకు కట్టబడి ఉన్నాయి. 2. ప్రస్తుతం భర్త లేడు. కావున ఆభరణాలు తీసంది. వాటిని కొమ్మపై పెట్టింది. 3. చెవి దుద్దులు, చెవిపూలు, చేతిగాజులు ధరించిన గుర్తులు కనబడుతున్నాయి. చాలాకాలమైంది. అవి నల్లని చారల్లా ఉన్నాయి. 4. ఋష్యమూకంలో పడేసిన ఆభరణాలు ఇక్కడ లేవు. ఇక్కడున్నవి అక్కడ లేవు. కనుక ఈ ఆభరణాలు సీతమ్మవే. 5. నగలు మూటకట్టిన వస్త్రం – ఈమె కట్టిన వస్త్రం – రెండూ ఒకే బంగారు రంగులో ఉన్నాయి. ఈమె నిజంగా రాముని ప్రియ భార్య.

ఎవరి మదన తాపంతో రాముడు బాధపడుతున్నాడో ఆమె ఈమే. ఎవరిని ఆపదలో కాపాడలేకపోయానని కారుణ్యంతో బాధపడుతున్నాడో ఆమె ఈమె. తన సహధర్మచారిణి కనపడలేదని ఎవరికోసం శోకిస్తున్నాడో ఆమె ఈమె. కారుణ్యం అనుతాపం దుఃఖం మదనతాపం ఇవి నాలుగు. ఆ నాల్గింటిలో రాముడు ఎవరికోసం వ్యధ చెందుతున్నాడో ఆమె ఈమే. ఈమె అంగ ప్రత్యంగ సౌష్ఠవమూ – రాముని ప్రత్యంగ సౌష్ఠవమూ ఒకేలా ఉన్నాయి. ఒకరికొకరి ఈడూ జోడూ సరిపోయింది. సీతాదేవి మనసంతా రాముడే. రాముని మనసంతా సీతాదేవే. అందువల్ల ఇద్దరూ జీవించి ఉన్నారు. మాల్యవంతం పర్వతం మీద రాముడు బాధపడ్డాడు. ఒక ఆడదాని కోసం ఇలా విలపించాలా – అని పరిహాసంగా భావించాడు హనుమంతుడు. ఈమెకు దూరమైన రాముడు ఇంతకాలం ఎలా ఉన్నాడబ్బా? ఇది చాలా దుష్కర విషయం. రాముడు కఠినాత్ముడు. కనుక బతికే ఉన్నాడు. మరోసారి మైథిలిని చూశాడు. రాముడు ఎంత ధన్యుడో అనుకున్నాడు.

కాలోహి దురతి క్రమః : కాలాన్ని ఎవ్వరూ అతిక్రమించలేరు. అక్కడ రాముడు, ఇక్కడ సీతమ్మ దుఃఖపడుతున్నారు. ఇద్దరూ సద్వంశంలో పుట్టారు. ఇద్దరూ సదాచారపరులు. ఈమె కోసమే విరాధుణ్ణి చంపాడు రాముడు. ఈమె కోసమే కబంధుణ్ణి చంపాడు. ఈమె కోసమే వాలిని చంపాడు. ఈమె కోసమే సుగ్రీవుణ్ణి రాజుని చేశాడు. ఈమె కోసమే భూమండలాన్ని తలకిందులు చేయగలడు రాముడు.

**(సశేషం)**

# హనుమద్వ్రతం

– డా|| మరుదాడు అహల్యాదేవి

మార్గశిర మాస శుద్ధ త్రయోదశి తిథి నాడు హనుమద్వ్రతం చేయాలి. హనుమ అవతారాలను శాస్త్రాల్లో వర్ణించారు. ఆయన శంకర సుతుడు, కేసరీ నందనుడు, పవన తనయుడు, రుద్రావతారుడు, ఏకముఖి, పంచముఖి, సప్తముఖి, అంజనీకుమారుడు ఇలా అనేక నామాలున్నాయి. స్కంద, భవిష్యోత్తర పురాణాల్లో కేసరి భార్య అంజనాదేవి పుత్రునిగా హనుమంతుడు జన్మించినట్లు చెప్పడమైంది. బ్రహ్మాండ పురాణంలోనూ హనుమంతుని అవతార వర్ణన ఉంది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాల్లో వివిధ రీతుల్లో హనుమంతుని జనన గాథ వర్ణితం. వాయునందన, ఆంజనేయ, అంజనా నందన, కేసరీ నందన, పవన తనయ, శంకరసుత, సాక్షాత్ రుద్రావతారంగా వర్ణింపబడ్డాడు.

**వ్రత విధానం**

మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు ఉదయం స్నానం చేసి కాలకృత్యాలు తీర్చుకుని పీటపై 13 అష్టదళ పద్మాలు చిత్రించాలి. ఒక్కొక్క పద్మంలో ఒక్కొక్క జల కలశం పెట్టాలి. దానిపై పసుపుపచ్చ వస్త్రం వేయాలి. 13 ముడులు వేసిన 9 పోగుల తోరాలు వాటిపై ఉంచాలి. షోడశోపచారాలతో, అష్టోత్తరాలతో పూజ జరిపి బ్రాహ్మణులకు భోజనం పెట్టాక తామూ తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల అభీష్ట సిద్ధి కలుగుతుంది.

**కథ**

బంగారంతో తయారు చేసిన సుమేరు పర్వతం సూర్యుని వరం వల్ల కేసరికి రాజ్యంగా లభించింది. కేసరి భార్య అంజనాదేవి అతిలోక సుందరి. ఒకరోజున ఆమె శుచి స్నానం చేసి, ఆభరణాలు అలంకరించుకుంది. ఆ సమయంలో వాయుదేవుడు ఆమె కర్ణ రంధ్రంలో ప్రవేశించి బయటకు వస్తూ ''సూర్యుడు, అగ్ని, సువర్ణం వంటి కాంతి సమానుడు, వేద వేదాంగ మర్మజ్ఞుడు, విశ్వంద్యుడు, మహాబలుడు, సర్వకార్యసిద్ధిపరుడైన పుత్రుడు నీకు జన్మిస్తాడు'' అని నమ్మకంగా చెప్పాడట. అలాగే జరిగింది. ఆ మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు అంజనాదేవికి హనుమంతుడు పుట్టాడు. సూర్యోదయం అవుతూనే హనుమకి ఆకలి వేసింది. తల్లి పండ్లు తేవడానికి వెళ్ళింది. చెట్టుమీద ఎర్రటి బాలుడు సూర్యుణ్ణి పండు అనుకుని, తినడానికి ఆకాశానికి గెంతు గెంతాడు. ఆ రోజు అమావాస్య. సూర్యుణ్ణి గ్రహించడానికి రాహువు వచ్చాడు. హనుమను చూసి సూర్యుడు ఇంకో రాహువు అనుకుని భయపడి పారిపోయాడు. ఇంద్రుడు



హనుమంతుని వజ్రాయుధంతో కొట్టాడు. హనుమ గెడ్డం వంకరపోయింది. అందువల్ల 'హనుమ' అనే పేరు వచ్చింది. ఇంద్రుడి దుష్టవ్యవహారానికి కోపించి దండించాలని ప్రాణుల్లో వాయు సంచారం స్తంభింపచేశాడు వాయుదేవుడు. అప్పుడు బ్రహ్మ మొదలైనవారు వరాలు ప్రసాదించారు. లెక్కలేనంత ఆయుష్షు బ్రహ్మ ఇచ్చాడు. వజ్రంతో బాధ లేకుండా ఇంద్రుడు వరం ఇచ్చాడు. తన తేజస్సులో వందో వంతు ఇచ్చి సంపూర్ణ శాస్త్ర విజ్ఞానం కలిగేట్లు సూర్యుడు వరం ఇచ్చాడు. జాగరూకులు, అజేయులైన యోధులతో కూడా విజయం ప్రాప్తించేటట్లు శివుడు వరం ఇచ్చాడు. పాశం, జలంతో భయం లేకుండా వరుణుడు వరం ప్రసాదించాడు. యమదండంతో అవధ్యగా పాశంతో నాశనం కాకుండా యముడు వరం ఇచ్చాడు. శత్రుమర్దినీ గదతో నిశ్శంకగా జీవించే వరం కుబేరుడు అనుగ్రహించాడు. మయుడు నిర్మించిన అన్ని రకాల దుర్భేద్యమైన, అస్త్ర యంత్రాదులతో రవ్వంత కూడా క్షితి కాకుండా విశ్వకర్మ వరం ఇచ్చాడు. ఇన్ని రకాల వరాలతో హనుమ అమిత పరాక్రమంతో ఎన్నో కార్యాలు చేశాడు. ఇంకా ఎన్నో మరుగున పడ్డవి. రామాయణం, పద్మ, స్కంద, వాయు పురాణాల్లో ఉపాసనా విషయాలతో నిండిన అనేక గ్రంథాల్లో విశదీకరించారు. అటువంటి విశ్వవంద్య, మహాబలి, శ్రీరామచంద్రుని అనన్య సేవక మహాశయుడు అయిన హనుమ జపం, ధ్యానం, ఉపాసన, వ్రతం, ఉత్సవం చేసిన వారికి కష్టాలన్నీ దూరొంగా పరిపోతాయి. దేవదుర్లభపదం, గౌరవం, సుఖం ప్రాప్తిస్తాయి. హనుమంతుడు తన అద్భుత బలపరాక్రమములు, సేవాభావం, అనన్య రామభక్తి, అనంత సద్గుణాల వల్ల జీవితాన్ని సఫలం చేసుకోవటమే కాక తానెవరి అంశంగా జన్మించాడో ఆ సదాశివుని, వాయుదేవుని, కపి శ్రేష్ఠుడైన కేసరిని, తల్లి అంజనాదేవిని కూడా శాశ్వత కీర్తిమంతులుగా చేశాడు.

**"అతులిత బలధామం స్వర్ణ శైలాభదేహం**
**దనుజవన కృశానం జ్ఞానినా మగ్రగణ్యం**
**సకలగుణ నిధానం వానరాణా మధీశం**
**రఘుపతి వరదూతం వాతజాతం నమామిః"**

# ముకుందమాల

- డా॥ భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 25వ శ్లోకము

ఆమ్నాయాభ్యసనా న్యరణ్యరుదితం వేదవ్రతా న్యన్వహం
మేదశ్ఛదఫలాని పూర్తవిధయః సర్వే హుతం భస్మని ।
తీర్థానా మవగాహనాని చ గజస్నానం వినా యత్పద ॥
ద్వంద్వాంభోరుహసంస్మృతీః విజయతే దేవస్స నారాయణః ॥

భగవంతుడైన శ్రీమన్నారాయణుని పాదపద్మాలపై స్మరణ లేకపోతే ఎన్ని వేదాలు చదివినా ప్రయోజనం లేదు అడవిలో ఏడవడం వంటిది. ఆ వేదాల్లో చెప్పబడిన కర్మలు ఎన్ని చేసినా ఫలం లభించదు. పుణ్యకర్మలు చేసినా బూడిదలో వేసే ఆహుతలులా ఫలితముండదు, పుణ్యతీర్థాలలో స్నానం చేయడంలాంటివి ఏనుగు స్నానం వంటివి. దైవచింతనలేని పుణ్యకర్మలన్నీ వ్యర్థమే అవుతాయి.

''ఆమ్నాయాభ్యసనాని అరణ్యరుదితం'' – వేదాలను అభ్యసించడం దండకారణ్యములో ఏడవడం వంటిది అంటున్నారు. అదేమిటి వేదాలను చదివితే గొప్ప ఫలం కలుగుతుందని కదా! మనకి తెలుసు, అంటే! కులశేఖరాళ్వార్లు ఎందుకు ఇలా చెప్పారంటే స్వభావాన్ని చెబుతున్నారు, అభ్యాసం చేయడం ప్రధానం కాదు దానికంటే ముందు ఆ వేదాలలో నిశ్చయించబడిన పరమాత్మ అయినటువంటి శ్రీమన్నారాయణుడి యందు సమగ్రమైన విశ్వాసం, ఆచరణ నిష్ఠ, దాస్యత్వబుద్ధి లేకుండా అభ్యసించే వారి యొక్క విద్య అనర్థాలను తెచ్చిపెడుతుంది. అంటే .....

భగవంతుడిని తలుచుకున్నంత మాత్రాన ప్రయోజనం ఉంటుందా వేదాధ్యయనం చెయ్యకుండా అంటే, కేవలం వేదాధ్యయనము చేసినంత మాత్రమున ఏమి ప్రయోజనం? వట్టి శాస్త్రాభ్యాసము చేసి ఉపన్యాసములు చేయువాడికి గర్వమతిశయించి దేనియందు లక్ష్యముండదు. దానివల్ల భగవదపచారమో, భాగవతాపచారమో కలుగుతుంది. అలా అపచారములను చేయువారి విద్య నిర్జనమైన అడవిలో సహాయార్థమై ఏడవడం వంటిది.

జనాలు ఉన్నచోట ఏడిస్తే సమస్యకు పరిష్కారం దొరికి దుఃఖోపశమనము కలుగుతుంది. అలా అడవుల్లో ఏడవడం వల్ల మన స్వరం విని క్రూరమృగములు రావచ్చు ప్రాణహాని కలుగుతుంది. ప్రయోజనం లేకపోగా అనర్థము జరుగుతుంది. వేదవేదాంతములను అభ్యసించినా కూడా భగవద్భక్తి లేకపోతే, భాగవతుల యందు దాస్యత్వపు నిష్ఠ దూరమైతే, మనలో గర్వాతిశయ ములనే అంతః శత్రువులు చుట్టూ చేరి మనల్ని నిస్సహాయులను చేసి పతనానికి దారి తీస్తాయి. భగవద్భక్తి లేక చేసే వేదాధ్యయనము వలన ప్రయోజనము లేదు దాన్ని మరిచిపోయిన పక్షంలో నిర్జనమైన అరణ్యప్రదేశమున బ్రహ్మరాక్షసుడై పుట్టవలసి ఉంటుంది.

అందరూ వేదాధ్యయనము చేయలేరు కదా! "వేదవ్రతాన్యన్వహం మేదశ్ఛదఫలాని" – పోనీ ఆ వేద శాస్త్రములలో చెప్పినటువంటి వ్రతములను లేక ఉపవాసములు ఆచరిస్తే మనకి ఫలము లభించేస్తుందా? అంటే భగవద్దృష్టి లేని ఏ వ్రతమైన ఫలించదు. ఆ వ్రతోపవాసములన్ని కేవలం

శరీరమునందు క్రొవ్వు తగ్గించుకొనుటకు చేసినట్లు అవుతాయి. వ్రతాదులు భగవన్ముఖోల్లాసము కోసమే కదా చేసేది, అలాంటి భగవం తుడు ఉన్నాడు నాకు రక్షకము తానే అన్నభావము లేకపోతే ప్రయోజనం లేదు.

"పూర్తవిధయః సర్వే హుతం భస్మని" – కోనేర్లు, బావులు, మొదలైనవి త్రవ్వించడం, బ్రాహ్మణు లకు గృహాలు నిర్మించి ఇవ్వడం, పూజలు యజ్ఞములు చెయ్యడం మొదలైన కార్యాలు ఫలాన్ని కలిగిస్తాయా, పరమాత్మ యందు నిశ్చల మనస్సు లేకపోతే, అగ్ని లేకుండా బూడిదలో చేసే హోమము వంటి నిష్ప్రయోజనం కలిగిస్తాయి. ఇలాంటి సత్కార్యములు ఈశ్వర ప్రీతికొరకు చేసేవి, అది మరిచి పోయి నేను చేయిస్తున్నాను అని దాంభికముగా చేసే క్రియకు వృథా.

"తీర్థానామవగాహనాని చ గజస్నానం" – పుణ్యనదులలో స్నానము చేస్తే ప్రయోజనమే కదా, సంపూర్ణ విశ్వాసం భక్తి లేని వట్టి స్నానాదులు ఏనుగు స్నానం వంటివి. అనగా! ఎలా ఐతే ఏనుగు స్నానము చేసి తిరిగి బురదను తన శరీరం మీద వేసుకుంటుందో అటువంటి నిష్ప్రయోజనం. "పుణ్యనదులలో స్నానం ఎందుకు ఆచరిస్తాము? పరమాత్మయొక్క పాదప్రక్షాళన జలములగుట చేత నీ పాదధూళి కలిసిన జలంలో స్నానాన్ని ఆచరించడం ద్వారా నువ్వే నన్ను కాపాడవలసిన వాడివి అనే భావముతో చేస్తే సమస్త పాపక్షయమై తరిస్తాము". ఆ భావము లేకపోతే ప్రయోజనం లేదు. ఇలా పైన తెలిపిన సమస్త కార్యములన్నీ కూడా సర్వోత్కృష్టుడైనటువంటి పరమాత్మ అయిన శ్రీమన్నారాయణుడి యొక్క దివ్యకమల చరణముల యందు అనన్యభక్తి ప్రపత్తులు కలిగి, తానే ఫలాన్ని ఇచ్చువాడు అనే మహా విశ్వాసంతో ఉన్ననాడు సమస్త కార్యముల యొక్క సంపూర్ణ ఫలములను పొందుతాము అని ఫలాన్ని అనుగ్రహించువాడు పరమాత్మే అని నిశ్చయంగా తెలియజేసారు మన కులశేఖరాళ్వార్లు.

తానే సర్వస్వం అని భావించే తన భక్తులను ఎలా కాపాడుకోగలడో తెలియజెప్పేదే గోవర్ధన లీల.

## గోవర్ధనగిరి

శ్రీ కృష్ణ పరమాత్మ దేవాధిదేవుడు. సమస్త జీవరాశుల సంరక్షకుడు. ప్రతి జీవి కర్మఫలాలను పరిపూర్తి చేసుకునేందుకు వీలుగా ఏర్పడినవే ప్రకృతి నియమాలు. అవన్నీ భగవానుడి ఆదేశానుసారాలే. ఆ విధంగా ప్రతి జీవికీ ఆయన రక్షణ ఉంటుంది. అయితే అన్యథా శరణం నాస్తి అనే విశుద్ధ భక్తుల సంరక్షణ మాత్రం శ్రీకృష్ణుడే స్వయంగా చూస్తాడు. ప్రకృతి నియమాలను తిరగరాసైనా సరే, చేసిన శపథాలను పక్కన పెట్టయినా సరే, అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ భక్తులకు తన ఆపన్న హస్తాన్ని అందిస్తాడు.


గోవర్ధన పర్వతానికి గిరిరాజు అని కూడా పేరు. గిరిరాజ చాలీసా ప్రకారం ఒకసారి గోవర్ధనుడనే మహానుభావుడు పులస్త్య మహామునితో కలిసి బృందావనాన్ని సందర్శించాడు. అక్కడి అందాలను చూసి ముగ్ధుడయ్యాడు. అక్కడే స్థిరంగా ఉండాలని ప్రార్థించాడు. ఆ ఫలితంగా గోవర్ధన గిరిగా అవతరించాడు. భగవానుడి పాదస్పర్శతో పునీతమైన పర్వతమిది.

గోకులకృష్ణుడి లీలలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న గొప్ప స్థలమిది. తన యజ్ఞానికి తెచ్చిన హవనాది సామగ్రిని శ్రీకృష్ణుని సూచనతో గోవర్ధనగిరి పూజకు మళ్లించడంతో బృందావన వాసులపై ఆగ్రహించాడు దేవేంద్రుడు. ఇక్కడ ప్రకృతిలోని ఒక నిర్జీవమైన శిలను పూజించమని శ్రీకృష్ణుడు చెప్పడంలేదు. ఈ పర్వతం సాక్షాత్తు తన స్వరూపమేనని చెప్పాడు. అయినా దేవేంద్రుడు ఆగ్రహంతో రగిలిపోయాడు. ఏడు రోజుల పాటు వర్ష ధారలను కురిపించాడు. ఆ ఉపద్రవం నుంచి గోకులాన్ని కాపాడేందుకు చిన్ని కృష్ణుడు పూనుకున్నాడు.

నందవ్రజములో ప్రతి ఏట ఇంద్రయాగము చేసేవారు. ఏడేళ్ళ పసిబాలుడైన శ్రీ కృష్ణ పరమాత్మ సదస్యులందరి ముందర తండ్రియైన నందుని ఇలా ప్రశ్నించాడు "ఇంద్రయాగము చేయుటలోని ఆంతర్యమేమిటి"? నందుడు "కృష్ణా! యజ్ఞ యాగములు కృతజ్ఞతను ప్రకటించే సాధనములు. మనకు హితము కలిగించే వేల్పులకు కృతజ్ఞత చూపడమే యజ్ఞం యొక్క ముఖ్యోద్దేశం. కృతజ్ఞుడే కాని కృతఘ్నుడు సహాయమునకు అర్హుడు కాదు కదా! ఈ కారణముగా లోకహితార్థం యజ్ఞం చేయుట ఆచారం" అని చెప్పాడు.

తండ్రియొక్క సత్యవాక్కులు విని శ్రీ కృష్ణుడిలా అన్నాడు "తండ్రీ! ఫలము కేవలము దేవతల వల్లనే కలుగదు. ఫలసిద్ధికి ముఖ్యమైన హేతువు కర్మ. ఒక మనిషి తానెన్ని సత్కార్యాలు చేశాడన్నది ముఖ్యం. అందుకే కర్మయే భగవంతుడని అనవచ్చు. స్వధర్మమాచరించిన వాడికి దైవము చేరువలో నుండును. పరమాత్మ అవ్యక్తుడు సర్వవ్యాపకుడు నిరాకారుడు. అలాగే దేవతలు కూడా మనకు కనబడరు. కానీ సూక్ష్మ బుద్ధితో పరీక్షిస్తే ఈ ప్రకృతి (ఆది శక్తి) పరమాత్మ యొక్క ప్రత్యక్షస్వరూపం. కావున ప్రత్యక్షంగా మనకు కనిపించే ప్రకృతిని వదిలివేయుట మంచిది కాదు.

మనము వేటి మీద ప్రత్యక్షంగా ఆధారపడి బ్రతుకుతున్నామో వాటినికూడా పూజించి మన కృతజ్ఞతా భావాన్ని సుస్థిరం చేసుకోవాలి. మనం ఈ గోవర్ధన గిరి వద్ద నివసిస్తాము. గో సంపదతో బ్రతుకువారము. కావున గోవర్ధన గిరి పూజ గోమాత పూజ మనకు అత్యంత ప్రధానం. అందునా గోవర్ధనగిరి గోవిందుని వక్షస్థలం నుండి పుట్టి పులస్త్య మహర్షి అనుగ్రహించే ఇచటికి వచ్చింది".



పరమాత్ముని అమృతవాక్యాలు విన్న వ్రజ వృద్ధుడైన సన్నందుడు "ఓ నందనందన! నీవు జ్ఞాన

స్వరూపుడవు. నీ మాటలు మాకు శిరోధార్యములు. గోవర్ధనగిరి పూజావిధానము మాకు తెలుపుము" అని అన్నాడు. పరంధాముడు గిరిపూజా విధానం తెలిపినాడు:

"గిరి పాదభాగమును శుభ్రపఱచి గోమయముతో అలుకవలెను. రంగురంగుల ముగ్గులు వేయ వలెను. పూజా ద్రవ్యములు శ్రద్ధగా సమకూర్చుకోవలెను. స్నానాది క్రియలొనర్చి భక్తితో శోడషోపచారము లతో గోవర్ధనుని పూజించవలెను. అర్ఘ్యపాద్య అభిషేక అలంకరణ పుష్పపూజ దీపారాధన ప్రదక్షిణ నమస్కార స్తోత్ర నైవేద్యాది సేవలు చేసిన పిమ్మట నీరాజనమీయవలెను. విప్ర సంతర్పణ, గోపూజ, అందరికీ అన్నదానం బాగా చేయవలెను. సాష్టాంగ ప్రణామములు చేయవలెను".

శ్రీకృష్ణుడు అలా పూజావిధానం తెలిపి "పూజకి వచ్చేముందు మీ కర్తవ్యాలన్నీ నిర్వహించుకుని రండి. ఇంట్లో దైవపూజ మాతాపితపూజ అన్నీ చేసుకుని రండి. వృద్ధులను బాలకులను ఆకలితో వదిలేసి రాకండి. వారికి కావలసిన ఆహారం సమకూర్చండి. ఇంటి వద్ద ఉన్న గోవులకి పశు పక్ష్యాదులకి కుక్కలకి వేటికి కావలసిన ఆహారం వాటికిచ్చి రండి" అని చెప్పాడు.

ఓ శుభ దివసమున వ్రజవాసులు గోవర్ధన గిరిపూజకు తండోపతండాలుగా తరలి వచ్చారు. యాదవుల గురువైన గర్గ మహర్షి పురోహితులు వచ్చారు. నవనందులు, వృషభానుడు బంగారు పల్లకీలో రాధాదేవి వచ్చిరి. దేవతలు అప్సరసలు రాజర్షులు మహర్షులు పార్వతీ పరమేశ్వరులు విచ్చేసినారు. భక్తి శ్రద్ధలతో పూజావిధిని అనుసరించి గోవర్ధన గిరి పూజ చేశారు వ్రజవాసులు. వ్రజవాసుల భక్తికి మెచ్చి గోవర్ధనుడు సహస్ర బాహువులతో మానవాకృతిలో వచ్చి అందరిని ఆశీర్వదించాడు.

శ్రీకృష్ణపరమాత్మకీ జై, గోవర్ధన గిరిరాజుకీ జై అను జయజయ ధ్వానాలు భూనభోంతరాళముల

ప్రతిధ్వనించాయి. వ్రజ చరిత్రలో అది ఓ సువర్ణ ఘట్టం. పండుగ లేనినాడు జీవితం దండుగ అని అనిపిస్తుంది. సంబరం లేని పూట బ్రతుకు దుర్భరంగా అగుపిస్తుంది. ఇందుకే కాబోలు మన పూర్వీకులు ఉత్సవాలను, ఊరేగింపులను, జాతరలను ఏర్పాటు చేసారు.

శ్రీకృష్ణుడు యాదవులను, గోవులను ప్రళయం నుండి కాపాడటం కోసం గోవర్ధనగిరి అనే పర్వతాన్ని తన చిటికెన వ్రేలితో ఎత్తి వారిని రక్షిస్తాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, మధుర నుండి 30 కి.మీ. దూరంలో గోవర్ధనము అనే క్షేత్రం ఉంది. దీనిని వజ్రభూమిగా పిలుస్తారు. అయితే బ్రహ్మకు, కాళియునకు ఆనాడు స్వామి ప్రత్యేక్షమైన స్థలంగా ఈ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. ఇంకా యమునా నది తీరానగల ఈ క్షేత్రం శ్రీకృష్ణుడు తన చిటికెన వ్రేలితో గోవర్ధన పర్వతాన్నిఎత్తి గిరిధారిగా కీర్తించబడిన స్థలంగా ప్రసిద్ధి చెందినది.

ఇక పురాణానికి వస్తే, తర తరాలుగా గోపగోపికలు వజ్ర భూమిలో ఇంద్రుడిని ఆరాధించేవారు. కానీ శ్రీకృష్ణుడి ఆదేశానుసారంగా ఇంద్రుని వదలి తమను, తమ గోవులను సంరక్షిస్తున్న గోవర్ధన పర్వతాన్ని ఆరాదించగా, ఇంద్రుడు అందుకు కోపించి వజ్రభూమిలో రాళ్లవర్షాన్ని కురిపించగా

శ్రీకృష్ణుడు ఈ పర్వతాన్ని ఎత్తి వారందరిపైనా ఈ పర్వతాన్ని గొడుగులా నిల్చి కాపాడాడు. ఇలా ఆలయ విషయానికి వస్తే, ఇక్కడ మానసగంగ అనే సరస్సు ఉంది. ఈ సరస్సులో స్నానం చేస్తే గోహత్య దోషము పోతుందని చెబుతారు. ఇంకా భక్తులు 14 మైళ్ళు ఉన్న ఈ గోవర్ధనగిరికి ప్రదక్షిణ చేయుదురు. అలాచేయలేని వారు మానస గంగా సరస్సుకి ప్రదక్షిణ చేస్తారు. ఇంకా ఇక్కడ శ్రీకృష్ణుడే స్వయముగా నిర్మించినట్లు చెప్పబడుచున్న బ్రహ్మకుండంలో స్నానం చేసి గోవర్ధనాలయాన్ని భక్తులు దర్శిస్తారు. ఈ మందిరంలో గోవర్ధన శిఖరం ఉన్నది. దాని వెనుక వైపు

గోవర్ధనాథుడు శిల్పరూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. అయితే బాగా పరిశీలించి చూస్తే ఆ శిల్పంపై నెమలిపింఛము అద్భుతంగా కనిపిస్తుంది.

గోవర్ధనగిరి ప్రదక్షణ విషయానికి వస్తే, గోవర్ధనగిరి ప్రదక్షణ సుమారు 200కి.మీ. ఉంటుంది. ప్రతి సంవత్సరం శ్రావణమాసం నుండి కార్తీకమాసం వరకు భక్తులు సమూహంగా వస్తారు. అందులో రామదళం అనే భక్తసమాజం చాలా ముఖ్యమైనది. ఇందులో పురుషులైనా సాధువులు ఎక్కువగా ఉంటారు. వీరు 16 రోజులలో ఈ గోవర్ధన గిరి ప్రదక్షణ చేస్తారు. ఇక రెండవ దళం లో గృహస్థులు ఉండే వల్లభక్తుల గోస్వాములది. వీరు ఫాల్గుణ మాసములో ఒక యాత్ర చేస్తారు.

ఇలా ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో గోవర్ధనగిరి ప్రదక్షణ యాత్ర అంతటిని కూడా సంకీర్తన

నామజపంతో పాదచారులుగానే చేయుదురు. ఉధృతంగా కురిసిన వర్షాలు దాని వల్ల ఉత్పన్న మైన వరదలకు కొట్టుకుపోతున్నప్రజలను, పశువులను కాపాడడానికి శ్రీకృష్ణుడు ద్వాపర యుగంలో గోవర్ధన గిరిని చిటికిన వేలితో ఎత్తాడు. అలాంటి గోవర్ధన గిరికి ఓ శాపం ఉంది. ఇంతకీ అప్పటి గోవర్ధన గిరి ఇప్పుడు ఉత్తరప్రదేశ్ లోని మధుర ప్రాంతంలో ప్రస్తుతం ఈ పర్వతం ఉంది. ఈ పర్వతానికి ప్రతి ఏడాది దీపావళి వెళ్ళాక అక్కడి ప్రజలు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు.

గోవర్ధనం అనగా గోవుల్ని వర్ధనం అనగా వృద్ధిచేయడం అని అర్థం. సాధారణంగా గోవర్ధన పర్వతం అంటే చాలా ఎత్తుగా నిలబడి వుంటుంది అనుకుంటారు. కాని గోవర్ధనగిరి పడుకున్న పర్వతం, ఎత్తు తక్కువగా వుంటుంది. చుట్టు కొలత మాత్రం 11కి.మి. ఉంటుంది. గోవర్ధన పర్వతాన్ని చూడకపోయిన దాని గురుంచి తెలియని వారు వుండరేమో. బృందావనంలో నివసిస్తున్న సమయంలో కృష్ణుడు, గోపాలులు ఆచరిస్తున్న ఇంద్రయాగాన్ని ఆపించి, గోవర్ధన గిరికి పూజ చేయిస్తాడు.

కోపగించిన ఇంద్రుడు ప్రళయ భయంకర మైన రాళ్ళవానతో బృందావన ప్రజలను ముంచేస్తాడు. అప్పుడు చిన్నికృష్ణుడు



చిటికెన వేలుమీద గోవర్ధన గిరి ఎత్తి పట్టుకుని ఊరి వారికి రక్షణ కల్పించాడు. వరుసగా ఏడు (7) రోజులు కృష్ణుడు అలా గోవర్ధన గిరిని పట్టుకునే వున్నాడు. దీనికి గుర్తుగా వైష్ణవ సంప్రదాయులు ఇప్పటికి దీపావళి మరుసటి రోజుని గోవర్ధన పూజ చేస్తారు. భక్తుల దృష్టిలో గోవర్ధన పర్వతం కృష్ణుడికి భిన్నమైనదేమి కాదు. గోపజనులను, గోవులను కాపాడిన కృష్ణుడు ఆ రోజు నుండి గోవిందుడు అయ్యాడు. గిరిని ఎత్తి గిరిధారి అయ్యాడు.

**కిరియై ధర యెత్తిన హరి**
**కరి సరసిజ ముకుళ మెత్తుగతిఁ ద్రిభువన శం**
**కరకరుఁడై గోవర్ధన**
**గిరి నెత్తెం జక్క నొక్క కేలన్ లీలన్.**

కృష్ణుడి అభిన్నరూపంగా సాక్షాత్ శ్రీకృష్ణుని మరో రూపంగా భావించబడే గోవర్ధన గిరి ప్రదక్షిణ చేయడం చాలా ఉత్సాహంగా వుంటుంది. కొందరు నడవలేని వాళ్ళు రిక్షాలో చేస్తారు. కొందరు చెప్పులతో నడుస్తుంటే, మరికొందరు చెప్పులు లేకుండా నడుస్తారు. సాధారణంగా గిరికి కుడి వైపు వుండేలా గిరి చుట్టూ నడుస్తారు. రకరకాల వాళ్ళు ప్రదక్షిణలు చేస్తుంటారు. వాళ్ళలో సాధువులు, గృహస్థులు, పిల్లలు, వృద్ధులు. ఎవరు ఎలా చేయగలిగితే అలా చేస్తుంటారు. ఇక్కడ గిరిప్రదక్షిణ అంటే ఎవరికి వారే చేయడమే కాదు. కుటుంబం సమిష్టిగా కూడ చేస్తుంటారు. ఇలా కుటుంబం (అంటే బార్య, భర్త, ఇద్దరు పిల్లలు అనుకోండి) సమిష్టిగా చేసే ప్రదక్షిణ కొంచెం వింతగా అనిపిస్తుంది.

వాళ్ళు పడుకొని సాష్టంగ పడుతూ గిరికి ప్రదక్షిణ చేస్తారు. కాకపోతే ఒక్కరే కాదు నలుగురు కలిసి ప్రదక్షిణ. అంటే భర్త సాష్టంగ పూర్తయిన చోటునుండి భార్య, ఆమెది పూర్తయ్యే చోటు నుండి ఒక పిల్ల, అక్కడ నుండి మరొక పిల్ల, మళ్ళీ వాళ్ళ నాన్న. ఇలా సాష్టాంగ ప్రదక్షిణలు చేయడం అన్నది ఇక్కడ కనబడుతుంది. కఠినమైన చలి, మంచు వున్నా కూడా సాష్టాంగ పడుతూ చేస్తుంటారు.

ఈ ప్రదక్షిణ మార్గంలో అక్కడక్కడ నిర్జన ప్రదేశాలు. మధ్యలో ఒక ఊరు, చిన్న చిన్న ఆశ్రమాలు, సాధువుల కుటీరాలు కనబడతాయి, ముఖ్యంగా కొందరు సాధువులు చేసే సాష్టాంగ ప్రదక్షిణ మిక్కిలి ఆకర్షించే ప్రదక్షిణ. మాములుగా అయితే వరుసగా సాష్టాంగ ప్రణామాలు పెడుతూ ముందుకు వెళ్ళాలి. లేదా కుటుంబం సమిష్టిగా చేస్తూ వెళ్ళాలి. కాని ఈ సాధువులు ఒకే చోట 108 లేదా 1008 సార్లు సాష్టంగప్రణామం చేశాకనే ముందుకు వెళ్తారు. అలా ప్రతి సారి వాళ్ళు మొక్కిన్నన్ని సార్లు చేస్తారు. అలా అది 108 కావచ్చు 1008 కావచ్చు. వాళ్ళు ఎన్నిసార్లు అనుకున్నారో అన్ని చిన్నరాళ్ళ కుప్పని పెట్టుకుంటారు. ప్రతి ప్రణామానికి ఒక రాయి ముందు పెడతారు. అలా అనుకున్న 108 లేక 1008 రాళ్ళు ముందుకు వచ్చాక, వాళ్ళు ముందుకి జరిపిన రాళ్ళకుప్ప దగ్గరకి వస్తారు. తరువాతి సాష్టాంగం మొదలు పెడతారు. అంటే కొన్ని సార్లు ఒకే చోట ఒక సాష్టాంగం పూర్తవడానికి వాళ్ళకి ఒకటి లేక రెండు రోజులు పడుతుంది. అలా మొత్తం గిరి ప్రదక్షిణ పూర్తవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది.

ఇక ఈ పర్వతానికి ఏం శాపం ఉందో? అది ఎందుకొచ్చిందో ఇప్పుడు చూద్దాం. పూర్వం పర్వత రాజైన ద్రోణకలుడికి గోవర్ధనుడు, యమున అనే ఇద్దరు పిల్లలు కలిగారు. వారిలో గోవర్ధనుడు గోవర్ధన పర్వతంగా యమున నదిగా మారారు. ఈ సమయంలో బ్రహ్మదేవుని మనమడు మహా ఋషి అయిన పులస్త్యుడు ద్రోణకలుడిని కలిసి కాశీలో గోవర్ధన పర్వతం ఉంటే భక్తులకు తమలాంటి ఋషులకు పూజలు చేయడానికి సౌలభ్యంగా ఉంటుందని కోరాడు. అందుకు ద్రోణకలుడు అంగీకరించాడు. గోవర్ధనుడికి అసలు ఈ విషయం నచ్చలేదు కానీ తండ్రి మాట కాదన లేక పులస్త్యుని వెంట ఒక షరతుతో వెళ్ళాడు. తనని పులస్త్యుడు కాశీ వరకు దింపకుండా వెళ్లాలని అన్నాడు. అందుకు పులస్త్యుడు కూడా అంగీకరించాడు. దీనితో పులస్త్యుడితో వెళ్తున్న గోవర్ధనుడు.

తన చెల్లి ప్రవహిస్తున్న మధురా నగరం యొక్క ప్రకృతి అందాలకు ముగ్ధుడయ్యాడు ఎలాగైనా అక్కడ సమయం గడపాలని నిర్ణయించుకున్నాడు అందుకే క్రమక్రమంగా బరువు పెరగడం మొదలుపెట్టాడు. విషయం తెలుసుకున్న పులస్త్యుడు వెంటనే గోవర్ధనుడని శపించాడు. ఆ శాపం ప్రకారం గోవర్ధనుడు సంవత్సరానికి ఆవగింజంత పరిమాణాన్ని కోల్పోతాడు. ఇలా తను భూమికి సమతులంగా మారగానే కలియుగాంతం జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

గోవర్ధనగిరి ఉన్నగ్రామాన్నిగోవర్ధన్ అనే పేరుతోనే పిలుస్తారు. గోవర్ధన పర్వతం వద్ద చిన్న గోవర్ధన మందిరం ఉంటుంది. ఇక్కడ ప్రజలు శ్రీకృష్ణున్ని దర్శించుకుని గోవర్ధన గిరి ప్రదక్షిణానికి బయలు దేరుతారు. ఈ గిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం సాక్షాత్ శ్రీ కృష్ణుడి చుట్టూ ప్రదక్షిణ చేసినట్లుగా భక్తులు భావిస్తారు. ఈ పర్వతానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇది నిలువుగా కాకుండా అడ్డంగా విస్తరించి ఉంటుంది. దీని చుట్టుకొలత దాదాపు 11 కిలోమీటర్లు. అంటే గిరి ప్రదక్షిణ చేసే వారు 11 కిలోమీటర్లు చుట్టిరావాలి. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ ఈ గిరి ప్రదక్షిణ చేయడానికి ఎంతో ఉత్సాహం కనబరుస్తారు. చిన్న చిన్న ఆశ్రమాలను, సాధువుల కుటీరాలను, గ్రామాలను దాటుకుంటూ ఈ ప్రదక్షిణ సాగుతుంది. కొందరు భక్తులు కుటుంబంతో సహా గోవర్ధనగిరి చుట్టూ సాష్టాంగ ప్రదక్షిణ చేస్తారు.

కొండపై ఉన్న భవనాలు, నిర్మాణాలు 16వ శతాబ్దం నాటివని చెబుతారు. ఇక్కడ కొన్ని అవశేషాలకు పురావస్తు ఆధారాలు లేవు. ఎంతో ఘనమైన పురాణ ప్రాముఖ్యత గల గోవర్ధన గిరికి సమీపంలో అనేక పర్యాటక ఆకర్షణలు ఉన్నాయి. గోవర్ధనగిరితో పాటు ఈ ప్రదేశాలను సందర్శించేందుకు దేశ విదేశాల నుంచి టూరిస్టులు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు.

**ఈ కథలోని నీతులను మరొక్కమారు చూద్దాం:** ప్రాకృతిక వనరులను నాశనం చేయడం స్వార్థబుద్ధితో ప్రకృతిని క్షోభింపచేయడం ఎన్నడూ భారతీయత కాదు. భారతీయులు ప్రకృతిని పరమాత్మ యొక్క ప్రత్యక్ష స్వరూపమని భావించి పూజిస్తారు. ఇదే శ్రీ కృష్ణుడు మనకిచ్చిన సందేశం.

దైవసేవ మాతాపితసేవ భూతదయ అన్ని మానవుడి కర్తవ్యాలని గుర్తుచేశాడు శ్రీ కృష్ణుడు. అందుకే పూజకు వచ్చేముందు వృద్ధులకు బాలులకు పశు పక్షాదులకు ఆహారం సమకూర్చి రమ్మన్నాడు.

మన సంస్కృతి ప్రకారము పూజా విధానము ఎట్టిదో శ్రీ కృష్ణుడు తెలిపాడు. భక్తి శ్రద్ధలతో విధినసురించి చేసిన పూజ ఫలించి గోవర్ధనుడు సాక్షాత్కరించాడు.

ఒక చిన్న పుట్ట గొడుగును ఎత్తినట్టు తన ఎడమచేతి చిటికెన వేలితో అవలీలగా పర్వతాన్నే ఎత్తి పట్టి తన భక్తులను సంరక్షించాడు. అసామాన్యమైన ఈ ఘట్టం గోకులవాసుల భక్తిని, పరమాత్ముడి అనంత శక్తిని చాటింది. విశుద్ధ భక్తితో భగవత్ ప్రేమను, సంరక్షణను పొందవచ్చని నిరూపించింది.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## ఆదిత్య పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

శ్రీనివాస! కృపాపూర్ణ! భక్తపోషణదీక్షిత!
సంసారారణ్యపతితం దయయా నేక్షసేకుతః?
భక్తబంధో! దయాసింధో! త్వత్పాదాబ్జౌ నమామ్యహమ్ ।
సూక్తాసూక్తమిదం సర్వం అపరాధం క్షమస్వ మే ॥

**ఆదిత్య. పు. అ. 5. శ్లో. 51, 52.**

శ్రీనివాసా! కృపానిధీ! భక్తరక్షణదీక్షితా! సంసారమనే మహారణ్యములో పడి చిక్కుకున్న నన్ను దయతో చూడవేమి? ఓ భక్తబంధూ! దయాసముద్రా! నీ పాదపద్మములకు నమస్కరిస్తున్నాను. ఈ శుభాశుభ రూపవాక్కులలోని అపరాధములను అన్నిటినీ క్షమించు. శ్రీనివాసా! వరప్రదా! నీ పాదపద్మముల యందు నిశ్చల భక్తిని, నీ పాదస్మృతిని, సకల విజ్ఞానమును, ఇహపర సౌఖ్యాన్ని నాకు వరంగా అనుగ్రహించు. శ్రీ స్వామి పుష్కరిణీ తీర్థమే క్షీరసాగరంగా, వేంకటాద్రిలోని దివ్యాలయమే శ్వేతద్వీపంగా అవధరించి శ్రీభూదేవులతో అర్చారూపివై విహరిస్తున్న ఓ విష్ణుమూర్తీ! నీ భక్తుడనైన నాకు ముక్తిని ప్రసాదించు.

పరమ భక్తుడైన దేవశర్మ ఈ విధంగా శ్రీపతియైన శ్రీనివాసుని స్తుతించి మౌనం వహించాడు. భక్తులకు అభీష్టములను వర్షించుటలో జాగరూకుడు, తనకు ఇష్టదైవము అయిన వేంకటేశ్వరునికి సాష్టాంగంగా ప్రణమిల్లినాడు. అప్పుడు ఈ స్తోత్రంతో సంతుష్టుడైన, సత్పురుషులకు పరమగతియైన శ్రీనివాసుడు మేఘగంభీరమైన వాక్కులతో దేవశర్మకు ఈవిధంగా వరములిచ్చాడు.

ఓ బ్రాహ్మణోత్తమా! నీవు చేసిన తపస్సు, ఉపాసన మొదలగు కర్మలతో నేను సంతుష్టుడనయ్యాను. నీవు అత్యుత్తమము, మహత్తరము, ఐశ్వర్య ప్రదము అయిన స్తోత్రాన్ని చేశావు. కావున నీవు ఇహపరాల్లో దేని గురించీ భయపడవద్దు. నాకు భక్తుడైన వాయుదేవునికి శిష్యుడవు, గురువుల పాదపద్మములను ఆశ్రయించినవాడవైన నీకు నా అనుగ్రహం వలన ఆపదలన్నీ తొలగి సంపదలన్నీ ప్రాప్తిస్తాయి. నాకు భక్తుడవైన నీ ఇంట్లో ప్రతి రోజు సువర్ణము వర్షిస్తుంది. నీకు పదివేల సంవత్సరాలు ఆయుష్షును ప్రసాదిస్తున్నాను. అలాగే నీ బిడ్డలకు, మనుమలకు కూడా దీర్ఘాయువునిస్తున్నాను. నూరుతరాల వరకు నీవు సకల భోగభాగ్యాల నను భావించి ఆ తరువాత నా పరమపదాన్ని పొందగలవు! అని పలికి శ్రీనివాసుడు అదృశ్యమయ్యాడు.

విపన్నాశః సంపదాప్తిః భూయాత్తేమదనుగ్రహాత్ ।
మమ భక్తస్య తే గేహే స్వర్ణవృష్టిర్దినేదినే ॥
అయుతాయుశ్చ తేదత్తం పుత్రపౌత్రాస్తథా -- యుషః ॥
శతపూరుష పర్యంతం భుక్త్వా భోగాననేకశః ।

తతో మత్పదమాప్నోషీ త్యక్త్వా–దృశ్యో బభూవహ ॥

**ఆదిత్య. పు. అ. 5. శ్లో. 59, 60.**

ఓ శౌనకాది మునీంద్రులారా! నిస్సంగులైన తపస్వులారా! భక్తపరాధీనుడైన వేంకటేశ్వరుడు తప్పక మిమ్మల్నందరినీ అనుగ్రహిస్తాడు. కాబట్టి మీరందరూ వేంకటాచలానికి వెళ్ళి రమాపతి, వేదవేద్యుడైన ఆ వేంకటేశ్వరునికి భక్తితో నమస్కరించి, స్తుతించి ఆయనను సంతుష్టుని చేయండి. భక్తులకు అభీష్టములను వర్షించుటలో జాగరూకుడైన శ్రీనివాసుడు మీకు సర్వాభీష్టాలను ప్రసాదిస్తాడు.

శ్రీ వేంకటేశస్య కథామృతం త్విదం
మాహాత్మ్యసారం సుతపస్వి మృగ్యమ్ (గమ్యమ్) ।
శ్రీ వేంకటేశస్య మహా ప్రియప్రియం
లోకోత్తరం దేవఋషిప్రియం చ ॥

**ఆదిత్య. పు. అ. 5. శ్లో 63.**

శ్రీ వేంకటేశ్వరుని ఈ దివ్య కథామృతం సమస్త పురాణములలోని భగవంతుని మహిమల సార భూతమైనది, దుర్లభమైనది. గొప్ప మహర్షులచేత అన్వేషించి పొందదగినది, వేంకటేశ్వరునికి మిక్కిలి ప్రియాతిప్రియమైనది, లోకోత్తరమైనది, లోకవిలక్షణమైనది. ఇది దేవతలకు ఋషులకు అత్యంతం ప్రియమైనది.

సమస్త పాపౌఘ వినాశ కారణం
సమస్త పుణ్యౌఘసమృద్ధికారణమ్ ।
శ్రీ వేంకటేశస్య పదారవిందయోః
సద్భక్తివృద్ధావసమానకారణమ్ ॥

**ఆదిత్య. పు. అ.5. శ్లో. 64.**

శ్రీనివాస కథామృతము సకల పాపసమూహములను నశింపజేస్తుంది. సమస్త పుణ్యరాశిని వృద్ధి చేస్తుంది. అంతేకాక శ్రీ వేంకటేశ్వరుని పాదారవిందములయందు నిశ్చలభక్తిని పెంపొందించుటలో నిరుపమానమైనది.

వక్తుః శ్రోతుః పాఠకస్య పారాయణపరస్య చ ।
పరాత్పరో వేంకటేశః ప్రసన్నో భవతి క్షణాత్ ॥
స్తోత్రేణానేన సంతుష్టో వేంకటేశో రమాపతిః ।
యాన్యాన్ కామాన్ కామయంతే తాంస్తాన్ ముక్తిం దదాతి చ ॥

**ఆదిత్య. పు. అ. 5. శ్లో 65, 66.**

ఈ స్తోత్రాన్ని, మాహాత్మ్యాన్ని చెప్పేవారికి, వినేవారికి, చదివేవారికి, పారాయణ చేసేవారికి పరాత్పరుడైన వేంకటేశ్వరుడు క్షణంలో ప్రసన్నుడవుతాడు. భక్తితో చేసే ఈ స్తోత్రంతో సంతుష్టుడైన లక్ష్మీపతియైన వేంకటేశ్వరుడు భక్తులు ఏయే కోరికలు కోరతారో వాటన్నిటిని ప్రసాదించి, ముక్తిని కూడా అనుగ్రహిస్తాడు.

**శ్రీ వేంకటాచల మాహాత్మ్యము లోని ఆదిత్యపురాణ భాగము సమాప్తము**

# బ్రహ్మాండ పురాణము

## భృగునారద సంవాదం

శౌనకాది మహర్షులు సూతమహర్షిని మహాత్మా! భూలోకంలో ప్రసిద్ధిచెందిన అనేక పుణ్యక్షేత్రముల గురించి మాకు తెలియజేశారు. వాటన్నిటికంటే కూడా పాపవినాశకమైన గొప్ప తీర్థక్షేత్రాన్ని గురించి మాకు తెలియజేయండి. ఏ పుణ్యక్షేత్రంలో సర్వాంతర్యామి, భక్తవత్సలుడు అయిన మాధవుడు శ్రీదేవి, భూదేవి, నీళాదేవులతో నిత్యం సంతోషంగా విహరిస్తూ ఉంటాడో, ఏ తీర్థ క్షేత్రంలో నివసించుట వలన సంపద లభించినవాడు కష్టాల నుండి తరించినట్లు, దుస్తరమైన భవసాగరం నుండి సుఖంగా మానవుడు తరిస్తాడో అటువంటి దివ్యక్షేత్ర మాహాత్మ్యాన్ని మాకు వివరంగా తెలియజేయండి. ముల్లోకాలలోను మీకు తెలియని విషమేమి లేదు కదా! అని ప్రార్థించారు.

అప్పుడు సూతమహర్షి వారితో ఓ పూజ్యులైన మహర్షులారా! మీ మాటల వలన నాకిపుడు జ్ఞాపకం వచ్చింది. మీకు దానిని చెబుతాను. ఏకాగ్రచిత్తంతో వినండి. పూర్వ మొకప్పుడు నేను సత్యవతీసుతుడైన వ్యాస మహర్షిని శ్రీమన్నారాయణునకు సంబంధించిన ఈ విషయాన్ని గురించి అడిగాను. అప్పుడు వ్యాస మహర్షి ఇలా చెప్పారు – ఓ సూతా! పూర్వం జరిగిన వృత్తాంతాన్ని నేను నీకు చెబుతాను. ఒకానొకప్పుడు మునిశ్రేష్ఠుడైన నారదుడు భూమిపై సంచరిస్తూ సంతోషం నిండిన మనస్సు కలవాడై పవిత్రమైన భృగుమహర్షి ఆశ్రమానికి వచ్చాడు. శరత్కాల మేఘము వలె తెల్లని కాంతి కలవాడు. మహతి అనే వీణను ధరించిన వస్తున్న, తేజశ్శాలి అయిన దేవర్షి నారదుని చూచి భృగుమహర్షి శిష్యులతో సహలేచి నిలబడి స్వాగతం పలికి అర్ఘ్యపాద్యాదులతో పూజించి ఉన్నతాసనంపై కూర్చుండ బెట్టి నమస్కరించి సంతో షించిన ఆ మహర్షి పుంగవుని కుశల, ప్రశ్నలు అడిగి మరల ఈ విధంగా ప్రశ్నించారు.

ఓ నారదమహర్షీ! మహాత్మా! నీవు ఈ ప్రపంచమంతా పర్యటిస్తూ ఉంటావు. కాబట్టి ఈ ప్రపంచ విశేషాలన్నీ నీవెరుగుదువు భూలోకంలో పుణ్యక్షేత్రాలన్నిటిలో గొప్పక్షేత్రం ఏదియో? అలాగే తీర్థాలలో ఉత్తమ తీర్థం ఏదియో మాకు తెలియ జేయండి. ఓ తపోనిధీ! ఊహించుటకు వీలుగాని స్వరూపంకల శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితో కూడ విహరిస్తూ ఎక్కడ సాక్షాత్కరిస్తాడో, సకల ప్రాణులకు వరాలనిస్తాడో, ఏ క్షేత్రంలో తపస్సు చేసే తపశ్శాలుర తపస్సులు అచిరకాలంలోనే సిద్ధిస్తాయో, ఏ దివ్యక్షేత్రంలో నివసించుట వలన జీవులు త్వరగా మోక్షాన్ని పొందుతారో అటువంటి దివ్యక్షేత్రాన్నిగురించి మాకు వివరంగా తెలియజేయండి ఈ భూలోకంలో ఈ విషయాన్ని తెలయజేయడానికి మీకంటే సమర్థులు వేరే ఎవరూ లేరు అని ప్రార్థించారు.

## వేంకటాద్రి నామాంతరాలు :

అంతట నారదమహర్షి భృగుమహర్షికి యిలా చెప్పనారంభించాడు– ఓ మహర్షీ! నేను చెప్పేదాన్ని సావధానంగా వినండి. పుణ్యక్షేత్రములలో ఉత్కృష్టమైనది, తీర్థస్థలాలలో ఉత్తమోత్తమమైనది. భూలోకంలో వేంకటాచలమనే పుణ్యక్షేత్రమున్నది. అది సర్వపాపాలను పోగొడుతుంది. సకల పుణ్యాలను పెంపొంది స్తుంది. ఈ క్షేత్రమాహాత్మ్యాన్ని చెప్పటానికి బ్రహ్మదేవునికి గాని, ఇతర దేవతలకుగాని సాధ్యం కాదు. అంతే కాదు ఓ మహామునీ! దాని మాహాత్మ్యాన్ని మనసులో ఊహించడానికి కూడా సాధ్యం కాదు. సర్వదేవతలకు ఆరాధ్యుడు, భక్త వత్సలుడు అయిన మాధవుడు తన పరంధామమైన వైకుంఠాన్ని వీడి లక్ష్మీదేవితో కూడ ఆ పర్వతంపై విహరిస్తున్నాడు.

**శ్రీ వేంకటగిరిర్నామ క్షేత్రం పుణ్యం మహాతలే ।**
**సర్వపాప ప్రశమనం సర్వపుణ్యవివర్ధనమ్ ॥**
**ఆరాధ్యః సర్వదేవానాం మాధవో భక్తవత్సలః ।**
**విహాయ స్వం ధామ రమతే రమయా సహ ॥**

**-బ్రహ్మాండపురాణం.అ.1.శ్లో. 18,20.**

ఈ వేంకటాద్రికి 1. అంజనాద్రి 2. వృషాద్రి 3. శేషాద్రి 4. గరుడా చలం 5. తీర్థాద్రి 6. శ్రీనివాసాద్రి 7. చింతామణి 8. వృషభాద్రి 9.వరాహాద్రి 10. జ్ఞానాద్రి 11. కనకాచలం 12. ఆనందాద్రి 13. నీలాద్రి 14. సుమేరుశిఖరాచలం 15. వైకుంఠాద్రి 16. పుష్కరాద్రి మొదలైన అనేక పేర్లున్నాయి.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య,శూద్రులు కాని యితర జాతులు వారు కాని ఆ పర్వతనామాలను పఠిస్తే పాప పంకిలము నుండి విముక్తులవుతారు. వేంకటాచలంతో సమానమైన పుణ్యక్షేత్రం, ఈ బ్రహ్మాండంలో మరెక్కడాలేదు, భవిష్యత్తులో ఉండజాలదు.

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశసమో దేవో నభూతో న భవిష్యతి ॥**

**-బ్రహ్మాండపురాణం.అ.1.శ్లో.24.**

దేవతలు, సిద్ధులు సేవించే ఆ దివ్య పర్వతంలో అనేక సుందరములైన వందల కొలది తీర్థాలున్నాయి. అవన్నీ సర్వపాపహరములు, సకల తీర్థాలను మించినవి, బహువిధ ఆశ్చర్యకరములైనవి. అవి సకల సిద్ధి ప్రదములు, సకల మంగళదాయకములు, వాటిల్లో స్వామి పుష్కరిణి అనే శుభప్రదమైన సరస్సు కలదు. దాని తీరంలో పుండరీకాక్షుడైన శ్రీనివాసుడు ఆనందంతో నివసిస్తున్నాడు! అని చెప్పగా భృగుహర్షి నారద మహర్షిని ఓ బ్రహ్మర్షీ! సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు ఉత్తమస్థానమైన వైకుంఠాన్ని వదలి లక్ష్మీదేవితో కూడి స్వయంగా ఆ పర్వతంమీద ఎందుకు నివసిస్తున్నాడు? అని అడిగాడు.

## క్షీరసాగరశాయి వర్ణన :

అంతట నారదమహర్షి ఓ భృగుమహర్షీ! వైకుంఠవాసియైన శ్రీమన్నారాయణుడు శ్రేష్ఠమైన, సుందరమైన ఆ వేంకటాద్రిపై లక్ష్మీదేవితో కూడ చిరకాలంగా ఎందుకు నివసిస్తున్నాడో ఆ విషయమం వివరంగా నీకు చెబుతాను. విను. ఒకానొకప్పుడు నేను శ్రీమన్నారాయణుని దర్శించుటకై క్షీరసాగరానికి వెళ్ళాను. అక్కడ మహోన్నతమైన శ్వేత ద్వీపాన్ని దర్శించాను. ఆ శ్వేతద్వీపంలో ఒక కల్పవృక్షవనం ఉంది. దాని మధ్యలో అనేక రత్న ఖచితమైనది, అనేక స్తంభాలతో కూడినది, సహస్ర సూర్య ప్రకాశమాన మైనది, దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఒక బంగారు సౌధమున్నది. అది అమరేంద్రునికి కూడ దుర్లభమైనది. భక్తికలవారికి సులభసాధ్యమైనది. అక్కడ దేవదేవుడైన శ్రీమహావిష్ణువుయొక్క దివ్యసభను దర్శించాను. అనంతుడు, గరుడుడు, విష్వక్సేనుడు మొదలగువారంతా ఆ సభనలంకరించి ఉన్నారు. అక్కడ శేషతల్పంపై శయనించినవాడు సర్వలోకైక కారకుడు, సర్వాశ్చర్య మయుడు, దేవదేవుడు అయిన హృషీకేశుని నేను సందర్శించాను. ఆయన రెండు లక్షల యోజనాల నిడివి కల దివ్యమంగళ విగ్రహుడు, కామరూపి, వెండి కొండపై నీల మేఘంవలె ఆ తెల్లని ఆదిశేషునిపై నీలమేఘశ్యాముడైన శ్రీమహావిష్ణువు శోభిస్తున్నాడు.

ఆయన తామర పూవువలె విశాలమైన నేత్రములు కలవాడు, పురాణ పురుషుడు, శ్రీదేవి భూదేవులచే పాదసేవ చేయబడుచున్నవాడు, శ్రీవత్సమనే పుట్టుమచ్చ కలవాడు, గొప్పశరీర నిర్మాణము కలవాడు పద్మము వంటి ముఖము కలవాడు, ఒకేసారి ఉదయించిన వేయి మంది సూర్యుల సమాన కాంతి కలవాడు, శంఖచక్రములను ధరించిన వాడు, ప్రకాశిస్తున్న, కదలుచున్న కుండలములు కలవాడు, సౌందర్యసార స్వరూపుడు, భవరోగనాశకుడు, ప్రళయకాలంలోని వేయి సూర్యుల కాంతితో ప్రకాశిస్తున్న కిరీటమును తలపై ధరించినవాడు, నిశ్చలుడు, నీలమేఘశ్యాముడు, మిక్కిలి ప్రియదర్శనుడై శోభిస్తున్నాడు. ఆయన కర్ణాభరణాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. కంఠంలో కౌస్తుభమణి విరాజిల్లుతున్నది. సూర్యకాంతితో ప్రకాశించే రత్నాదులతో ప్రకాశిస్తున్న ఆయన కుండలాలు కదలుతున్నాయి. ఆయన మెడలో వైజయంతీ వనమాల విరాజిల్లుతున్నది. ఆయన వక్షస్థలంలో ప్రకాశ వంతమైన యజ్ఞోపవీతం శోభిల్లుతున్నది. ఆయన భుజకీర్తులలోని మణులు సూర్యకాంతి వలె ప్రకాశిస్తున్నాయి. ఆయన చేతి స్వర్ణ కంకణాలు మణులు, మాణిక్యాలు, ముత్యాలతో, ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నాయి.

ఆయన వేలి ఉంగరాలు నవరత్నాలతో అలంకరించబడినాయి. ఆయన నోరు పచ్చ కర్పూరగంధాన్ని వెదజల్లుతున్నది. ఆయన అధరోష్ఠం ఎర్రగా ఉంది.ఆయనధరించినపచ్చనిపీతాంబరంవేయి మెరుపుల కాంతితో ప్రకాశిస్తున్నది. కాలికి అందెలు, మొలనూలు

ధరించిన ఆ నీలమేఘశ్యాముడు మెరువులతో కూడిన మేఘమువలె నున్నాడు. ఆయన నాభికమలం వేయిమంది బాలసూర్యుల కాంతితో ప్రకాశిస్తున్నది. మార్కండేయుడు, భరద్వాజుడు, పుండరీకుడు, శుకుడు, యాజ్ఞవల్క్యుడు, అంబరీషుడు మొదలగు మహర్షులు, యోగులు, భక్తులు, ఇతర మునిపుంగవులు, శంఖచక్రగదాదులను చతుర్భుజాలలో ధరించి భగవంతుని సారూప్యమును పొందిన ప్రహ్లాదుడు మొదలైన భక్తశిఖామణులు శ్రీమన్నారాయణుని అనేక విధములుగా స్తుతిస్తున్నారు. సనక సనం దనాది యోగీంద్రులు కూడా ఆయన్ను స్తోత్రం చేస్తున్నారు. ఆయన మానవులకు భుక్తిని, ముక్తిని సర్వాభీష్టాలను ప్రసాదిస్తాడు.

బ్రహ్మ, రుద్రుడు దిక్పాలకులు, భయ భక్తులతో ఆయన్ను సేవిస్తున్నారు. నేను దేవదేవునికి శిరస్సు వంచి నమస్కరించి ఆ జగత్ప్రభువును అనేక స్తోత్రాలతో స్తుతించి భక్తితో వినమ్రుడనై అంజలి ఘటించి నిలబడ్డాను. శ్రీమన్నారాయణుడు నాకు స్వాగతం పలికి గౌరవించి మనుమడననే వాత్సల్యంతో తన చల్లని చూపులతో ఆహ్లాదపరుస్తూ ఆ మధుసూదనుడు యిలా అన్నాడు.

నాయనా! నారదా! నీవు ముల్లోకాలలో సంచరిస్తూ ఉంటావు. నీకు భువన త్రయాన్ని చూశావు. ఈ బ్రహ్మాండంలో నేను నివసించటానికి ఏ ప్రదేశం అనుకూలంగా ఉంటుంది? నేను విహరించటానికి యోగ్యమైనది. విశ్రమించటానికి తగిన ఉత్తమస్థానమేది? భూలోకంలో అటువంటి స్థలం ఎక్కడుందో చెప్పు అని అడుగగా నేను యిలా అన్నాను.

ప్రభూ! మూడు లోకాలలో నీకు తెలియని విషయమేమీ లేదు. అయిన ప్పటికీ నీవు నా యందు వాత్సల్యంతో యిలా అడిగావు. నీవు విహరించుటకు తగిన సుందరమైన స్థానం ఒకటున్నది. అది చాలా ఆశ్చర్యకరమైనది. భూలోకంలో దానితో సమానమైనది మరొకటి లేదు. నీ పాదపద్మములనుండి ఉద్భవించిన గంగకు దక్షిణ దిక్కున దండకారణ్యంలో రెండు వందల యోజనాల దూరంలో దక్షిణ సముద్రానికి ఉత్తరం వైపున తూర్పు సముద్రానికి పడమటివైపున ఐదు యోజనాల దూరంలో ఉన్న రమణీయమైన ప్రదేశం మీరు విహరించుటకు తగియున్నది. అక్కడి ప్రజలంతా తపస్స్వాధ్యాయరహితులు. ఆధివ్యాధులతో బాధపడుతున్నారు. వారు దిక్కు లేనివారై ఉన్నారు. వారందరినీ అనుగ్రహించడానికి మీరక్కడకు వేంచేయాలి! అని చెప్పగా భగవానుడు యిలా అన్నాడు– నారదా! కలియుగంలో చోళరాజుకు చక్రవర్తి అనే కొడుకు పుడతాడు. అతడు నా భక్తుడై నన్ను పూజిస్తాడు. అతన్ననుగ్రహించడానికి కూడా నేనక్కడ ఉండాలి.

**చోళరాజసుతః కశ్చిత్కలౌఖలు భవిష్యతి।**
**చక్రవర్తీతి మద్భక్తస్తత్ర మామర్చయ్యితి ॥**
**అనుగ్రహాయ తస్యాపి తస్యాపి తత్రస్థాస్యామ్యహం మునే ॥**

**-బ్రహ్మాండపురాణం.అ.1.శ్లో.61.**

## శేషుడు భగవంతుని క్రీడాపర్వతమగుట :

అంతట శ్రీమన్నారాయణుడు ఆదిశేషుని పిలిచి ఎదుట నిలబడిన శేషునితో సంతోషంతో వికసించిన నేత్రములు కలవాడై మేఘ గంభీర ధ్వనితో యిలా అన్నాడు – ఓ అనంతా! లోకంలో నీకంటే నాకు ప్రియమైన వారెవరూ లేరు. కావున నీవు

నాకు ప్రీతికరమైన కార్యాన్ని చేయాలి. నీవు నారదుడు చెప్పినదంతా విన్నావు కదా! నేను విహారయోగ్య మైన స్థలంలో నివసించదలచాను. కావున నీవు భూలోకానికి వెళ్ళి అక్కడ పర్వతరాజమై ఉండు నేను నీ పడగల పైభాగంలో లక్ష్మీదేవితో సహా నివసిస్తాను. అనగా ఆదిశేషుడు మహాదేవా! నేను పర్వతరూపాన్ని ధరించి ఉంటాను. మీరు లక్ష్మీదేవితో కూడ నా చరియలయందు విహరించండి. మీ ఆజ్ఞచేత గంగాది పుణ్యనదులు, పుణ్యతీర్థాలు, సరస్సులు నాపైన సదా ఉండుగాక! నాపైన పుట్టిన చరాచర ప్రాణులన్నింటికి మీ అనుగ్రహం వలన సర్వాభీష్టములు నెరవేరుగాక! అని ఆదిశేషుడు సర్వలోకహితం కోరి భగవంతుని ప్రార్థించాడు.

అంతట భగవంతుడు ఓ అనంతా! నీవు కోరినట్లే అగుగాక! అక్కడ చేసే తపస్సులన్నీ సిద్ధించు గాక! అక్కడ తపస్సు చేసే వారికి అవి నిర్విఘ్నంగా నెరవేరుగాక! నేను అక్కడ సర్వప్రాణులకు దర్శనమిస్తాను. లక్ష్మీ దేవితో కూడ అక్కడ నివసిస్తూ మానవులకు వారి అభీష్టాలను ప్రసాదిస్తాను.

**తపాంసి తత్ర సిద్ధ్యంతు నిర్విఘ్నాని తపస్వినామ్ ।**
**అహం హి సర్వజంతూనాం దృష్టిగోచరతాం గతః ।**
**వసిష్యామి శ్రియా సార్థం దదదిష్టాని దేహినామ్॥**

**-బ్రహ్మాండపురాణం అ.వి.శ్లో.8,9.**

మీరంతా మీ మీ సఖులతో పాటు అక్కడకు రండి. ఆ ప్రదేశం మనకు విహారయోగ్యమైనదని నారదమహర్షి సూచించాడు అని చెప్పి భగవానుడు సేనాపతితో నీవు నీ అనుచరులతోను, పరివారముతోను, బ్రహ్మాది దేవతలతోను, యక్ష, రక్ష గణాలతోను, సిద్ధ విద్యాధరులతోను, కిన్నరులతోను, నాగులతోను, ఋషిసమూహాలతో పాటు వెంటనే శేషాచలానికి వెళ్ళు. నేనక్కడ లక్ష్మీదేవితో కూడ నివసిస్తాను. జితేంద్రియులైన సత్పురుషులను అనుగ్రహించడానికై అక్కడ నిత్యం నివసిస్తాను! అనిచెప్పి దేవదేవుడైన భగవానుడు శ్రీదేవి, భూదేవి, నీళాదేవులతో కూడి గరుత్మంతుని అధిరోహించి శేషాద్రికి వెళ్ళాడు. అంతట భృగుమహర్షి నారద మహర్షితో మహాత్మా! ఇది చాలా ఆశ్చర్యకరంగా ఉంది. గొప్ప శరీరం గల శేషుడు పెద్ద పర్వతంగా ఎలా మారాడు? శేషుడు పర్వతరూపం ధరించినపుడు అతని శిరస్సు, ఉభయ పార్శ్వములు, తోకభాగములు ఎంత దూరం వ్యాపించినాయి? తెలియజేయండి అని అడుగగా నారదమహర్షి మరల యిలా చెప్పసాగాడు.

**(సశేషం)**

# సులభ ప్రసన్నుడు - సుబ్రహ్మణ్యుడు

– చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో ॥ "గళే రత్నభూషం తనే మంజువేషం
కరే జ్ఞానశక్తిం దరస్మే రమాస్యే
కటన్యస్త పాణిం శిఖిస్థం కుమారం
భజేహం గుహదన్య దైవం నమస్యే"

కంఠంలో రత్నాలంకారాలు, తనువున చక్కదనం, చేతిలో జ్ఞాన ఆయుధం, ముఖాన చిరునవ్వు, కటియందు హస్తం దాల్చి నెమలియందు ప్రకాశిస్తున్న రహస్య (గుహ) స్వరూపుడైన కుమారస్వామిని ఆశ్రయిస్తున్నాను.

జ్యోతిష శాస్త్రం ప్రకారం చంద్రుడు ప్రతినెలలో పౌర్ణమి నాడు ఒక్కో నక్షత్రంతో కలిసి ఉదయిస్తాడు. మృగశిర నక్షత్రంతో కలిసి ఉదయిస్తాడు కాబట్టి ఈ నెలకు మార్గశిర మాసమని పేరు ఏర్పడింది. ఈ మాసం ఆధ్యాత్మికంగా ఒక ప్రత్యేకతను కలిగి ఉంది. సనాతన సంస్కృతిలో ముఖ్యమైన పండుగలకు ఈ నెల పెట్టింది పేరు.

మార్గశిర శుద్ధ షష్ఠి నాడు సుబ్రహ్మణ్య షష్ఠి పర్వాన్ని కుమారస్వామి భక్తులందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. తమిళులు ఈ పర్వాన్ని స్కంద షష్ఠి అంటారు. సుబ్రహ్మణ్య స్వామికి కుమారస్వామి, కార్తికేయుడు, స్కందుడు, షణ్ముఖుడు, గుహుడు మొదలైన పేర్లున్నాయి. మహారాష్ట్రీయులు ఈ పర్వమును ''చంపా షష్ఠి'' అని అంటారు.

''సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం'' అని దేం కార్తికేయుని స్తుతించింది. సుబ్రహ్మణ్యుడు అంటే గొప్ప తేజస్సు కలవాడని అర్థం. ఆ సుబ్రహ్మణ్యుని ఆరాధనకు ఉత్కృష్టమైన తిథి సుబ్రహ్మణ్య షష్ఠి. బ్రహ్మవిద్యకు, సంతాన సౌభాగ్యానికి అధిపతి సుబ్రహ్మణ్యుడు. షణ్మతాలలో కుమారోపాసన ఒకటి. పరమశివుడు, అవ్యక్త శక్తి ఉమాదేవి వీరిరువురి సమైక్య సమన్వయ తత్వమూర్తి కుమారస్వామి అని స్కందపురాణం పేర్కొంది. ప్రకృతీ పురుషుల ఏకత్వం కుమారస్వామి తత్వం. సుబ్రహ్మణ్యుడు కారణజన్ముడు.

పూర్వం కశ్యప ప్రజాపతికి పదముగ్గురు భార్యలుండేవారు. వారిలో దితికి వజ్రాంగుడనే పుత్రుడున్నాడు. ఎన్నో శస్త్రాస్త్ర విద్యలను నేర్చిన వజ్రాంగుడు సమస్త శాస్త్రాధ్యయనం కూడా చేశాడు. యుక్తవయస్కుడైన వజ్రాంగుడు వరాంగి అనే కన్యను వివాహం చేసుకున్నాడు. అతనికి చాలాకాలం వరకు సంతానం కలగకపోవడంతో తపస్సు చేసి ముల్లోకాలను జయించగల వరపుత్రుని పొందాలన్న ఆశ. ఇదే విషయాన్ని తన భార్య



వరాంగికి చెప్పగా ఆమె కూడా తపస్సు చేసేందుకు తన సమ్మతిని తెలియజేసింది. వెంటనే భార్యా భర్తలిద్దరూ మంచి ముహూర్తం చూసుకుని తపస్సు చేయసాగారు. వరాంగి చేసే తపస్సు ధాటికి ముల్లోకాలు తాళలేక పోయాయి. వరాంగి తపస్సును భగ్నం చేయటానికి ఉపక్రమించినప్పుడు ఇంద్రుడు రాళ్ళ వర్షాన్ని కురిపించాడు. పిడుగులు వడగాల్పులయ్యాయి. దేవేంద్రుని కుతంత్రాలకు చలించక తమ తపస్సులను మరింత తీవ్రతరం చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ చలించక తపస్సు చేయసాగారు. ఇంద్రాది దేవతలు బ్రహ్మదేవునితో మొర పెట్టుకున్నారు. దేవతలను అనునయించిన బ్రహ్మ వారిని వారి వారి లోకాలకు పంపి, తాను వజ్రాంగుని ముందు ప్రత్యక్షమయి ఏ వరం కావాలో కోరుకొమ్మన్నాడు.

తమ ముందు ప్రత్యక్షమైన బ్రహ్మదేవుని వజ్రాంగ దంపతులు పరిపరి విధాలుగా ప్రార్థించి, తమకు ముల్లోకాలను జయించగల పుత్రుడు కావాలని కోరుకోగా బ్రహ్మ తథాస్తు అని పలికి అదృశ్యమయ్యాడు. కొన్నాళ్ళకు గర్భం దాల్చిన వరాంగి ఒక మగ శిశువుకు జన్మనిచ్చింది. తపః ఫలంగా తమకు పుట్టిన కుమారునికి 'తారకుడు' అని నామకరణం చేసి అల్లారుముద్దుగా

పెంచు కోసాగారు. దినదినాభివృద్ధి చెందిన తారకుడు తండ్రిని మించిన వీరుడయ్యాడు. ఒకనాడు స్వర్గంపై దండెత్తి ఆక్రమించుకున్నాడు. ఇందుకు తారకాసురునికి కాలనేమి, జంబాసురుడు, అనుచరులు సహాయంగా నిలిచారు. ఒక్క దేవతలు మాత్రమే కాదు, సాక్షాత్తు విష్ణు భగవానుడు కూడా ఇది సరైన సమయం కాదని తప్పుకున్నాడు. తారకాసురుని అనుచరుడు జంబాసురుడు ఇంద్రుని కవ్వించగా మహేశ్వరుని ప్రార్థించిన దేవేంద్రుడు ఒకే ఒక బాణంతో ఆ రక్కసుని నేలకూల్చాడు. అనుచరుని మరణ వార్తను విన్న తారకాసురుడు ఇంద్రుని పైకి దండెత్తగా వీరభద్రుడు అడ్డుకున్నాడు. తారకుని వక్షస్థలంపై త్రిశూలంతో పొడవగా తారకాసురుడు మూర్ఛపోయాడు. కాసేపటికి తెప్పరిల్లిన తారకుడు ఒక్కొక్క దేవతకు ఒక్కోరూపంగా కనిపిస్తూ యుద్ధం చేయసాగాడు. అతని ధాటికి దేవతలు నిలవలేకపోయారు.

మహేశ్వరుని అండ దేవతలకు ఉందని గ్రహించిన తారకుడు హిమవత్పర్వతానికి వెళ్ళి ఈశ్వరుని గురించి తపస్సు చేస్తూ కొంతకాలం ఒక్క కాలు మీద నిలబడి ఊర్ధ్వబాహుడై ఆకాశాన్ని చూస్తూ, మరికొంతకాలం పంచాగ్ని మధ్య నిలబడి ఘోరంగా తపస్సు చేయగా, అతని తపస్సుకు మెచ్చిన మహేశ్వరుడు ప్రత్యక్షమై "ఓ తారకాసురా! నీకు కావలసిన వరాలను అడగమనగా తారకుడు పరమేశ్వరుని పరి పరి విధాల ప్రార్థించి ఓ ఈశ్వరా! నీ కుమారుని వలన నాకు మృత్యువు లేకుండునటుల వరమును ఇచ్చి నీవు లింగరూపమును దాల్చి నా వలన పూజాదులను పొందుతూ నన్ను కాపాడుచుండుమని కోరెను. అంత పరమేశ్వరుడు తారకుడు కోరిన వరముల నిచ్చి, తాను ఆత్మలింగరూపమున నిలిచి, ఆ లిందమును సదా పూజించుచుండుమని చెప్పి తాను స్థాణ్వాశ్రమమునకు వెళ్ళి తపస్సు చేసుకొనుచుండెను.

వర గర్వితుడైన తారకుడు దేవతలను, మునులను, ప్రజలను బాధించుచుండెను. దేవతలంతా బ్రహ్మ వద్దకు వెళ్ళి తమ గోదుని వెళ్ళబోసుకున్నారు. అప్పుడు బ్రహ్మ "మహేశ్వరుడు తపస్సు చేసుకుంటున్నాడు. హిమవంతుని కుమార్తె అయిన పార్వతి శివునికి శుశ్రూషలు చేస్తోంది. శివపార్వతులకు పుట్టే బిడ్డ తారకాసురుణ్ణి సంహరిస్తాడు. కావున శివుడు తపస్సు విరమించేటట్లు చేయండి. పార్వతిని శివుడు వివాహం చేసుకునే మార్గం చూడండ"ని చెపుతాడు. దేవేంద్రాదులు సంతోషాన్ని పొంది మన్మథుణ్ణి రప్పించి "మన్మథా! నీవు ఈశ్వరుని పుష్పబాణాల చేత తాకించి, మోహాన్ని కలిగింప చేయండి. పార్వతిని శివుడు వివాహం చేసుకొనునటుల చేయమని ప్రార్థించారు. మన్మథుడు కాలగతులను విచారించక, దేవేంద్రాదులు చెప్పిన మాటలకు సంతోషాన్ని పొంది మనో గర్వముతో పార్వతి శివునికి సపర్యలు చేయు సమయాన శివుని హృదయమునందు నాటుకొనునటుల పంచబాణములను గురి చూసి కొట్టెను. మన్మథుని బాణ తాకిడికి తపమునకు భంగము కలుగగా కోపము గలవాడై మూడవ నేత్రమును తెరిచెను. ఈశ్వరుని మూడవ నేత్రము నుండి వెలువడిన అగ్నిజ్వాలలు లత, గుల్మ, వృక్షాదుల సహితంగా మన్మథుడు భస్మమయ్యాడు. మన్మథుని భార్య రతీదేవి వసంతాదుల వలన వార్త విని ఈశ్వరుని పతి భిక్ష పెట్టమని ప్రార్థించింది. ఈశ్వరుడు ఆమె ప్రార్థనను మన్నించి లోకులకు అశరీరుడుగను, ఆమెకు సశరీరుడుగానే కనపడేటట్లు వరమొసగాడు. ఆ తరువాత పరమేశ్వరుడు తారకాసుర వధ కోసం పార్వతిని వివాహమాడాడు.

ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు ఏకాంత మందిరంలో ఉండగా అగ్ని పావురం రూపంలో అభ్యంతర మందిరం లోనికి ప్రవేశిస్తాడు. అది గ్రహించిన శివుడు తన దివ్య తేజస్సును ఆ అగ్నిహోత్రుని లోకి ప్రవేశపెడతాడు. ఆ శివ తేజాన్ని భరించలేక అగ్నిదేవుడు ఆ తేజస్సును భూమికి ప్రసాదించాడు. భూదేవి ఆ తేజస్సును మోయలేక వాయుదేవునికి ప్రసాదిస్తుంది. వాయుదేవుడు ఆ తేజస్సుని భరించలేక గంగానదిలో ప్రవేశపెట్టాడు. గంగ సైతం భరించలేక రెల్లుపొదల్లో (శరవణ) విడిచిపెట్టగా ఆరు ముఖాలు కల బాలుడు ఉదయించాడు. ఆరుగురు కృత్తికలు ఆ బాలునికి పాలిచ్చి పెంచారు. కృత్తికలు పెంచి పోషించుట చేత కార్తికేయుడు అయ్యాడు. రెల్లుపొదలలో నుంచి ఉద్భవించుట చేత స్కందుడయ్యాడు. తేజఃపుంజంగా కనిపిస్తూ చీకటిని హరించుట చేత గుహుడయ్యాడు. బ్రహ్మ జ్ఞానాన్ని సంపూర్ణంగా అందించే వాడు కాబట్టి సుబ్రహ్మణ్యుడని పేరు ఏర్పడింది. ఆరు ముఖాలు కలవాడు కాబట్టి షణ్ముఖుడయ్యాడు. మానవదేహంలోని కుండలినీశక్తిని జాగృతం చేయడానికి సుబ్రహ్మణ్యుని ఆరాధిస్తారు. వ్యక్త అవ్యక్త తత్వాలకు ఉమామహేశ్వరులు ప్రతీకలు. వీరిరువురి సమన్వయ తత్వమే కుమారస్వామి అని స్కాంద పురాణం చెబుతోంది.

సుబ్రహ్మణ్యుని జన్మ తిథి షష్ఠి. తల్లి పార్వతీదేవి తనయునికి శక్తి ఆయుధాన్నిచ్చి సర్వశక్తిమంతుణ్ణి చేసింది. కార్తికేయుడు దినదినాభివృద్ధి గాంచుతూ శుక్లపక్ష చంద్రుని వలె పెరగసాగాడు. యుక్త వయస్సునకు రాగానే పార్వతీ పరమేశ్వరులు ఉపనయనం గావించి దేవసేనకు ఆధిపత్యం ఇచ్చారు. ఇతని చేత ధరింపబడిన శక్తి ఆయుధం ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులరూపం. అంతట స్వామి నెమలి వాహనుడై ఆరు ముఖాలతో, పన్నెండు చేతులతో విరాజిల్లాడు. ఆ సమయంలో శివుడు కుమారుని దగ్గరకు పిలిచి "కుమారా! దేవగణాలకు అధిపతివై ప్రతి సమరంలో నీవే గెలుపొందాలని నా కోరిక. నీ శౌర్య ప్రతాపాలతో దేవతలకు ఎదురవుతున్న రాక్షసపీడను వదిలించు.

మూడు లోకాలందు న్న వారిని కాపాడవలసిన బాధ్యత నీది. దుర్మార్గులను శిక్షించి, సన్మార్గులను రక్షించు. ముల్లోకవాసుల పూజలందుకొని వారికి శుభాలను ప్రసాదించు. యజ్ఞ యాగాది క్రతువులకు విఘ్నం కలిగించే వారిని అంతమొందించు. వర గర్వంతో తారకాసురుడు విర్రవీగుతున్నాడు. రుద్ర, వీరభద్ర గణములను, దేవసైన్యములను వెంటబెట్టుకొని శోణీపురాన్ని ముట్టడించి, విజయాన్ని సాధించి దేవతల భద్రతను కాపాడి శాంతిని ప్రసాదించు''మని ఆదేశించాడు.

కుమారస్వామి దేవతాది గణములను వెంటబెట్టుకొని రథ, గజ, తురగ, పదాదులతో వచ్చి శోణీపురమును ముట్టడించి రణభేరిని మోగించాడు. తారకుడు చతురంగ బలములను వెంటబెట్టుకొని వచ్చి తానూ రణభేరిని మోగించాడు.కార్తికేయుడు నారాయణాస్త్రాన్ని సమంత్రకంగా వింట సంధించి పార్వతీ పరమేశ్వరులను ధ్యానించి సంధించగా తారకుని కంఠమందలి శివలింగం అయిదు ముక్కలుగా అయి ఓంకారాన్న జపిస్తూ పలు ప్రదేశములలో భూమి మీద పడింది. కుమారస్వామి రౌద్రాకారం దాల్చి బ్రహ్మాస్త్రాన్ని సంధించి తారకుని సంహరించాడు. తారకుని మరణానంతరం పంచభూతాలూ సంతసించాయి. పుష్పవర్షం కురిపించాయి. దేవదుందుభులు మ్రోగాయి.


తారకాసుర సంహార సమయంలోనే స్వామి సర్పరూపాన్ని ధరించాడని పురాణ కథనం. సుబ్రహ్మణ్య ఆరాధనను యోగులు కుండలినీ శక్తి సాధనకు ప్రతీకగా భావిస్తారు. మూలాధార చక్రంలో మూడున్నర చుట్టలుగా మొదలయ్యే కుండలిని కనుబొమల మధ్యన ఆజ్ఞాచక్రంలో శిరస్సును కలిగి ఉంటుంది. ఆ ఆజ్ఞా చక్రం మూడు నాడుల కలయిక. ఎడమ, కుడి నాసికా రంధ్రాలకు ఇడా, పింగళ నాడులని పేరు. వీటిలో వెన్నెములోని సుషుమ్నానాడి జతపడే ప్రదేశం కనుబొమల మధ్యనున్న ఆజ్ఞాచక్రం. దీనికే బ్రహ్మగ్రంధి అని పేరు. సరస్వతీ స్థానం జ్ఞాన యోగాన్ని కలిగించేది. సుషుమ్నకు కుమారస్వామి అధిదైవతం. కుండలినీశక్తిని జాగృతం చేయడానికి కీలకమైనది. సుషుమ్న, దాని రూపమే సర్పం అయినప్పుడు కుండలినీ ఆరాధన చేయాలనుకునే వారికి ఏకైక మార్గం సుబ్రహ్మణ్యుని పూజించడం. అందువలననే హిందూ సంప్రదాయంలో కుమారస్వామి ఆరాధన విశిష్టతను పొందింది.

సుబ్రహ్మణ్య షష్ఠినాడు బ్రాహ్మీ ముహూర్తంలో లేచి, తలంటు స్నానం చేసి పూజా మందిరాన్ని అలంకరించి వెండితో కానీ, రాగితో కానీ చేసిన పడగలతో కూడిన విగ్రహాన్ని తమలపాకులలో ఉంచి షోడశోపచారాలతో, అష్టోత్తరాలతో పూజచేసి సుబ్రహ్మణ్యుని పాలతో (ఆవు) అభిషేకించి, తీర్థం పుచ్చుకుని మధుర ఫలాలను నైవేద్యం పెట్టాలి.

దేవాలయానికి వెళ్ళి స్వామిని దర్శించి రావాలి. పుట్ట వద్దకు వెళ్ళి పాలను పోసి పుట్టను పసుపు కుంకుమలతో పూజించి కుంకుమబొట్టు పెట్టి హారతిని ఇవ్వాలి. సంతానం కోసం, స్వామిని అభిషేకించి అర్చిస్తే వారి కోరికలను తీరుస్తాడు. రావి, మర్రి చెట్టు కింద ప్రతిష్ఠించిన సర్పదేవతలకు క్షీరాభిషేకాలు, పూజలు చేస్తే అనారోగ్యాల నుంచి, చర్మరోగాల నుంచి విముక్తిని పొందుతారు. షష్ఠినాడు ఆవునెయ్యి దానం చేస్తే గోలోక నివాసం నందలి సౌఖ్యాలు లభిస్తాయి. సప్తమినాడు విప్రులకు అన్నదానం చేస్తే జీవితంలో ఏనాడూ అన్నపానాదులకు లోటుండదు.

**"శ్రీ కార్తికేయ కరుణామృత పూర్ణ దృష్ట్యా**
**కామాదిరోగ కలుషీకృత దుష్టచిత్తం**
**సిక్త్వాతు మా మమ కళాధర కాంత కాంత్యా**
**వల్లీ సనాథ మమ దేహి కరావలంబమ్"**

***



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా**

## గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు

### 72వ కళ్యాణం

తేది 03-11-2024, ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, మంజీరా పైప్ లైన్ రోడ్, హఫీజ్ పేట, హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ బాదం నరసింహారావు మరియు సీనియర్ సిటిజన్ గ్రూప్ నిర్వహించారు.

### 73వ కళ్యాణం

తేది 20-11-2024 బుధవారం నాడు జరిగింది. ఇది ఇంటినెం.18-01-297/107,శివాజీనగర్,ఉప్పుగూడ, హైదరాబాద్ లో శ్రీమాన్ దాలికె శివకుమార్ గుప్తా, వాసవి దంపతులు నిర్వహించారు.వైఖానసాగమోక్తంగా జరిగింది.

# విష్ణుచిత్తుల వారి విశిష్ట విష్ణు భక్తి


– డా|| కూర్మాచలం శంకరస్వామి, 9703268858

"శ్రీనయన కువల యుగళా – మాన జ్యోత్స్నా యిత స్మితోజ్జ్వల ముఖ ధై
త్యానీతి సురశ్రీ పున – రా నయన క్రమణ! వేంకటాచల రమణా!

కేరళదేశపు తూర్పుభాగంలో కల దక్షిణ సముద్ర తీరాన పాండ్య దేశము కలదు. అందులో ధన్విపురము (విల్లిపుత్తూరు) అనే ఒక దివ్యపట్టణము కలదు. ఆ నగర వైభవాన్ని గురించి శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో ఇలా వర్ణించాడు.

"లలితోద్యాన పరంపరా పిక శుకాలాప ప్రతిధ్వానము
ల్వలభీనిల హరిర్మణీపిక శుక స్వాన భ్రమంబూన్ప మి
న్నులతో రాయ సువర్ణ సౌధముల నెందుం జూడ జెన్నొంది శ్రీ
విలుబుత్తూరు చెలంగు పాండ్యనగరోర్వి రత్నసీమంతమై"

పాండ్యదేశము నందలి భూమి యనెడు నాతికి పాపటి బొట్టువోలె ఒప్పారుచున్న శ్రీవిలుపుత్తూరు సమీపంలో ఉన్న ఉద్యానములలోని కోయిలలు, చిలుకలు కూయుచుండగా ఆ ప్రక్కనే యున్న పెద్ద పెద్ద మేడలు ప్రతిధ్వనులు చేయంగ ఆ పట్టణ వీధులలో వెళ్ళే మార్గస్తులు తలలెత్తి చూడగా అత్యున్నతములైన మేడల యొక్క వాచూరుతి యందు నీలములతో చెక్కబడియున్న కోయిలలునూ, మరకతములతో చెక్కబడిన చిలుకలునూ, కానరాగా ఈ పక్షులే ఆ ధ్వనులు చేయుచున్నవా అన్నట్లు ఉన్నాయి. అంతేకాదు ఆ పట్టణానికి నలుదిక్కులా రకరకాల పండ్ల తోటలు, వివిధ రకాల సుగంధభరిత పూలవనాలు, ఆ వనాల నుండి వీచే గాలి ఆ పట్టణంలోని ఆలయగోపురంపై బడి అచ్చటి గంటలు మ్రోగేటట్లు చేసేవని ఉపమ, ఉత్ప్రేక్ష, రూపక, భ్రాంతిమత అలంకారాలతో పోల్చి వర్ణించాడు. కృష్ణరాయలు ఆ పట్టణం లోని ద్రవిడ కన్యలు పసుపు సుగంధాలద్దిన సరస్సులలో స్నానమాచరించి ద్రవిడ కీర్తనలు పాడుకుంటూ కడవలతో నీళ్ళు తెచ్చుకునేవారని, అక్కడి భాగవతులు అతిథులకు ఎదురేగి వారికి పాదపూజలు చేసి మంచి మంచి భోజనాలు ఏర్పాటు చేసి తరించేవారు.



అటువంటి దివ్య పట్టణంలో శ్రీమన్నారాయణుడు పాల సముద్రమును విడిచి వటపత్రశాయిగా నివాసం ఏర్పరచుకోగా సప్తసముద్రములు కూడ అచ్చటికే వచ్చి అది సప్తసాగరముగా ప్రసిద్ధి పొందింది. బ్రహ్మాది దేవతలు, నారదాది మహర్షులు ఏతెంచి భగవద్దర్శనం, కైంకర్యాది సేవలు చేస్తూ అచ్చటనే కొలువుదీరి ఉండెడివారు. చతుర్వేత్తలగు బ్రాహ్మణోత్తములు కూడా అధిక సంఖ్యలో ఉండి పరమాత్ముని సేవలో తరించేవారు.

ఆ పట్టణములోని భాగవతోత్తములలో శాలావృత గోత్రజులు, బోధాయన సూత్రులు, యజుశ్శాఖీయులు, పురశ్శా (ముందుకు జుట్టు ముడి వేసుకునేవారు), సదాచారశీలురగు ముకుందాచార్యులనే భాగవతోత్తములు ఉండేవారు. వీరు సంతానము కొరకై తమ ధర్మపత్నియగు పద్మావతి యను సాధ్వీమణితో కూడి వటపత్రశాయిని ప్రార్థించగా వారికి ఆ భగవంతుని అనుగ్రహంతో గరుత్మంతుని అంశ వలన ఒక బాలుడు జన్మించాడు. ఆ బాలుడు కలియుగమున 47వ క్రోధి నామ సంవత్సరం గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠమాసము, శుక్లపక్ష ఏకాదశి భానువారము, మిధునరాశి, స్వాతి నక్షత్రమున సకల గుణపూర్ణుడుగ జన్మించుట చేత తల్లితండ్రులు ఆ కుమారునికి "విష్ణుచిత్తుడ"ని నామకరణం చేసి సకల సంస్కారాలు

సకాలంలో జరిపించారు. వైకుంఠమునుండి స్వయంగా శ్రీ విష్వక్సేనులవారే వచ్చి పంచ సంస్కారాలు గావించారు.

విష్ణుచిత్తులు తమ తర్వాత కలిగిన నలుగురు సోదరుల కన్న మిక్కిలి తేజోవంతులై శ్రీమన్నారాయణుని నిర్హేతుక కటాక్షముల చేత ప్రహ్లాదుని వలె సహజమైన విష్ణుదాస్యం కలవాడై అన్ని కైంకర్యముల కన్నను పుష్పసమర్పణము మిక్కిలి ప్రీతికరమని తలచి ఒక పెద్ద పుష్పవనమును ఏర్పాటు చేసి, అందులో నానావిధ పుష్పజాతులను, వాటితో పాటు తులసి మొక్కలను పెంచి మిక్కిలి శ్రద్ధాభక్తులతో ఆ పుష్పాలను తెచ్చి, సుగంధములైన తులసీ మాలికలను మాలగా కూర్చి అనునిత్యము సభక్తిపూర్వకముగా ఆ వటపత్రశాయికి సమర్పించుచుండెడివాడు. విల్లిపుత్తూరులోని భాగవతోత్తములకన్న గొప్పవాడుగా ప్రసిద్ధి గాంచాడు.

**"అందుండు ద్వయ సద్మ పద్మ వదనుండ ద్వంద్వుడ శ్రాంత యోగ**
**గాంధూబద్ధ మధు ద్విషద్ద్విరడు దన్వర్థాభిధాముండు రు**
**చ్ఛందో బృంద తదంత వాగ పఠనా సంజాత తజ్జిధ్వని**
**ష్టందద్వైతసం సంవిధాలయుడు నిష్ఠద్విష్ణుచిత్తుండనన్"**

నిరందరం ద్వయమంత్రాన్ని అనుసంధానం చేయుచు సుఖ దుఃఖములు, శీతోష్ణములు సరిగా తలచుచు తన నిరంతర యోగము చేత శ్రీపతిని వశపరచుకొని వేద వేదాంతములు చదవకుండానే వాటివలన కలగవలసిన నిశ్చల ద్వైతజ్ఞానమునకు తాను నివాస భూమియై విష్ణుచిత్తుడు పేరుకు తగినవాడుగా ఉన్నాడు. న్యాయంగా సంపాదించిన డబ్బుతో హిమాలయాల నుండి వచ్చిపోయే సాధువులకు భోజనాలు పెట్టేవాడు. అంతేకాదు ప్రతి శనివారము నాడు తన ఇంటిలో పగటి పూటలందే కాక రాత్రులందు కూడా శేషశాయి పుణ్యకథలు చెప్పడం, ప్రబంధ పఠనం గావించడం జరిగేది.

ఆ ధన్విపురానికి 5 యోజనముల దూరంలో మధురా పట్టణమును వల్లవ దేవరాయలను పాండ్యరాజు ధార్మికముగా రాజ్యమును పాలించుచుండెను. ఇతనికి మత్స్యధ్వజుడు అనే మరో పేరు కూడాకలదు. మేరుపర్వతమందు తన గెలుపు కథలను వ్రాసినవాడై వాసవుని కిరీటమును నుగ్గు నుగ్గు గావించునట్టి శరసమూహము గలవాడై, భూతములను తన మంత్రశక్తిచే వశపరచుకొనుట వలన అవి తనను సేవించుచుండ రెండవ రుద్రుని వలె ఉండెడివాడు. సామాధ్యుపాయములందునూ, సంధి విగ్రహాది షాడ్గుణ్య విచారణ యందును, అతి కుశలుడై, విలాస కాలంబుల యందు మలయ పర్వతమునందే విహరించుచు అసంఖ్యములైన ఏనుగులు కలవాడై, సముద్ర బంధనము చేసినవాడై, శుద్ధోదకములగు తామ్రపర్ణియందు క్రీడించువాడై, విభీషణునితో చెలిమి చేసి అతని కోరికలను తీర్చువాడై, నిత్యము అగస్త్య మహర్షి ఆశీస్సులు పొందువాడై ప్రజలను కంటికి రెప్పలాగా చూసుకొనేవాడు మత్స్యధ్వజుడు.

**"స్వస్తి కృద్వాస వస్తుత్యగస్తి మఘన**
**మకుట మోటన శరకోటి భృత్య**
**భూత భూతాత్త శాంభవ భూమికుండు**
**దత్పురంబేలు బాంధ్య మత్స్యధ్వజుడు"**

అంతేకాదు, ఆ రాజు ప్రజలను బాధలకు గురిచేసి పన్నులు వసూలు చేసేవాడు కాదు. చెప్పుడు మాటలు విని తప్పుడు తీర్పులిచ్చేవాడు కాదు. తనకు పరాక్రమము ఎంత ఉన్నా రవ్వంత కూడా గర్వించేవాడు కాదు. స్తోత్రములకు పొంగిపోయేవాడు కాదు. నీతి, నియమాలు తప్పకుండా సకల సుగుణాలు కలిగి చంద్ర వంశమునకు భూషణ ప్రాయుడై వెలుగొందుచుండెను.

ఎంతటి ఉత్తమ గుణములున్నప్పటికీ పూర్వజన్మ కర్మవశమున చిత్త చాపల్యము కలుగుట సహజము. అలాగే ఈ మత్స్యధ్వజ మహారాజుకు కూడా భోగాసక్తుడై తన నగరంలోని భోగిని కడకు వెళ్ళుచుండగా ఒక బ్రాహ్మణ వీధిలో ఒక అరుగుపై ఒక పరదేశి బ్రాహ్మణుడు ఆతిథ్యం స్వీకరించి నీతిశ్లోక పారాయణం ఇలా చేస్తున్నాడు.

**"వినియె నెలల్చతుర్ద్వయిని వృష్టి దినాళికి రాత్రికి దినం**
**బున జరికై వయస్సునను బూని పరంబునకిప్పడుద్యమం**
**బనువున జేయగా వలయునంచు బురోహిత ధర్మమాత్మ గీ**
**ల్కొననల విప్రుడాద్విజులలో సుభాషితముల్పఠింపగన్"**

వర్షార్థ మష్టా ప్రయతేత మాసాన్నిశార్థ మర్థం దివసే యతేత వార్ధక్య హేతోర్వయసానేన పరత్రహేతోరిహ జన్మనాచ" అనే శ్లోకాన్ని పఠించుచుండెను. దీని అర్థమేమనగా వర్షాకాలములో నాలుగు మాసములకు సరిపడ వస్తుసామగ్రిని మిగతా ఎనిమిది మాసాలలో సమకూర్చుకొనవలెను. అలాగే రాత్రి సుఖము కొరకు పగటిపూట, ముసలితనములో సౌఖ్యము కొరకు వయస్సులో కష్టపడాలి. అలాగే పరలోకంలో సుఖము కొరకు ఇహలోకంలోనే సత్కర్మలను ఆచరించాలి. అనగా పరలోక ప్రాప్తికై శరీరం ఉన్నప్పుడే జాగ్రత్తపడాలని ఆ శ్లోకం యొక్క పరమార్థం. అది విని ఆ రాజు భోగినీ గృహమునకు వెళ్ళకుండా తిరిగి అంతఃపురమునకు వెళ్ళి ఇంతకాలము పరలోకము గురించి ఆలోచించకుండా భౌతిక సుఖముల మాయలో బ్రతికానని ఎంతగానో చింతించి ఆ మరునాడు తన పురోహితులు, మంత్రియగు సెల్వనంబిని రావించి మోక్షోపాయమును తెలుపుమని కోరెను. అంతట అతడు ఓ రాజా ఈ విషయము శాస్త్రజ్ఞాన పూర్తియు, శిష్టాచార సంపత్తి గల పండితోత్తములచే నిర్ణయింపబడినదగుట చేత దేశ దేశములందు గల పండితోత్తములను రావించి వారి ద్వారా తెలుసుకోవడం ఉత్తమమని పల్కెను.

అంతట ఆ రాజు ఒక శుభముహూర్త దినమున నానా దేశ పండితులను ఆహ్వానించి ఒక సభను ఏర్పాటు చేసి మోక్షప్రదాత యగు కారణత్వ (పరతత్వ) నిర్ణయమొనర్చుడని, ఆ విధంగా

సి ద్ధాంతమొనర్చినవారికి బహుమానముగా విద్యాశుల్కము చాలా ధనమును తోరణ స్తంభమున గట్టించెను.

**"వాద మొనరించి గెలిచి తత్త్వంబు దెలుపు**
**వానికని బీరపువ్వుల బోని టంక**
**సాల వాటులు నించి యాస్థాని గట్ట**
**గాల సర్వము గతి వ్రేలు జాలె జూచి"**

ఆస్థానమందు ఆ పాండ్యరాజు ఆ పాండ్యరాజు కూర్చుండి యున్నవాడై అనేక శాస్త్ర సిద్ధాంతములు తెలిసికొనియున్న పండితోత్తముల రావించి వారిని జూచి మీమీ శాస్త్రముల యందు చక్కగా విచారించి మోక్షప్రదుండైన దేవుడు ఎవ్వడో తెలిసి ఈ బహుమానం పొందవలసిందని రాజు పండితులను కోరారు. అప్పుడు ఆ సభలోని కొందరు విద్వాంసులు శివుడు మోక్షప్రదాత యని నిర్ణయించగా, మరికొంతమంది శక్తియనగా, ఇంకొందరు ఇంద్రుడని, కొందరు అగ్నిదేవుడని, కొందరు సూర్యుడని, నిశాపతి యని, చంద్రుడని, బ్రహ్మదేవుడని వాదనలు వినిపించారే గాని నిజమైన మోక్షప్రదాత ఇతడని ఎవరూ నిర్ధారించలేకపోయారు. అదే సమయంలో శ్రీవిల్లిపుత్తూరులో ఉన్న విష్ణుచిత్తుడు మన్ననార్ స్వామికి భక్తి శ్రద్ధలతో పూజిస్తున్న సమయంలో ఆ ఆలయంలోని స్వామి ప్రత్యక్షమై విష్ణుచిత్తునితో ఇలా అన్నాడు.

**"నేడు మహామతీ మధుర! నీవు రయంబున జొచ్చియందు బాం**
**డిడు దివాణమున్నెఱయనించిన బ్రేలెడు దుర్మదాంధులన్**
**బొడిమి మాన్చి మన్మహిమము బ్రకటించి హరింపు శుల్కమున్**
**వాడును రోసినాడిహము వైష్ణవుగా నొనరింపు సత్కృపన్"**

మహాబుద్ధిశాలివగు ఓ విష్ణుచిత్తుడా! నేటి దినమున నీవు అతి వేగముగా మధురానగరానికి వెళ్ళి పాండ్యరాజు కొలువులో నానా విధములుగా వాదిస్తున్న దుర్మార్గపు పండితులకు నా మహిమను తెలిపి వాదనలో గెలిచి వారు ప్రకటించిన ద్రవ్యమును గ్రహించి, ఆ పాండ్యరాజును వైష్ణవుని గావింపుమని మన్నారు స్వామి పలుకగా, ఓ స్వామీ! చదువు సంధ్యలు, శాస్త్రజ్ఞానము లేని అజ్ఞానిని, పైగా పూలతోటలకు పాదులు త్రవ్వటం చేత నా చేతులు కాయలు కాసినవి. మీ కోవెలకు దాసుడనైన నన్ను పండితుల సభకు పంపుట న్యాయమా యని విష్ణుచిత్తుడు వినమ్రముగా పలికెను.

**"నీ యిచ్చయే మిన్నక పో**
**వోయి ముని ప్రవర నిన్ను నొప్పింతునే భూ**
**నాయక సభ నిందులకై**
**మేయడ్డము వలవ దవల నేనున్నాడన్"**

స్వామివారి అభయముతో విష్ణుచిత్తుడు మారు మాట్లాడకుండా మధురానగరానికి వెళ్ళాడు. మూర్తీభవించిన అతని తేజస్సుకు రాజభటులు అడ్డు చెప్పకుండా రాజసభలోకి అనుమతించారు. అంతేకాదు రాజుతో సహా అక్కడి పండితులు కూడా లేచి నిలబడి స్వాగతం పలికి ఉచిత ఆసనముపై కూర్చుండబెట్టి అతిథి పూజలు చేశారు. చిత్తవృత్తి యందు శ్రీహరి విహరింపగా ప్రసంగించవలసిందిగా పండితులను కోరాడు విష్ణుచిత్తుడు. వారు వచించిన కొన్ని మాటలను విని ఆ పండితుల యొక్క బుద్ధిని తెలుసుకొని ఒక చిరునవ్వు నవ్వి రాజు యొక్క ముఖము జూచి మీరు మధ్యవర్తులుగా నున్నవేళ మేము కొన్ని యుక్తులు చెప్పెదమని రాజు అనుమతి పొంది తన వాదనలు ప్రారంభించాడు విష్ణుచిత్తుడు. ఒక్కొక్కరి వాదనలకు శాస్త్ర సమ్మతంగా సమాధానమిస్తూ సున్నితంగా హెచ్చరిస్తూ ఆ వాదనలలో గెలిచి, ఓడిన వారిని దయతో అనుగ్రహించాడు విష్ణుచిత్తుడు.

**"నీవేమంటివి? రమ్ము**
**చావలివానికిని మగిడి యట్లనె వానిం**
**గావించి యొకడొకడు రా**
**నా విప్రుండు వాదసరణి నందరఁటి గెలిచెన్"**


విద్వాంసులచే నమస్కరింపబడు ఆ విష్ణుచిత్తుడు జ్ఞాన స్వరూపమున, సుఖ స్వరూపమునైన పరబ్రహ్మ యొక్క బోధను ప్రకటింపజేయునట్టి బ్రహ్మసూత్రముల చేతను, ప్రమాణముల చేతను, వేదముల చేతను, ఈశ్వరుని నిరూపించి, సిద్ధాంతం చేసి, ఆ పిమ్మట ఈశ్వరునికి వ్యాపకత్వమును, తదితర దేవతలకు వ్యాపకత్వమును, విశిష్టాద్వైతంబును ప్రమాణము చేత ప్రత్యక్షమగునటుల వాదనలు వినిపించాడు. సృష్టి ఆదియందు శ్రీమన్నారాయణుండు ఒక్కడే చేసి ఏకాకిత విలాసమునకు యుక్తముగా అనేక రూపంబుల బొందెదనని సంకల్పించి చిన చిద్ద్వయాత్మకంబైన ప్రపంచమందు తాను ప్రవేశించి బహురూపముల దారి అయ్యాడని ఛాందోగ్యోపనిషత్తు బోధిస్తుందని అంతరాదిత్య విద్యయందు సూర్యునియందున్న పుండరీకాంక్షుండు నారాయణుండనుటకు నక్షిణియను ద్వివచనము ముఖ్యసాధకంబనియు బ్రహ్మ రుద్రేంద్రాదులలో నెవ్వడు కాదనుటకు నా శ్రుతియే వైలక్షణ్యమును తెలుపుచున్నది.

**"తుల లేకుండు స్వరూప రూపగుణ భూతుల్దోచునే తచ్చ? తిం**
**ద్లమైలో వెలిదానెయున్కి దెలివిన్నారాయణం బారుణం**
**బుల సామాన్య విశేష రీతి నిఖిలంబు న్శబ్ద జాలంబు ని**
**ర్మల నారాయణ శబ్దమందునె తుదన్సర్వాప్తమయ్యె న్శ్రుతిన్"**

సాదృశ్యము లేనట్టి శ్రీహరి యొక్క దివ్య స్వరూప దివ్య విగ్రహానంత కళ్యాణ గుణ దివ్య ఐశ్వర్యములు నీ శృతి యందు స్పష్టమగుచున్నవనియు, నారాయణుండె సర్వాంతర్బహిర్వ్యాపకుడై యున్నవాడని తైత్తరీయస్థమైన నారాయణమను నైదవపన్నము తెలుపుచున్నదనియు నారాయణంబులందు సామాన్య విశేష న్యాయము చేత బ్రహ్మేంద్రాది సకల శబ్దములును మదను నారాయణ

శబ్దమందె పర్యవసన్నము లాయెనని 'లవహత' పాప్మే త్యాది శ్రుతి వాక్య ముల మీద కుదురైయున్న ఆ నారాయణ పదమే శ్రీమన్నారాయణుని కంటె పరంబుగ ఏ దైవమును లేదని నిస్సందేహమగునటుల భ్రమాత్మక జ్ఞాన జన్య నివాసమును విష్ణుచిత్తుడు పండితుల సభలో తీర్మానం చేశాడు. దానికి కొన్ని ఉపమానాలను కూడా పండితులకు బోధపడునట్లు ఈ విధంగా వివరించాడు.

పూర్వకాలమున పరశురామునకు వెరచి వైరాగ్యమునొందినట్టి దివోవాసాత్మజుండైన ప్రతర్ధనుండనువాడు మోక్షేచ్ఛ గలవాడై జనార్ధనునిం ఇంద్రునారాధింప, అతడు ప్రత్యక్షమై తనను ఉపాసన సేయుమనగా మదంతర్యామి ఉపాసన సేయుమన్నట్టి అర్థము ఊహింపబడియె. ఎట్లనగా ముందు గర్భమునందుండియు తపంబునందు ఈశ్వరునితో తుల్యుండగు వామదేవుండను ముని, సూర్యుడు నేను చంద్రుడు నేనగ్నియు నేనను శరీర వాచక శబ్దము శరీరి పర్యంతము పోవుట చేత ఉభయ శరీరకుండైన పరమాత్ముం గూర్చి అనుసంధాన మొనర్చెనని తెలిపి జీవుడైన తాను ఉపాస్యుండను కానని జ్ఞాన వృద్ధుండగు నింద్రుడు దదనుసంధాన న్యాయంబున ఉపదేశించెనని వేదవ్యాస సూత్ర వేదాంత శాస్త్రములందు వివరింపబడినదని, బ్రహ్మ, శివుడు, భూమి మొదలగు పంచభూతములు కాల మృత్యు ప్రభృతి నిఖిలంబగు చిద చిద్రూపంబులు అతని శరీరంబులని, శుద్ధంబగు నారాయణ స్వరూపమును దక్క మరొక స్వరూపమును భజింపగూడదనియు, బ్రహ్మాదులను ధర్మార్థ కామ కాంక్షులు ఉపాసన చేయుదురు గాని మోక్షార్థులుఉపాసన చేయరని స్మృతులు తెలపుచున్నవని, జీవేశ్వరులకు నిత్య సంబంధమనియు మాతా పితా భ్రాతా వాస శ్శరణం సుహృద్గతి నారాయణుడేనని, పరమేశ్వరుని కనుటకు సాధకంబైన యోగంబు కలదని దానికి ఉపమానంగా ''ఖాండిక్య కేసిధ్వజ'' సంవాదమును వివరించాడు విష్ణుచిత్తుడు. ఆ వాదనలు సత్యమే అన్నట్లు స్తంభమునకు కట్టిన రాణి వరాలమూట నేలపై పడింది.



**"బలిమి ద్రెంపగ బోలె బాయపడుచుం బర్యాయ భంగంబునన్**
**గల నూలెల్లను నంచు మోన దెగిరాగా గొంతసేపుండి తా**
**బెలుచున్నంటు పుటుక్కునం దునిసి వే పృథ్వింబడె న్జాలె మి**
**న్నుల మ్రోసె స్సుర దుందుభల్గురినె బెన్పోన్నై విరుల్బోరనన్"**

విష్ణుచిత్తుడు ఆ శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో రాజు సభలో పరతత్త్వ నిరూపణము సేయగా అంతకుముందు విద్యాశుల్కముగా వ్రేల గట్టియున్న వరహాల సంచికి చుట్టియున్న సూత్రమందలి నూలంతా తనకు తానే అంచువరకు తెగి పుటుక్కుమనే ధ్వని చేయుచూ సూత్రము ముడి తునిసి జాలె కిందబడెననియు, ఆ పరతత్త్వ నిర్ణయమునకు దేవతలు సంతసించి దుందుభులు మ్రోయించి పుష్పవర్షం కురిపించారు. ఈ పరిణామాలను గమనించిన రాజు ఎంతగానో సంతోషించి జాలె లోని బహుమానాలే కాకుండా ధనాగారం నుండి మరికొన్ని రత్నాలు కూర్చబడిన హారాలను విష్ణుచిత్తునకు బహూకరించి పండితుల సమక్షంలో ఘనంగా సన్మానించాడు.

**"వేద వేద్యంబైన విష్ణుతత్వంబిట్లు**
**వాదు గెలిచి తెలిపి వసుమతీశు**
**భక్తి నోలలార్చి భగవత్ర్పపన్నుగా**
**జేసి లోక హితము సేయుటయును**
**చిత్తమందు విష్ణుచిద్రూపు దాల్చియు**
**విష్ణు తత్వమంత విప్పి చెప్పి**
**మధుర రాజు యొక్క మన్నన లొందెయు**
**విష్ణుచిత్తు డెంతొ వినుతి గాంచె"**

వటపత్రశాయి కృపా కటాక్షాలతో పండిత సభలో విజయం సాధించిన విష్ణుచిత్తుని పాండ్యరాజు మరియు మంత్రి సెల్వనంబితో కలిసి పట్టపుటేనుగుపై ఎక్కించి ఊరేగించారు. అట్లు వైభవముగా మేళతాళములతో ఛత్ర చామరములతో ఊరేగించుచుండ విష్ణుచిత్తునకు జరుగు మహోత్సవమును చూచుటకై శ్రీమన్నారాయణుడు గరుడ వాహనారూఢుడై ఆకాశమున వేంచేయగా ఆయనను దర్శించిన విష్ణుచిత్తుడు తన్మయత్వము పొంది ఏనుగు పైనున్న గంటలను తన చేత గొని మ్రోగించుచు తిరుప్పల్లాణ్డు అనే దివ్య ప్రబంధమును కృప చేసిరి.

ఆ దివ్య ప్రబంధ సారార్థము సర్వేశ్వరునికి లోకులచే దృష్టి దోషము కలుగకుండుటకై అతనిని, అతని పరివారమును క్షేమముగా ఉండవలయునని మంగళాశాసనము చేశారు.

**"జయ జయ దానవ దారణ కారణ**
**శారంగ రధాంగ గదాసి ధరా**
**జయ జయ చంద్ర దినేంద్ర శతాయుత**
**సాంద్ర శరీర మహా ప్రసర**
**జయ జయ తామర సోదర సోదరి**
**చారు పదోజ్ఝిత గాంగఝురా**
**జయ జయ కేశవ విష్ణూదన**
**శౌరి శరజ్జలజాక్షాహరీ"**

రాక్షసుల యొక్క ఛేదనమునకు హేతువులగు ధనువును, చక్రమును, గదను, నందకమను ఖడ్గము ధరించిన స్వామీ! సర్వోత్కృష్టుడవుగా ప్రవర్తిల్లుచూ, చందురుల యొక్కయు,

సూర్య ల యొక్కయు, పదివేల శత సంఖ్యల యొక్కయు, తఱ చైన దివ్యమంగళ విగ్రహము యొక్క, కాంతుల యొక్క వ్యాప్తి కలవాడా, తామరపువ్వుల యొక్క అంతర్భాగమునకు తోబుట్టువును, సుందరమగు పాదముల చేత విడువబడిన గంగానది సంబంధి యగు ప్రవాహము గలవాడా, బ్రహ్మ రుద్రులకు ఉత్పత్తి స్థానము కలవాడా, నీకు జయమగు గాక అని మంగళాశాసనము చేశాడు విష్ణుచిత్తుడు. లోకులెల్లరు తమ తమ క్షేమముల కొరకు భగవంతుణ్ణి ఆశ్రయించుదురు. కాని భగవంతుని క్షేమము కోరి మంగళాశాసనము చేసిన విష్ణుచిత్తుడు పెరియాళ్వారు (పెద్ద ఆళ్వారు) గా ప్రసిద్ధి గాంచాడు. పాండ్యరాజైన మత్స్యధ్వజుడు కూడా పెరియాళ్వారులను ఆశ్రయించి వారివలన మంత్ర మంత్రార్థములను పొంది వారికి అత్యంత ప్రియశిష్యుడై శ్రీవిల్లిపుత్తూరు వటపత్రశాయికి అనేక కైంకర్యములను ఆచార్య ప్రీతికై యొనర్చి తరించెను. పెరియాళ్వార్లు తిరుప్పల్లాణ్డు 12 పాశురములను, తిరుమొషి 473 పాశురములు గల దివ్య ప్రబంధములను కృప చేశారు.

వీరు పాడిన దివ్య తిరుపతులు పదమూడు. అవి శ్రీరంగము, శ్రీవిల్లిపుత్తూరు, ధన్వినవ్యపురము, తిరుక్కూడల్ (దక్షిణ మధుర), కురుకాపురి (ఆళ్వారు తిరునగరి) గోపపురం (తిరుకొట్టియార్) కురంగనగరం (తిరుక్కురుం గుడి), శ్వేతాద్రి (తిరువేళ్ళరై), తిరుమాలిరుంశోలై (మందరాచలం), తిరుక్కణ్ణపురం (శ్రీకృష్ణ నగరం), తిరువేంగడం (శేషాద్రి) అవ్వుక్కు దత్తాన్ (పురుషోత్తమ పట్టణము), నందవ్రజము (గోకులము) మొదలగు పుణ్యక్షేత్రాల దేవుళ్ళపై అనేక పాశురములు పాడి తరించాడు విష్ణుచిత్తుడు.

నిత్యము విష్ణువును చిత్తమునందు గలవాడగుటచే విష్ణుచిత్తుడనియు, భట్టవంశమున శ్రేష్ఠుడగుటచే భట్టనాథుడనియు, భగవంతునికి మంగళాశాసనం చేయడం ద్వారా పెరియాళ్వార్ అని ప్రసిద్ధి పొందాడు. విష్ణుచిత్తుడు పూలమొక్కలకు పాదులు తవ్వి భగవంతునికి మాలలు సమర్పించే ఒక సామాన్య భక్తుడు. భగవంతుని కృపాకటాక్షాలు ఉన్నచో ఎంతటి పండితుడు కాగలడో ఈ వృత్తాంతం తెలియజేస్తుంది.

# మీ ప్రశ్న మా సమాధానం

నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1. మన భారతీయ సంస్కృతి, విశ్వసంస్కృతికి ఏ కారణాల వల్ల ఆదర్శప్రాయమైనది?**

జవాబు – మంచి ప్రశ్న.

**సత్యాహింస గుణైః శ్రేష్ఠా**
**విశ్వబంధుత్వ శిక్షికా**
**విశ్వశాంతి సుఖ ధాత్రీ**
**భారతీయాహి సంస్కృతిహిః**

శ్రేష్ఠమైన సత్యా మార్గానుసరణం, అహింసా మార్గావలంబనంతో కూడినట్టిది, విశ్వంలోని మనుష్యులందరూ ఒకే కుటుంబానికి చెందినవారని చెప్పేది, విశ్వశాంతిని, విశ్వసౌఖ్యాన్ని మాత్రమే కాదు, అన్ని లోకాల సుఖ సౌఖ్యాలను (లోకా స్సమస్తా సుఖినో భవంతు... అని కదా మన ప్రార్థన) అపేక్షించేదే మన భారతీయ సంస్కృతి. ఈ కారణం చేతనే మన సంస్కృతి ఆదర్శప్రాయమైనది, ఆచరణ యోగ్యమైనది కూడా.

**2. సత్యం అంటే...? - మైసయ్య, తార్నాక.**

జవాబు – ఉన్నది ఉన్నట్లుగా పలకడం కాదు సత్యం అంటే. సకల ప్రాణుల హితం కోరేది, అప్రియం కానిదే సత్యం. న బ్రూయాత్ సత్యమప్రియం. బాధ కలిగించే సత్యమును పలుకరాదనేది సూక్తి.

**3. “సర్వ ప్రహరణాయుధ ఓమ్ నమ ఇతి” అని ఉంది కదా శ్రీ విష్ణునామ స్తోత్రం చివరన. దీనిని కొంచెం వివరించగలరా?**

**-కృష్ణవేణి, బెంగుళూరు**

జవాబు – ‘ఓమ్’నే ప్రణవం అని అంటారు. ఈ లోకాలన్నీ కూడా ప్రణవం నుంచి ప్రభవించి చివరికి ప్రణవంలోనే లయిస్తాయి. అదే బ్రహ్మ, అదే విష్ణువు, అదే కామేశ్వరుడైన పరమశివుడు. అంతేకాదు, పరమాత్మకు లేని ఆయుధం లేదు. వాటిని ఆయన దండన – మండనలు రెంటికీ ఉపయోగిస్తాడు. అనగా శిక్షించేందుకు, రక్షించేందుకు కూడా. అలా చేసే స్వామి సర్వ ప్రహరణాయుధుడు. ఇంతేకాక ఈ ప్రణవంలో మూర్తిత్రయం, వేదత్రయం, కాలత్రయం, మాత్రాత్రయం, గుణత్రయం, భువనత్రయం, అవస్థాత్రయం – అన్నీ కనిపిస్తాయి. కాబట్టి ఈ సత్యానికి నమస్కరించడమే మన జీవిత లక్ష్యం కావాలి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## భక్త కనకదాసు

విజయనగర సామ్రాజ్యాన్ని కృష్ణదేవరాయలు పరిపాలించే కాలంలో 'బీరప్ప' అనే యాదవ కుల శ్రేష్ఠుడు సేనాధిపతిగా ఉండేవాడు. బీరప్ప – బచ్చమ్మ దంపతులకు సుదీర్ఘకాలం తరువాత తిరుమలేశుని కృప వల్ల పుత్రసంతానం కలిగింది. తల్లితండ్రులు ఆ బాలునికి 'తిమ్మప్ప' అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచారు. 1509వ సంవత్సరంలో కర్ణాటకకు చెందిన హవేరీ జిల్లా 'బాద్' గ్రామంలో తిమ్మప్ప జన్మించినట్లుగా చరిత్రకారులు అభిప్రాయపడుతారు.

దైవచింతనకు దూరమై భోగభాగ్యాలకు అలవాటుపడిన తిమ్మప్ప యుక్తవయస్సులో ఉండగానే తల్లితండ్రులు దూరమయ్యారు. తన కటాక్షంతో జన్మించిన తిమ్మప్పను సన్మార్గంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఆదికేశవుడు అనేక పర్యాయాలు తిమ్మప్ప స్వప్నంలో ప్రత్యక్షమై తనవైపు దృష్టి మరల్చుకుని మోక్షమార్గంలో పయనించవలసిందిగా ఆదేశించాడు. కాని తిమ్మప్ప సాక్షాత్తు శ్రీహరి హితబోధను సైతం పెడచెవిన పెట్టి, ఐహికవాంఛల సాధనకే మొగ్గు చూపాడు. నిత్యపూజను, సంధ్యానుష్ఠానాలను, హరినామస్మరణాన్ని, సత్పురుషుల సాంగత్యాన్ని త్రోసిరాజన్నాడు.

### కరస్పర్శతో బాధోపశమనం

ఆ ఘటనా ఘటన సమర్థుని లీలావిలాసం ఎలా ఉంటుందో ఎవరికి తెలుసు? యుద్ధరంగంలో చిచ్చరపిడుగులా చెలరేగిపోయే తిమ్మప్పకు ఒకనాడు తీవ్రమైన గాయం అయింది. శత్రుసైనికుని ఖడ్గ ప్రహారంతో ఒడలంతా రక్తసిక్తమై, భరింపరాని బాధతో విలవిలలాడుతున్న తిమ్మప్పకు ఆదికేశవుడు మరలా స్వప్నంలో ప్రత్యక్షమయ్యాడు. రాగద్వేషాలను, ప్రాపంచిక బంధాలను, భోగలాలసత్వాన్ని విడనాడి తనను శరణు వేడమని పదే పదే సెలవిచ్చాడు. బాధతో దిక్కుతోచని తిమ్మప్ప తీవ్రంగా వేధిస్తున్న గాయం నుంచి తనకు సత్వర ఉపశమనం కలిగితేనే తాను ఆదికేశవుని ఆరాధించుకుంటానని, లేకుంటే తానెప్పటికీ శ్రీహరిని సేవించుకోనని మొండిగా బదులిచ్చాడు. దానితో శ్రీవేంకటేశ్వరుడు చిద్విలాసం చిందిస్తూ తన కరస్పర్శతో తిమ్మప్ప శారీరక రుగ్మతను పూర్తిగా తొలగిస్తాడు. ఆ ఉదంతంతో శ్రీహరి మహిమను గుర్తెరిగిన తిమ్మప్ప జ్ఞానోదయం కలిగినవాడై, మోహవాంఛలను విడనాడి శ్రీవేంకటేశ్వరునికి పరమ భక్తుడయ్యాడు.

### కనకతూము

వ్యాసరాయలవారి ఆదేశం మేరకు, యమాంశ సంభూతుడైన తిమ్మప్ప, యముని వాహనమైన మహిషం సాయంతో ఒక పంటకాలువ త్రవ్వకానికి ఆటంకం కలిగిస్తున్న బండరాయిని తొలగించాడు. తద్వారా నిమ్నకులస్తుడన్న కారణంగా ఒకప్పుడు తనను తిరస్కరించిన వ్యాసరాయల వారి మెప్పును సంపాదించి, వారి ద్వారా దాసదీక్షను పొందాడు. నాటినుంచి తిమ్మప్పే 'కనకదాసు'గా వ్యవహరింపబడుతున్నాడు. కనకదాసు

జ్ఞాపకంగా 'కనకతూము'గా పిలువబడే ఈ కాలువ చిత్తూరుజిల్లా మదనపల్లి శివారులో ఉంది.

**శ్రీనివాసుని చిద్విలాసం**

దాసదీక్షను పొంది తనను మనస్ఫూర్తిగా సేవించుకుంటున్న కనకదాసుకు ఒకనాడు స్వప్నంలో కనిపించిన శ్రీవేంకటేశ్వరుడు తన బ్రహ్మోత్సవాలకై తిరుమలకు రావలసిందిగా ఆహ్వానం పలికాడు. భగవంతుని ఆదేశానుసారం తిరుమలకు చేరుకున్న కనకదాసు నిలువనీడ లేక; ఎముకలు కొరికే చలిలో గజగజా వణుకుతూ, ఆరుబయటే విశ్రమిస్తాడు. భక్తుని దీనావస్థతో హృదయం ద్రవించిన శ్రీనివాసుడు నడిరేయి ఒక ఆజానుబాహువు రూపంలో వచ్చి కడుపు నింపుకోవడానికి శ్రీవారి ప్రసాదాన్ని, కప్పుకోవడం కోసం సరిగంచు పట్టు వస్త్రాన్ని ప్రసాదించి అదృశ్యమయ్యాడు. తదనంతరం ఆలయ యాజమాన్యం వారికి స్వప్నంలో సాక్షాత్కరించి తన భక్తుడు కనకదాసును ఆలయంలోనికి తోడ్కొని రావలసిందిగా ఆదేశించాడు.

మరునాటి ఉదయం కనకదాసు ఆలయ ద్వారం వద్దకు చేరుకోగా, నిరుపేదవలె గోచరిస్తున్న ఆ దాసభక్తుణ్ణి దేవాలయ సిబ్బంది గుర్తించలేకపోయారు. తత్ఫలితంగా కనకదాసుకు ఆలయ ప్రవేశం నిరాకరించబడింది. కనకదాసు ఆవేదనతో, ఆర్తితో నిద్రాహారాలు లేకుండా ఆ రాత్రంతా శ్రీనివాసుణ్ణి స్మరించుకుంటూ ఆలయం బయటే నిరీక్షించాడు. దైవసంకల్పంతో అదే రాత్రి ఆలయంలో శ్రీవారి నగలు చోరీ అయ్యాయి. ఆ నేరం దేవాలయం ముంగిట వేచివున్న కనకదాసుపై మోపబడింది. ఆలయ యాజమాన్యం నిష్పక్షపాతమైన విచారణ జరపకుండానే కనకదాసుకు కొరడాదెబ్బల శిక్ష విధించింది. కనకదాసు మాత్రం కాగల కార్యం గంధర్వులే తీర్చుతారన్నట్లు, భారమంతా దేవునిపై వేసి నిశ్చింతగా శ్రీహరిని స్మరించసాగాడు. ఆర్తత్రాణ పరాయణుడైన అలమేలు మంగాపతి ఆలయ అధికారులకు స్వప్నంలో దర్శనమిచ్చి జరిగిన వృత్తాంతమంతా తెలియజేస్తాడు. తన భక్తుడైన కనకదాసును అనుమానించి, అవమానించినందుకు ఆ ఆనందనిలయుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. తమ తప్పు తెలుసుకున్న ఆలయ అధికారులు కనకదాసు పాదాలపై పడి క్షమాభిక్ష వేడుకుని; దైవదర్శనార్థం కనకదాసును ఆలయం వద్దకు తోడ్కొని వెళతారు. దేవాలయం తలుపులు తీయగానే పోయినట్లు భావించబడిన ఆభరణాలతో స్వామివారు దర్శనమిస్తారు. ఆవిధంగా కనకదాసు భక్తి తత్పరతను శ్రీవారు లోకవిదితం చేసి, ఆ దాసభక్తుని కీర్తిని అజరామరం కావించారు.

**కనకభండి అంటే!**

సుదీర్ఘకాలం పాటు శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో తరించిన కనకదాసు శ్రీకృష్ణుని సన్నిధానమైన 'ఉడిపి' క్షేత్రం చేరుకుంటాడు. తొలి ప్రయత్నంలో అక్కడ కూడా నిరాశే ఎదురైంది. ధర్మకర్తలు శ్రీకృష్ణుని దివ్యదర్శనానికై ఉవ్విళ్ళూరుతున్న కనకదాసుకు, నిమ్నకులస్తుడన్న కారణంతో ఆలయప్రవేశం నిరాకరిస్తారు. కనకదాసు పదే పదే ప్రాధేయపడినప్పటికీ, కరుడు గట్టిన ధర్మకర్తల మనసు కరగలేదు. పరమ భాగవతోత్తముడైన కనకదాసు యొక్క ఆర్తి, దర్పము, డాంబికము, అభిజాత్యాలకే ప్రథమ తాంబూలమిచ్చే ధర్మకర్తలకు అర్థం కాలేదు. కలత చెందిన మనస్సుతో, నిరాశ ముప్పిరిగొనగా కనకదాసు ఆలయం వెనకభాగానికి వెళ్ళి రోదించసాగాడు. భక్తవత్సలుడైన చిన్నికృష్ణుని హృదయం ద్రవించింది. తన భక్తుని క్లేశాన్ని తొలగించాలని సంకల్పించాడు. అంతే! గర్భాలయం వెనుకనున్న రాతికుడ్యం కకావికలైపోయింది. తూర్పుముఖంగా ఉండే శ్రీకృష్ణుడు పడమర వైపుకు తిరిగి, రాతి కుడ్యంలో ఏర్పడిన ఖాళీ ప్రదేశం ద్వారా కనకదాసుకు దర్శనమిచ్చాడు. ధర్మకర్తల పటాటోపం పటాపంచలయింది. దేవదేవుని దివ్యదర్శనంతో పులకించిన కనకదాసు పరమానందభరితుడై, శ్రీకృష్ణునిపై ఆశువుగా అ నేక కీర్తనలు ఆలపించాడు. భక్త కనకదాసు పట్ల శ్రీకృష్ణుని కటాక్షానికి గుర్తుగా ఇప్పటికీ ఆ దేవాలయ పశ్చిమ ముఖద్వారాన్ని 'కనక భండి'గా వ్యవహరిస్తారు. అంటే కనకదాసు స్వామివారిని దర్శించుకున్న 'కిటికీ' లేదా 'దర్శన ద్వారము' అని అర్థం.

**సంగీత సాధన**

ఈ విధంగా పెక్కుమార్లు భగవంతుని కటాక్షింపచేసుకుని, వారి దివ్యదర్శన భాగ్యంతో పునీతుడైన కనకదాసు 90 వసంతాలు జీవించి, వేలాది కీర్తనలను రచించాడు. వీరి రచనలలో 'మోహన తరంగిణి', 'నళ చరిత్ర', 'హరిభక్తసార' అన్న గ్రంథాలు ముఖ్యమైనవి. 'నమ్మమ్మ శారదె ఉమామహేశ్వరి', 'ఇష్టుదిన ఈ వైకుంఠ ఎష్టు దూరవో', 'ఏసుకయంగళ నళిదు ఎంభత్తు నాల్కులక్ష జీవరాశి యన్ను', 'ముట్ట బేడముట్టబెడ', 'పరమ పురుషని నెల్లిశాయి' అనే లోక ప్రసిద్ధమైన కన్నడ కృతులను రచించారు. వారి కీర్తనలను కన్నడ భాషలో 'ముండిగెగళు'గా వ్యవహరిస్తారు. కనకదాసు కృత –

'లాలి పావన చరణ లాలి అఘహరణ!
లాలి వేంకటరమణ లలిత కళ్యాణ!!'

అనే జోలపాటను వైష్ణవాలయాల యందు పవళింపు సేవ సమయంలో ఎక్కువగా పాడుతుంటారు. వారు రచించిన కృతులలో నిందాస్తుతికి పేరెన్నిక గన్న 'బందెవయ్య గోవింద శెట్టి' అనే పాట కూడా సుప్రసిద్ధమే.

పరమపావన చరితుడైన కనకదాసు, దాసభక్తులందరికీ గురుతుల్యుడే!

కర్ణాటక ప్రభుత్వం కనకదాసు జయంతిని సెలవుదినంగా

ప్రకటించి, ఆ దాసభక్తునికి ప్రతి సంవత్సరం శ్రద్ధాభక్తులతో నివాళి అర్పించు కుంటుంది. వారి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంలా నిర్వహిస్తుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు కనకదాసు జయంతిని ఘనంగా జరుపుకుంటాయి.

**దాసదీక్ష**

ఒకసారి దాసదీక్ష తీసుకుంటే ఆ దాసుడు జీవిత చరమాంకం వరకు తాను హరికి దాసుడననే భావనతో, నిరాడంబరమైన, ఉదాత్తమైన, భగవద్భక్తితో కూడుకున్న దాసజీవితాన్ని గడపాల్సి ఉంటుంది. సన్యాసాశ్రమాన్ని స్వీకరించాల్సిన ఆగత్యం లేదు. దాస పరంపరలో గృహస్థాశ్రమాన్నే మోక్షసిద్ధికి సులభమార్గంగా భావిస్తారు. గృహస్థాశ్రమ ధర్మాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తూనే, అరిషడ్వర్గాలను అదుపులో ఉంచుకోవాలి. దాసుని యొక్క ఆధ్యాత్మిక స్థాయిని బట్టి, తగిన దేవరనామం ప్రసాదింపబడుతుంది. పరిపక్వత చెందిన ప్రతి దాసభక్తుడు తన ద్వారా దాసదీక్ష తీసుకుని, దాస జీవితాన్ని సాధన చేసే మరో ముముక్షువుకు ఒక 'అంకితనామం' ప్రసాదించవచ్చు. ఆ విధంగానే వ్యాసరాయలవారు తన శిష్యుడైన శ్రీనివాస నాయక్ కు 'పురందరదాసు'గానూ, తిమ్మప్పకు 'కనకదాసు'గానూ నామకరణం చేశారు. ఇద్దరు దాసభక్తులు ఒకరికొకరు తారసపడితే 'హరే శ్రీనివాస' నామోచ్చారణతో సంభాషణ ప్రారంభించి, అదే నామస్మరణతో ముగిస్తారు. అంటే, వారు ప్రతి భక్తునిలో భగవంతుణ్ణే దర్శించుకుంటారన్నమాట.

భక్తి ఉద్యమంతో దక్షిణాది రాష్ట్రాలకు, మహారాష్ట్ర లోని మారుమూల ప్రాంతాలకు సైతం చొచ్చుకుపోయిన ఈ దాసభక్తులు ఏటా తిరుమలలో జరిగే మెట్లోత్సవాలు మరియు బ్రహ్మోత్సవాలలో నృత్యగానాలతో సందడి చేస్తుంటారు. ఒకప్పుడు కేవలం వందల్లో ఉండే వీరి సంఖ్య క్రమంగా వేలల్లోకి చేరుకుంది. దాసభక్తుల్లో స్త్రీలు పసుపురంగు చీరెనూ, పురుషులు కాషాయరంగు ధోవతి, తలపాగానూ ధరించి ఉంటారు. నాట్య బృందాలుగా ఏర్పడి తన్మయత్వంతో హరినామ సంకీర్తనలో లీనమై కానవస్తారు.

**దాస సాహిత్య ప్రాజెక్టు**

దాస పరంపర గురించిన సమాచారం, మరుగున పడ్డ దాసభక్తుల వివరాలు, వారి దేవర నామాలు వంటి వివరాలను; ఆధ్యాత్మిక అంశాలకు ఆలవాలమైనట్టి దాససాహిత్యాన్ని భావితరాలకు భద్రంగా అందించేందుకు తితిదే ద్వారా ఎనభయ్యవ దశకంలో రూపొందించబడిందే ఈ దాససాహిత్య ప్రాజెక్టు. వేసవిలో ఆధ్యాత్మిక శిబిరాల నిర్వహణ, దాసభక్తుల ఆరాధనోత్సవాలు నిర్వహించడం, వివిధ భజన బృందాల మధ్య ఆరోగ్యకరమైన స్పర్ధలు ఏర్పాటు చేయడం సరళమైన భాషలో దాససాహిత్యంపై చిరుపొత్తాల ప్రచురణ ముఖ్యగునవి దాసప్రాజెక్టు లక్ష్యాలు. ఈ ప్రాజెక్టు ఆధ్వర్యంలో దాససాహిత్యంపై అనేక తెలుగు, కన్నడ, ఆంగ్ల పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయి. దాసవ్యవస్థకు సంబంధించిన అనేక ప్రదర్శనలు కూడా నిర్వహించబడ్డాయి. వివిధ దాసభక్తుల చిత్తరువులను, వారు ఉపయోగించిన సాధనాలను, వారి గృహాల నమూనాలను, వారు ఆరాధించిన భగవద్రూపాలను కూడా ఈ ప్రాజెక్టు సేకరించింది. ఒక సాహిత్య ప్రచార ఉద్యమంలా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు కాలక్రమేణా భక్తిసాధన ఉద్యమంగా మారి, దక్షిణ భారత దేశమంతా విస్తరించింది. దాససాహిత్య ప్రాజెక్టు ప్రచురణల్లో ముఖ్యమైనవి – కర్ణాటక హరిదాసుల యొక్క పదకోశం, ఇప్పటివరకు ముద్రణకు నోచుకోని దాసభక్తుల రచనలు, కర్ణాటక హరిదాసుల సంక్షిప్త చరిత్ర, హరిదాసుల వర్ణచిత్రాలు, పరిశోధన పత్రాలు, వివిధ గోష్ఠులలో చర్చకు వచ్చిన అంశాలు – మొదలైనవి. హరిదాసుల యొక్క ఆరాధనోత్సవాలు నిర్వహించటం ఈ ప్రాజెక్టు యొక్క మరో ముఖ్యోద్దేశం.

భజన మండళ్ళ ద్వారా ప్రజలలో నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మిక శక్తిని జాగృతపరచి, సభ్యసమాజంలో ధర్మం వేళ్ళూనుకునేలా చేసే మహత్తర లక్ష్యంతో ఆవిర్భవించిన 'దాససాహిత్య ప్రాజెక్టు' తన లక్ష్యాన్ని చేరుకోవడంలో సఫలీకృతమవుతుందని ఆశిద్దాం. ఉడతాభక్తిగా మన సాయం అందిద్దాం. ధర్మో రక్షతి రక్షితః అంటే మనం ధర్మాన్ని రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది.

**మెట్లోత్సవం**

సాంప్రదాయ పద్ధతిలో, హరిదాసులు సూచించిన విధంగా మెట్లెక్కుతూ, సప్తగిరులను ఉల్లాసంగా, ఉత్సాహభరితంగా, సంగీత – నృత్య కోలాహలంతో చేరుకోవడాన్ని 'మెట్లోత్సవం' అంటారు. వేలాదిమంది భజనబృందం సభ్యులు, దాసభక్తులు హరిదాసుల వేషం ధరించి, భజన కీర్తనలు పాడుతూ, ప్రఖ్యాత హరిదాసుల చిత్రాలను తిరుపతిలోని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ, భక్తజన సమ్మోహనంగా అలిపిరికి చేరుకుంటారు. మొదటిరోజు ఊరేగింపు తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రారంభమై, త్యాగరాజ మండపం చేరుతుంది. అక్కడ 'హరిదాస సంధ్య సంకీర్తన' అనే సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించబడుతుంది. మరునాటి ఉదయం అలిపిరి నుండి బయలుదేరి, మెట్టు మెట్టుకూ నమస్కరిస్తూ, భజనలతో, కోలాటాలతో కీర్తనలు ఆలపిస్తూ, అంచెలంచెలుగా, నయనానందకరంగా తిరుమలకు చేరుకునే సాంప్రదాయిక ప్రక్రియే మెట్లోత్సవం. మూడవరోజు తిరుమల క్షేత్రంలో వైభవోపేతంగా ఊరేగింపు నిర్వహిస్తూ తమ కీర్తనలతో, నృత్య గానాలతో పండుగ వాతావరణాన్ని సృష్టిస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున – సంవత్సరంలో నాలుగుసార్లు – మూడు రోజుల పాటు – ఈ మెట్లోత్సవం జరుగుతుంది.

# అష్టలక్ష్మి స్వరూపాలు

1.ఆదిలక్ష్మి 2. విద్యాలక్ష్మి 3. ధనలక్ష్మి 4. ధాన్యలక్ష్మి 5. ధైర్యలక్ష్మి 6. గజలక్ష్మి 7. విజయలక్ష్మి 8. సంతానలక్ష్మి అంటూ ఎనిమిది రూపాలుగా లక్ష్మీదేవిని పూజిస్తుంటాం.

**ఆదిలక్ష్మి:**

లక్ష్మీమూర్తులలో ప్రధానమైన పరాశక్తి రూపంగా ఆదిలక్ష్మిని వ్యవహరిస్తుంటారు. సర్వవ్యాప్తమై, అన్ని రకాలైన ఐశ్వర్యరూపిణిగా ఆ తల్లి సాక్షాత్కరిస్తుంది. పద్మంతో కూడిన అభయముద్ర, వరదముద్ర, మంగళకరమైన ఉత్తమ సాముద్రిక లక్షణాలతో ఆ తల్లి దర్శనమిస్తుంటుంది. అందుకే ఈ లక్ష్మీరూపాన్ని ఆదిలక్ష్మి అంటారు.

**విద్యాలక్ష్మి :**

ఈ లక్ష్మిని ఐశ్వర్యలక్ష్మి అని కూడా అంటారు. అభయ, వరద ముద్రలతో, మరో రెండు చేతులలో పద్మాలతో విద్యాలక్ష్మి దర్శనమిస్తుంటుంది. బుద్ధి, జ్ఞానాలతో పాటు ఈ తల్లి సమస్త విద్యలను ప్రసాదిస్తుంది.

**ధనలక్ష్మి :**

అభయ వరద ముద్రలతో రెండు తామరలతో, మిగిలిన నాలుగు చేతులలో విల్లు, సువర్ణ కలశం, శంఖు చక్రాలతో దర్శనమిచ్చే ధనలక్ష్మి సద్యోగాలనిచ్చే ధనానికి అధిష్ఠాన దేవత. గోధనం, భూధనం అంటూ సమస్త సంపదలు ఈ తల్లి ప్రసాదాలు.

**ధాన్యలక్ష్మి :**

అభయ వరద ముద్రలతో, రెండు తామర పువ్వులు, గద, చెరుకుగడ, సస్యం, అరటి గెలను చేతులతో ధరించి దర్శనమిచ్చే ఈ తల్లి సమస్త సస్యప్రదాయిని. సమస్త భూతకోటికి ఆధారం అన్నం. ఆ అన్నాన్ని అధిష్ఠించిన దేవత ధాన్యలక్ష్మి. స్వాహా, స్వధా రూపిణిగా పితృదేవతలకు కూడా అన్నాన్ని అందిస్తున్న ఆ తల్లి కరుణ లేనిదే జీవజాలం లేదు. ఈ భూ ప్రపంచంలోని సమస్త సస్య, అరణ్య, నదీ నదాలు ఆ తల్లికి ప్రతిరూపాలే

**ధైర్యలక్ష్మి :**

ఈ తల్లినే వరలక్ష్మి అని కూడ కొలుస్తుంటారు. ఏ పని చేయాలన్నా ధైర్యం అత్యంతావశ్యకం. ఒక పని చేయాలనుకున్న తర్వాత చివరిదాకా, దాన్ని సఫలం చేసుకునేందుకు, తప్పనిసరిగా కావల్సింది ధైర్యం. ఆ ధైర్య గుణానికి అధిష్టాన దేవి ధైర్యలక్ష్మి.

**గజలక్ష్మి :**

అభయ వరద ముద్రలలో రెండు తామర పువ్వులతో దర్శనమిచ్చే గజలక్ష్మి మన ఇంటిని, సంపదలతో నంపే కరుణామయి. కొలనులో పద్మంపై ఆసీనురాలై ఏనుగుల




చేత అభిషేకించబడుతూ దర్శనమిచ్చే ఈ తల్లి ప్రతిరూపాన్ని గృహ ద్వారానికి పైన ఉంచితే, ఆ ఇల్లు అష్టైశ్వర్యాలతో కళకళ లాడుతుందని శాస్త్రం.

**విజయలక్ష్మి :**

అభయ వరదముద్రలు, తామర పువ్వు, శంఖుచక్రాలు, డాలుతో దర్శనమిస్తున్న ఈ తల్లి మనం అనుకున్న రంగాలలో విజయాన్ని అనుగ్రహిస్తుంది. ప్రతి ఒక్కరి లక్ష్యం విజయమే.

**సంతాన లక్ష్మి :**

ఒడిలో బిడ్డతో, అభయ ముద్రతో, కత్తి, డాలు, రెండు కలశాలతో సాక్షాత్కరించే సంతానలక్ష్మి కరుణ లేకపోతే ఈ సృష్టికి మనుగడే లేదు.

అందుకే అందరూ ఆ తల్లి కరుణ కోసం ప్రార్థిస్తుంటారు. మానవజాతి మనుగడకు ప్రధానమైన సంపదలుగా, ఈ ఎనిమిది లక్ష్ములను శాస్త్రం అందించింది. ఈ అష్టలక్ష్ముల అనుగ్రహం మనందరికీ లభించు గాక!

★★★

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు చేయు వృత్తివ్యాపారములందు అధిక ఫలితములు. శత్రువులపైన విజయం సాధించగలరు. సం తానలాభం. విందు, వినోదములు, వాహన సౌఖ్యము. పిల్లల వివాహ ప్రయత్నములు చేయండి. మొహమాట పడరాదు. నవగ్రహ పూజలు, జపాలు, దానాలు ఇవ్వండి.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు శత్రువులు మిత్రులుగా మారుట. ఆకస్మిక ధనాదాయం. విందు భోజనములు, దూరప్రయాణములందు అనుకూలత. తక్కువగా మాట్లాడి ఎక్కువ పనులు పూర్తిచేయండి. వాదోపవాదనలకు సమయం కాదు. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అమ్మవార్ల జపము ప్రయతిరోజు చేయుట వలన ఆర్థికంగా చాలా బాగుంటుంది. ప్రతి విషయంలో సంతృప్తి కలిగి ఉంటారు. కోర్టు కేసులు రాజీమార్గంలో షటిల్ చేసుకోవాలి అనుకుంటే రాజీ జరుగును. పట్టుదలతో ప్రయత్నం చేయండి.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు స్నేహితులు, బంధుమిత్రులు విమర్శించగలరు. ఏసీబీ దాడులు ప్రతి విషయం కత్తి మీద సాములా ఉంటుంది. తెలియని అవరోధములు చాకచక్యంగా ఓర్పుగా నాలికను అదుపులో పెట్టుకోవాలి. ఉద్రేకమునకు సమయం కాదు. ధనాదాయం బాగుంది. శని తైలాభిషేకం చేయండి.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు బంధుమిత్రుల కలయిక విశేషమైన పరిణామములు. ఆనందముగా గడపగలరు. సంగీత సాహిత్యములందు అనుకూలత కలిగి ఉంటారు. లలిత కళలను ఇష్టంగా తిలికించగలరు. మహన్యాస రుద్రాభిషేకం చేయించండి.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈరాశిస్త్రీపురుషులకువృత్తి ఉద్యోగములందు అనుకూలత.ఆర్థికంగా సంతృప్తి ఉంటుంది. నూతనంగా మిత్రుల వలన కొంత అనుకూలత ఆనందం ఉంటుంది. ఈ సమయమును వినియోగించుకొని ప్రగతిపథంలో ఉండండి. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ఏ విధమైన ఆటంకములు. చాలా చాకచక్యంగా ప్లాన్ చేసుకొనిన ఫలితములు ప్రక్కనే ఉండగలవు. ఆర్థిక లాభం, ధనాదాయం వనరులు అనుకూలంగా ఉన్నవి. పోటీ తత్వము వదలి నడుచుకొనగలరు. శివారాధనలు చేయుట వలన కార్యసాధన కలిగి ఉంటారు.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు వృత్తి వ్యాపారములందు అనుకూలత కలిగి ఉంటారు. ఆకస్మికంగా డబ్బు చేతికి అందుతుంది. మీకు తెలియని వారి వలన కూడా సహాయం పొందగలరు. మహన్యాస రుద్రాభిషేకం చేయించుకొనగలరు.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశి స్త్రీ పురుషులకు, వృత్తి వ్యాపారస్తులకు అనుకూలం. అన్ని రంగములలో ఉన్నవారికి, ఉద్యోగము లేనివారికి ఉద్యోగం, ప్రమోషన్ ఉంటుంది. వ్యాపార రంగంలో అధిక లాభములు రాగలవు. సరస్వతి కవచము, లక్ష్మీ కవచము, కనకధార స్తోత్రములు పఠించండి.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని విషయంలో జాగ్రత్తల వలన ముందుకు సాగుటకు అవకాశములు కలిగి ఉన్నారు. ఆర్థిక పరమైన విషయములలో అనుకూలం. వివాహ ప్రయత్నములకు ముందుకు సాగండి. సూర్య ఆరాధన వలన ఊరట కలిగి ఉండగలరు.

## కుంభరాశి

ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్య లాభములు కలిగి ఉన్నారు. ఆదాయ వ్యయములకు చాలా బ్యాలన్స్‌గా ఉంటుంది. కోరికలు అదుపులో పెట్టుకొనిన ఏమాత్రం నిరాశ చెందరాదు. మీ అవసరాలకు డబ్బు సమకూరగలదు. ముందుకు నడవండి. నవగ్రహ ప్రదక్షిణలు, జపాలు, దానాలు ఇవ్వండి.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. బంధుమిత్రుల ఆదరాభిమానములు. ఆర్థిక ఒత్తిడి తగ్గును. గృహంలో అందరిని మాట లతో ప్రేమగా గడపగలరు. ఆనందములో విజయం వరించగలదు. శ్రీ వేంకటేశ్వర స్వామి అలంకరణ చక్కెర పొంగళి ప్రసాదములు చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. అగ్నినక్షత్రం ఏది?
2. తిరుపతిలో మహామంత్రస్థూపాన్ని ఎప్పుడు నిర్మించారు?
3. జామదగ్న్యుడు ఎవరు?
4. లీలాశుకుని గురువు ఎవరు?
5. కార్తీక మాసానికి అధిదేవత ఎవరు?
6. హంస-కాకులలో నువ్వు కాకి వంటివాడివని ఎవరు ఎవరిని గేలి చేశారు?
7. "నరకుడు" అంటే అర్థమేమిటి?
8. పుష్పక విమానాన్ని ఎవరు నిర్మించారు?
9. ఆంజనేయుని గురువు ఎవరు?
10. "శ్రీకృష్ణ కర్ణామృతం" వ్రాసిందెవరు?
11. జగన్నాథునికి కిచిడీ నివేదన చేసే భక్తురాలు ఎవరు?
12. "దాస సాహిత్యం" కర్తలెవరు?
13. పురందరదాసు అనుచరుని పేరేమిటి?
14. నరకాసురుని కొడుకు ఎవరు?
15. తులసీదేవి తల్లితండ్రులెవరు?

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________
6. ______________________
7. ______________________
8. ______________________
9. ______________________
10. ______________________
11. ______________________
12. ______________________
13. ______________________
14. ______________________
15. ______________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. కన్యామాస శ్రవణ నక్షత్రం నాడు, 2. 25-03-2007, 3. తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి, 4. కార్తీక శుద్ధ పాడ్యమి 5. శృంగి ముని, 6. బ్రహ్మదేవుడు, 7. ఐశ్వర్యము, 8. త్రిమూర్తిగా 9. మహాసరస్వతి, 10. సంపాతి, 11. త్రికూట పర్వతం 12. మాధవదాసు, 13. వెన్నముద్దల బతుకమ్మ, 14. సింహిక 15. శమీ / జమ్మి

## సరైన సమాధానాలు రాసినవారు

1. వనమాల రామలింగాచారి, 2. జె. ఇందిర, 3. బులుసు బాబురావు, 4. సూరి సౌభాగ్యలక్ష్మి, 5. కె. సందీప్ కుమార్, 6. ఎస్. నాగరాజు, 7. చిల్లర సీతారామారావు

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**సూరి సౌభాగ్యలక్ష్మి**



Postel Registration No:
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122





**If Un Delivered Please Return to:**

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq